అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

సమగ్ర తెలుగు దినపత్రిక

శుక్రవారం 13-10-2023

సంపుటి : 9 | సంచిక : 235 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50

అస్మదీయులపై వేటు

అంతర్మథనంలో అధికార పార్టీ

కేంద్ర ఎన్నికల సంఘం 20 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై కొరడా ఝుళిపించి, వారిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించింది. వారంతా అధికార బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇవే కాకుండా త్వరలో మరి కొందరు అధికారులపై కూడా ఇదే తరహా వేటు పడుతుందనే ప్రచారం ప్రభుత్వ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. మరి బదిలీ అయిన వారి స్థానాల్లో నియమితులయ్యే కొత్త అధికారులు నిష్పక్షపాతంగా ప్రజల పక్షాన నిలుస్తారా...లేక మరో పార్టీకి అనుకూలురుగా నిలుస్తారా అనే దానిపై ప్రజల్లో చర్చ ప్రారంభమైంది.

రిపీట్ అవుతున్న దుబ్బాక సీన్...

ఈసీ నిష్పాక్షికమేనా?



ఎస్ఎస్ఆర్ శాస్త్రి

నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వ కార్యనిర్వాహక వ్యవస్థ రాజకీయ ప్రాపకం కోసం వెంపర్లాడితే ఫలితాలు ఇలాగే ఉంటాయనే చర్చ రాష్ట్ర ప్రజలు, రాజకీయవర్గాల్లో తీవ్రంగా జరుగుతుంది. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా అనేక మంది ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లు పనిచేశారనేది నిర్వివాదాంశం. అయితే ప్రభుత్వంతో కలిసి పనిచేయడం అని సదరు అధికారులు సమర్థించుకొనే ప్రయత్నం చేసినా, ప్రతిపక్షాలు, ప్రజలకు మాత్రం ఆ అధికారులు అధికారపార్టీకి కొమ్ముకాస్తున్నారనే విషయం స్పష్టంగానే తెలిసిపోతుంది. తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం 20 మంది అధికారులపై వేటు వేసింది. వీరిలో పది మంది సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) కేడర్ అధికారులు ఉన్నారు. వీరిలో సూర్యాపేట ఎస్పీగా పనిచేస్తున్న రజినీర ప్రసాద్ మినహా మిగిలిన 9 మందీ డైరెక్ట్ ఐపీఎస్‌లు కాకపోవడం గమనార్హం. వీరంతా పదోన్నతుల ద్వారా నాన్ కేడర్ ఐపీఎస్‌లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక డైరెక్ట్ ఐపీఎస్‌లుగా ఉన్న ముగ్గురు పోలీస్ కమిషనర్లు సీవీ ఆనంద్, ఏవీ రంగనాథ్, వీ సత్యనారాయణ కూడా ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే చర్చ ప్రజల్లో, ప్రతిపక్షాల్లో జరుగుతున్న విషయం తెలిసిందే. అలాగే ఐఏఎస్ అధికారులై ఉండి రాగద్వేషాలు, భావోద్వేగాలకు అతీతంగా ప్రజల పక్షాన పనిచేయాల్సిన జిల్లా కలెక్టర్లు కూడా రాజకీయ ప్రాపకం కోసం అధికారపార్టీ కనుసన్నల్లోనే పనిచేశారనే ఆరోపణలతో వారిపై కూడా సీఈసీ వేటు వేసింది. ఓటర్ల జాబితాల రూపకల్పనలో వారు ఉదాసీనంగా వ్యవహరించడమే కాకుండా, అనేక అంశాల్లో వారు అధికారపార్టీకి అనుకూలంగా పనిచేశారనేది సీఈసీ అభిప్రాయంగా ఉంది. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ...11లో

ఈసీకి సీఎస్ నివేదిక

నేడు పరిశీలన 2లో..

రాష్ట్రానికి వంద కంపెనీల కేంద్ర సాయుధ బలగాలు

ఈనెల 20 నుంచి విధుల్లోకి... • కొనసాగుతున్న పోలీసుల తనిఖీలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో జరిగే శాసనసభ ఎన్నికల్లో శాంతి భద్రతల పర్యవేక్షణకు వంద కంపెనీల సాయుధ బలగాలను తెలంగాణకు కేటాయించినట్టు కేంద్ర ఎన్ని కల సంఘం రాష్ట్ర ప్రధానాధికారి వికాస్‌రాజ్ తెలిపారు. ఈ బలగాలు 20వ తేదీ నుంచి విధుల్లో చేరతాయన్నారు. ప్రజల ఆస్తుల్ని ఎన్నికల ప్రచారం కోసం వాడుకుంటే సహిం చేది లేదనీ, కచ్చితంగా కేసులు నమోదు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రయివేటు ఆస్తులపై ప్రచార సామాగ్రి తొలగింపు

పట్టుబడుతున్న నగదు, ప్రలోభ వస్తువులు



కేసులు 7,322 నమోదయ్యా యని వివరించారు. అలాగే బుధవారం నుంచి గురువారం సాయంత్రం ఐదు గంటల వరకు ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.6 కోట్ల 27 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎన్నికల...11లో

మార్షల్ లా రోజులు

గుర్తుకొస్తున్నాయి

స్వతంత్ర మీడియాపై ఆగని కక్షసాధింపు చర్యలు

"ఇప్పుడు దేశంలో ఎమర్జెన్సీ లేదు. మార్షల్ లా కూడా అమలులో లేదు. అయినప్పటికీ స్వతంత్ర మీడియాపై యధేచ్ఛగా దాడులు జరుగుతున్నాయి. భారతదేశం ప్రజాస్వామ్యానికి తల్లి లాంటిదనే నానుడి అపహాస్యం పాలవుతోంది" మాజీ రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ ఎస్ఓడీగా పనిచేసిన ఎన్ఎన్. సాహూ చేసిన ఈ వ్యాఖ్యలు ఈ దేశవర్తమానానికి అర్థం పడుతున్నాయి.



ప్రబీర్‌పుర్కాయస్థాను అరెస్టు చేస్తున్న పోలీసులు (ఫైల్)

NEWSCLICK

న్యూఢిల్లీ : న్యూస్‌క్లిక్ పోర్టల్ పైన, అందులో పనిచేస్తున్న, గతంలో పనిచేసిన సిబ్బంది, ఉద్యోగుల నివాసాల పైన జరిగిన దాడులు ప్రపంచాన్ని నివ్వెరపరిచాయి. దేశవ్యాప్తంగా యాభై మంది పాత్రికేయులు సహా సుమారు ఎనభై మంది వ్యక్తుల నివాసాలపై జరిగిన దాడులను బహుశా స్వతంత్ర భారతదేశంలో ఓ మీడియా సంస్థపై జరిగిన అతి పెద్ద దాడిగా చెప్పవచ్చు. పాత్రికేయులపై క్రూరమైన ఉపా చట్టం కింద కేసులు నమోదు చేయడమంటే స్వతంత్ర జర్నలిజాన్ని ఉగ్రవాదంతో ముడిపెట్టడమే అవుతుంది. రెండు రోజుల పాటు న్యూస్‌క్లిక్ పోర్టల్ కార్యాలయాన్ని మూసివేయడంతో దాని రోజువారీ కార్యకలాపాలన్నీ నిలిచిపోయాయి. ఈ వ్యవహారాన్ని చూస్తుంటే జలియన్‌వాలా బాగ్ ఊచకోత తర్వాత పంజాబ్‌లో మార్షల్ లా విధించి అనేక వార్తా పత్రికల సంపాదకులను అరెస్ట్ చేసి విచారించిన ఉదంతం గుర్తుకు వస్తోంది. వాస్తవానికి 2021 నుండీ న్యూస్‌క్లిక్‌తో సంబంధమున్న అనేక మందిపై ఈడీ దాడులు చేస్తూనే ఉంది. పోర్టల్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ నివాసంపై కూడా వారం రోజులు దాడులు చేశారు. ఈ వ్యవహారంలో పోలీసులు ఇంకా ఛార్జిషీటు దాఖలు చేయలేదు. పుర్కాయస్థ, ఇతరులపై బలవంతపు చర్యలు తీసుకోకుండా ఢిల్లీ హైకోర్టు వారికి రక్షణ కల్పించడం ఊరట కలిగించే విషయం.

1919లో జలియన్‌వాలాబాగ్‌లో జరిగిన ఊచకోత ఘటన తర్వాత పంజాబ్‌లో మార్షల్ లా (యుద్ధ చట్టం) విధించారు. అప్పుడు ట్రిబ్యూన్ పత్రిక ట్రస్టీగా వ్యవహరించిన ఓ న్యాయవాదిని వారంట్ లేకుండానే అరెస్ట్ చేశారు. ఏ ఆరోపణపై అరెస్టు చేస్తున్నదీ చెప్పలేదు. ఇప్పుడు పుర్కాయస్థ, అమిత్ చక్రవర్తిని కూడా వారంట్ చూపకుండానే అరెస్ట్ చేశారు. పోలీస్ కస్టడీకి (ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీ) ఎందుకు పంపింది కూడా తెలియజేయలేదు. కనీసం ఎఫ్ఐఆర్ కాపీ సైతం ఇవ్వలేదు. కోర్టును ఆశ్రయించిన తర్వాతే వారికి ఆ కాపీ అందింది.

1919 నుండీ అదే కథ

దేశానికి ద్రోహం తలపెట్టే రాతలు రాస్తున్నారంటూ 1919లో ట్రిబ్యూన్ సంపాదకుడు కాళీనాథ్ రాయ్‌ని అరెస్ట్ చేసి, విచారించి, శిక్ష విధించారు. అయితే ఆయన రాతల్లో అలాంటిదేమీ కన్పించలేదు. అప్పుడే ప్రారంభించిన ప్రతాప్ అనే పత్రిక సంపాదకుడిపై కూడా ఇలాంటి క్రూరమైన చర్యలే తీసుకున్నారు. మార్షల్ లా కాలంలో స్వతంత్ర జర్నలిజం మనుగడకే చోటు లేకుండా పోయింది. ట్రిబ్యూన్, పంజాబీ, ప్రతాప్ పత్రికలు విధిలేని పరిస్థితుల్లో ప్రచురణలు నిలిపివేశాయి. గతంలో కూడా దైనిక్ భాస్కర్ వంటి పత్రికలు, ది వైర్, న్యూస్‌లాండ్రీ, కారవాన్ వంటి వార్తా సంస్థలు పోలీసు చర్యకు గురయ్యాయి. నిబంధనలు, విలువలకు కట్టుబడి కార్యకలాపాలు సాగించినప్పటికీ వాటిపై తీవ్రమైన కక్షపూరిత చర్యలు ఆగలేదు.

గడపగడపకూ వెళ్లాలి...

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలి

• అసెంబ్లీ ఇన్‌ఛార్జ్‌లకు కేటీఆర్ దిశానిర్దేశం



(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని గడప గడపకు వెళ్లాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఆ పార్టీ అసెంబ్లీ ఇన్ ఛార్జీలను ఆదేశించారు. బీఆర్ఎస్ 54 అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జీల జాబితాను విడుదల చేసిన సందర్భంగా గురువారం ఆయన వారితో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ ప్రభుత్వం పదేండ్లలో చేసిన అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి ఓట్లడగాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీలకు కేవలం హామీలు ఇచ్చేందుకే అవకాశముందనీ, బీఆర్ఎస్‌కు చేసిన ప్రగతిని చెప్పుకునే అద్భుతమైన అవకాశముందని తెలిపారు. సంక్షేమ ఫలాలు అందుకున్న ప్రతి ఒక్కరితో మమేకం కావాలని సూచించారు. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రస్థానంలో నెలబెట్టేలా అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల్లా తీసుకెళ్లిన బీఆర్ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టనున్నారని చెప్పారు. ఇప్పటి నుంచే పార్టీ విజయానికి అవసరమైన కార్యాచరణను, కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. వెంటనే రంగంలోకి దిగాలనీ, ఎన్నికలు ఫలితాలు వెలువడే రోజు వరకు ఆయా నియోజకవర్గాల సంపూర్ణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. పార్టీ శ్రేణులన్నింటినీ సమన్వయం చేసుకుని ప్రచార బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. రానున్న 45 రోజుల పాటు నియోజకవర్గంలోనే ఉంటూ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బూత్ కమిటీల నిర్వహణ మొదలుకుని నియోజకవర్గ స్థాయి వరకు అన్ని దశల్లో ప్రచారం పకడ్బందీగా జరిగేలా సమగ్ర ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలన్నారు. ఈ కాన్ఫరెన్స్ లో మంత్రి హరీశ్ రావు ఇన్ ఛార్జీలకు పలు సూచనలిచ్చారు.

ఇన్‌ఛార్జీలు వీరే..

1. బెల్లంపల్లి - ఎంపీ వెంకటేశ్ నేత
2. మంచిర్యాల - ఎమ్మెల్సీ భానుప్రసాద్
3. ఖానాపూర్ - ఎమ్మెల్సీ దండె విఠల్
4. బోథ్ - మాజీ ఎంపీ నగేశ్
5. ముధోల్ -మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్
6. బోధన్ - ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
7. ఎల్లారెడ్డి -మాజీ ఎమ్మెల్సీ వీ..గంగాధర్ గౌడ్
8. కామారెడ్డి -ఎమ్మెల్యే గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మంత్రి కేటీఆర్
9. నిజామాబాద్ అర్బన్ - ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
10. జగిత్యాల - ఎమ్మెల్సీ రమణ, మాజీ మంత్రి రాజేశం గౌడ్
11. రామగుండం - మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్
12. మంథని - ఈద శంకర్ రెడ్డి
13. పెద్దపల్లి -చైర్మెన్ రవీందర్ సింగ్
14. చొప్పదండి - మంత్రి గంగుల కమలాకర్

వివరాలు 11లో..

బీజేవైఎంలో లొల్లి

గొడవకు కారణమైన జాతీయ అధ్యక్షులు తేజస్వీ సూర్య

• యువమోర్చా ఏర్పాటు చేసిన చోట బస చేయని వైనం

వివరాలు 2లో..

• అలిగిన బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు..ఫోన్ స్విచ్ఛాఫ్

• రసాభాస నడుమ సోషల్ మీడియా వర్క్‌షాపు

నేటినుంచి బడులకు

దసరా సెలవులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలలకు శుక్రవారం నుంచి దసరా సెలవులుంటాయని విద్యాశాఖ ప్రకటించింది. ఈనెల 25 వరకు 13 రోజులుపాటు ఈ సెలవులుంటాయని స్పష్టం చేసింది. జూనియర్ కళాశాలలకు ఈనెల 19 నుంచి 25 వరకు ఏడు రోజులు సెలవులిచ్చింది. ఈనెల 26 నుంచి పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో తరగతులు పున:ప్రారంభమవుతాయి. శనివారం నుంచి 24 వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలోని కాలేజీలకు దసరా, బతుకమ్మ సెలవులుంటాయని ప్రకటించింది. ఈనెల 25న ఆ వర్సిటీ పరిధిలోని కాలేజీలు పున :ప్రారంభమవుతాయి. అయితే దసరా పండుగ సెలవును ఈనెల 24న కాకుండా 23వ తేదీకి రాష్ట్ర ప్రభుత్వం మార్పు చేసిన విషయం తెలిసిందే. ఈనెల 14 నుంచి బతుకమ్మ పండుగ ప్రారంభమవుతుంది.

కులగణనతో ఇరకాటంలో బీజేపీ

దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఇండియా కూటమి బలం

మతోన్మాదాన్ని పెంచడంపైనే మోడీ సర్కారు దృష్టి

• కులవ్యవస్థను కొనసాగించడమే సనాతన ధర్మం • కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలతో డిఫెన్స్‌లో కేసీఆర్ : తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలో అధికారంలోకి వస్తే కులగణన చేపడతాం. బీసీల లెక్క తీస్తామంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించడంతో బీజేపీ ఇరకాటంలో పడింది'అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. దేశవ్యాప్తంగా కులగణన సమస్య తీవ్రంగా ఉందన్నారు. బీహార్‌లో నితీశ్ కుమార్ ప్రభుత్వం కులగణన చేసి బీసీల లెక్కను తేల్చిందని గుర్తు చేశారు. అయితే ...2లో



వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే

ఎల్బీస్టేడియంలో ఆరు గ్యారంటీలపై తొలి సంతకం



• మా కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే ఊరుకోం

• కాంగ్రెస్ అభిమానులపై స్టీఫెన్ రవీంద్ర నిఘా

• బీజేపీ నేతల మాదిరిగానే రెచ్చగొట్టేలా అక్బరుద్దీన్ వ్యాఖ్యలు : టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి

వివరాలు 11లో..

నేడు స్క్రీనింగ్ కమిటీ భేటీ

భారత్‌లో ఆకలి కేకలు !

అంతర్జాతీయ క్షుద్బాధ సూచీలో 111 స్థానం



న్యూఢిల్లీ : అంతర్జాతీయ క్షుద్బాధ సూచీ (జిహెచ్ఐ)-2023లో మొత్తం 125 దేశాలకు గానూ భారత్ 111వ స్థానంలో వుంది. ఆకలిపై సాగిన పోరాటంలో 2015 నుండి పురోగతి స్తంభించిపోవడంతో ఈ పరిస్థితి ఎదురైంది. ఆఫ్ఘనిస్తాన్, హైతి, 12 సబ్ సహారా దేశాలు భారత్ కంటే అధ్వాన్నమైన స్థితిలో వున్నాయి. వంద పాయింట్ల స్కేలులో జీరో అంటే అస్సలు ఆకలి బాధలు లేకపోవడమని అర్థం. వంద అంటే అత్యంత అధ్వాన్నమైన పరిస్థితి. ఈ స్కేలులో భారత్ 28.7 స్కోర్ వద్ద వుంది. దాని...2లో

గాంధీ గిరీ కాదు..గులాబీగిరే..!

ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలతో.. బీఆర్ఎస్‌కు కొత్త తలనొప్పులు



• గులాబీ కండువాలకే ప్రభుత్వ పథకాలట!

• అధికారులను కించపరిచేలా మాటలు

• సోషల్ మీడియాలో వీడియోలు వైరల్

• ఈసీ దృష్టికి తీసుకెళ్లే యోచనలో విపక్షాలు

• ఖండించిన తాతా మధు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

"ఇల్లొచ్చినా లాట్రీ సిస్టమే.. గొర్రెలొచ్చినా లాట్రీ సిస్టమే.. ప్లాట్లు వచ్చినా లాట్రీ సిస్టమే.. ఇప్పటి దాకా ఇలా గాంధీలాగా ఆలోచించాం.. మన నాయకుడూ అలాగే ఆలోచించాడు. ఇక గాంధీ గిరీ లేదు.. మన పార్టీ జెండా పట్టుకున్నోడికి, కండువా కప్పుకున్నోడికే ఏ స్కీమైనా.." అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా అధ్యక్షులు తాతా మధు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. "వాడు ఎమ్మార్వో గానీ, ఆర్డీవో గానీ, కలెక్టర్ గానీ మన పార్టీ మాట వినాల్సిందే..! ఎందుకంటే ప్రభుత్వం మనది.. ఎస్ఐ అయినా.. సీఐ అయినా.. ఏసీపీ అయినా.. ఏఎస్పీ అయినా.. కమిషనరైనా.. ఎవరైనా గానీ.. ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేయాల్సిందే.." అంటూ ఆయన పార్టీ సమావేశంలో మాట్లాడిన వీడియో సైతం వైరల్ అవుతూ పెద్ద దుమారమే రేపుతోంది.ఇప్పటికే ఇల్లెందు నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియకు వ్యతిరేకంగా అసమ్మతిని పోగేశారని తాతా మధు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఓవైపు ఆ దుమారం నడుస్తుండగానే మధుసూదన్...11లో

అధికారుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసేలా ఎమ్మెల్సీ వ్యాఖ్యలు



అధికారుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు చేశారు. వీడియో ఎప్పటిదైనా అధికార బలంతో అధికారులు, లబ్ధిదారులపై ఆయన మాట్లాడిన తీరు బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. ప్రభుత్వం ఏదైనా అధికారులు విధేయతతో పనిచేస్తారు. అలా అనిచెప్పి వారి పట్ల అమర్యాదగా వ్యవహరించేలా మాట్లాడటం సరైంది కాదు.

అన్నవరపు కనకయ్య, సీపీఐ(ఎం) భద్రాద్రి జిల్లా కార్యదర్శి





ఈసీకి సీఎస్ నివేదిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈసీ బదిలీ చేసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల స్థానంలో ఒక్కో పోస్టుకు ముగ్గురి పేర్లను ప్రతిపాదిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కేంద్ర ఎన్నికల సంఘానికి గురువారం నివేదిక సమర్పించారు. ఆయా పేర్లను పరిశీలించి, శుక్రవారం ఈసీ కొత్త వారిని సూచించనుంది. ఆ మేరకు సీఎస్ ఉత్తర్వులు జారీ చేస్తారు.

తమిళనాడుకు నీటి విడుదల కొనసాగించండి

- కర్నాటకకు కావేరి కమిటీ ఆదేశం
- అప్పీలు చేస్తామన్న డిప్యూటీ సీఎం శివకుమార్

న్యూఢిల్లీ : తమిళనాడుకు ఈ నెల 16 నుండి 31వ తేదీ వరకూ ప్రతి రోజూ మూడు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కావేరీ జల నియంత్రణ కమిటీ కర్నాటకను ఆదేశించింది. అయితే దీనిపై అప్పీలుకు వెళతామని, రైతుల ప్రయోజనాలు కాపాడతామని కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. అక్టోబర్ 15వ తేదీ వరకూ రోజుకు మూడు వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేయాలని గత నెలలో కర్నాటకను కమిటీ ఆదేశించింది. రోజుకు 12 వేల క్యూసెక్కుల నీటిని అందించాలంటూ తమిళనాడు చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది.

ఈ నెల 10వ తేదీ వరకూ తమ రిజర్వాయర్లలోకి నీటి ప్రవాహం తక్కువగా ఉంటుందని కమిటీకి కర్నాటక తెలియజేసింది. పరిస్థితి తీవ్రతను గుర్తించిన తమిళనాడు రాబోయే పదిహేను రోజులు 16 వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేయాలని కర్నాటకను కోరింది. కావేరీ జలాల పంపిణీపై రెండు రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదం ఈనాటిది కాదు. ఒకప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీ, మైసూర్ రాష్ట్రాల మధ్య 1892, 1924 సంవత్సరాల్లో ఒప్పందాలు కుదిరాయి.

అప్పటి నుండీ కర్నాటక, తమిళనాడు మధ్య వివాదం నడుస్తూనే ఉంది. దీనిపై కేంద్రం 1990లో ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్ 2007లో తీర్పు ఇచ్చింది. అయితే ఈ తీర్పుపై సమీక్ష కోరుతూ రెండు రాష్ట్రాలు పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ నేపథ్యంలో ట్రిబ్యునల్ తీర్పు అమలు కోసం కావేరీ జల నిర్వహణ సంస్థను ఏర్పాటు చేయాలని 2018 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు కేంద్రానికి సూచించింది.

బిల్కిస్‌బానో కేసులో దోషుల శిక్ష రద్దుపై కొనసాగుతున్న వాదనలు

న్యూఢిల్లీ : గుజరాత్ మారణహోమంలో బిల్కిస్‌బానోపై సామూహిక అత్యాచారానికి పాల్పడి, ఆమె కుటుంబ సభ్యులను ఆటవికంగా హత్య చేసిన 11 మందిని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలు చేసిన వారి తరపున సుప్రీంకోర్టులో గురువారం వాదనలు విన్పించారు. దోషులకు విధించిన శిక్షను రద్దు చేస్తూ గత సంవత్సరం ఆగస్టులో గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పిటిషనర్లు సవాలు చేసిన విషయం తెలిసిందే.

వీటిపై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన డివిజన్ బెంచ్ విచారణ జరుపుతోంది. నిందితుల తర ఫున సీనియర్ న్యాయవాది వి. చిదంబరేశన్ గత నెల 20న చేసిన వాదనలకు ప్రతిగా బిల్కిస్ న్యాయవాది శోభా గుప్తా వాదనలు వినిపించారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు.

ఓ కేసులో దోషులకు విధించిన శిక్షను రద్దు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం సుప్రీంకోర్టు విచారణకు అనుమ తించిందని ఆమె ఉదహరించారు. శిక్ష రద్దుపై పిటిషన్లు దాఖలు చేయడంలో జరిగిన జాప్యంపై వివరణ కూడా ఇచ్చారు.

బీజేవైఎంలో లొల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ అనుబంధ విభాగమైన యువ మోర్చాలో అంతర్గత పోరు రచ్చకెక్కింది. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు భానుప్రసాద్, జాతీయ కోశాధికారి సాయి మధ్య జరుగుతున్న కోల్డ్‌వార్‌తో యువమోర్చా రెండు గ్రూపులుగా విడిపోయింది. వారిద్దరూ మల్కాజిగిరి అసెంబ్లీ నుంచి పోటీ చేయాలని ప్రయత్నిస్తున్న క్రమంలోనే ఆధిపత్య పోరు మొదలైంది. జాతీయ అధ్యక్షులు, ఎంపీ తేజస్వీ సూర్య కారణంగా అది మరింత తీవ్రమైంది. భానుప్రసాద్ అలిగి వెళ్లిపోవడానికి కారణమైంది. ఓవైపు కుమ్ములాటలు... ఇంకోవైపు పడిపోతున్న గ్రాఫ్‌తో సతమతమవుతున్న బీజేపీకి ఎన్నికల వేళ ఈ వివాదం పెద్ద తలనొప్పిగా మారింది. భానుప్రసాద్‌ను బుజ్జగించేందుకు ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం రంగంలోకి దిగింది. మరోవైపు రసాభస నడుమనే యువమోర్చా ఆధ్వర్యంలో సోషల్‌మీడియా వర్క్‌షాపు జరిగింది. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేవైఎం ఆధ్వర్యంలో సోషల్‌మీడియా వర్క్‌షాపు నిర్వహణకు అంతా సిద్ధం చేశారు. దానికి ముఖ్య అతిథిగా బీజేవైఎం జాతీయ అధ్యక్షులు తేజస్వీ సూర్య వచ్చారు. ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆయన బసకు ఓ పెద్ద హోటల్‌లో ఏర్పాటు చేశారు. అయితే, అక్కడ కాకుండా బీజేవైఎం జాతీయ కోశాధికారి సాయి ఏర్పాటు చేసిన చోట సూర్య బస చేశారు. దీన్ని బీజేవైఎం రాష్ట్ర నాయకత్వం తప్పుబట్టింది. భానుప్రసాద్ కూడా తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. తేజస్వీ సూర్య ప్రతి సందర్భంలోనూ ఇలాగే చేస్తున్నాడంటూ అలిగారు. యువమోర్చాలో గ్రూపులను ప్రోత్సహిస్తూ కొందరినే ప్రమోట్ చేస్తున్నారంటూ భావోద్వేగానికి లోనయ్యారు. తాను వర్క్‌షాపునకు హాజరు కాబోనంటూ తేల్చిచెప్పి వెళ్లిపోయారు. తన ఫోన్‌కూడా స్విచ్ఛాఫ్ చేసి నేతలకు అందుబాటులో లేకుండా వెళ్లిపోయారు. దీంతో ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన యువ మోర్చా వర్క్‌షాపు మధ్యాహ్నం తర్వాతగానీ ప్రారంభం కాలేదు. కాసేపు భానుప్రసాద్ అనుచరులు రచ్చచేశారు. బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణచుగ్ సమక్షంలోనే తేజస్వీ సూర్యకు వ్యతిరేకంగా బీజేవైఎం కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నాయకత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెళ్లిపోయారు. బీజేపీ ముఖ్య నేతలు వారికి నచ్చజెప్పేందుకు యత్నించినప్పటికీ పార్టీ విస్తరణ కోసం రేయింబవళ్లు క్షేత్రస్థాయిలో కష్టపడుతున్న తమకు ఈ అవమానం ఏమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికే గొడవ రచ్చకెక్కడంతో వర్క్‌షాపును వాయిదా వేస్తే పరువు పోతుందని రాష్ట్ర నాయత్వం భావించింది. ఉన్న కొద్ది మందితో మమా అనిపించింది. వర్క్‌షాపు ప్రారంభ సమయంలోనూ రాష్ట్ర అధ్యక్షుడు, ముఖ్య నాయకులు లేకుండా ఎలా నిర్వహిస్తారంటూ కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. నినాదాలు చేశారు. అయితే, బీజేపీ రాష్ట్ర నాయకులు కాసం వెంకటేశ్వర్లు, తదితరులు వారికి సర్దిచెప్పారు. భానుప్రకాశ్‌ను బుజ్జగించేందుకు రంగంలోకి పార్టీ రాష్ట్ర నేత రాంచందర్‌రావు దిగారు. అంతకు ముందు రోజే బీజేపీ ప్రకటించే అభ్యర్థుల జాబితాలో కనీసం పదిమందికైనా సీట్లు కేటాయించాలనే డిమాండ్‌ను బీజేవైఎం రాష్ట్ర శాఖ తెరపైకి తెచ్చింది. ఇదిలాఉండగా మల్కాజిగిరి అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేసేందుకు భానుప్రసాద్, సాయి తీవ్రస్థాయిలో ఎవరికివారు ప్రయత్నిస్తున్నారు. ఇక్కడే ఇద్దరి మధ్యా ఆధిపత్య పోరు మొదలైనట్టు తెలుస్తోంది.

కులగణనతో ఇరకాటంలో బీజేపీ

(మొదటిపేజీ తరువాయి)


కులగణన చేసి హిందూమతాన్ని చీల్చుతున్నారంటూ బీజేపీ కొత్తపాట పాడుతున్నదని విమర్శించారు. నవతెలంగాణ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో లబ్దిపొందడం కోసమే మహిళా బిల్లును ఆమోదించారని చెప్పారు. అయితే మహిళలపై నిజంగా బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే వచ్చే ఎన్నికల నుంచే అమలు చేసేదని అన్నారు. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాత అమలు చేస్తామని చెప్పడం మహిళలను మభ్యపెట్టడమేననీ, ఇదంతా ఓట్ల కోసమేనని విమర్శించారు. అందులో బీసీ మహిళలకు రిజర్వేషన్ కల్పించలేదన్నారు. దీంతో మహిళా బిల్లును ఆమోదించినా బీజేపీపై వ్యతిరేకత వచ్చిందని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే తమ లక్ష్యమని పిలుపునిచ్చారు. రాష్ట్రాల్లో బీజేపీ వ్యతిరేక పార్టీలను ఐక్యం చేస్తామన్నారు. హిందూత్వ రాజ్యాన్ని స్థాపించడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని వివరించారు. అయితే హిందూత్వ రాజ్యం తెచ్చేందుకు రాజ్యాంగం అడ్డుగా ఉందంటూ గోల్వాల్కర్ సిద్ధాంతగ్రంథంలో రాశారని గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని బీజేపీ భావిస్తున్నదని చెప్పారు. అందుకే సనాతన ధర్మాన్ని నాశనం చేయకుండా దేశం ముందుకుపోదంటూ ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. సనాతన ధర్మమంటే మనుధర్మాన్ని అమలు చేయడమేనని అన్నారు. కులవ్యవస్థను యథావిధిగా కొనసాగించడమే సనాతన ధర్మమని వివరించారు. కులవ్యవస్థ పోవాలనీ, సమానత్వం రావాలని అభ్యుదయ వాదులు కోరుకుంటున్నారని చెప్పారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, కార్పొరేట్ అనుకూల విధానాలు, 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు, అందరికీ ఇండ్లు, అన్ని రాష్ట్రాల్లో బుల్లెట్ రైళ్లు వస్తాయన్న బీజేపీ హామీలు చర్చకు వస్తే ప్రజలు ఆ పార్టీకి ఓట్లేయబోరని అన్నారు. ఇంకోవైపు ఇండియా కూటమి బలం దేశవ్యాప్తంగా పెరుగుతున్నదని వివరించారు. అందుకే మతోన్మాదాన్ని రెచ్చగొట్టి, విద్వేషాలను పెంచి, ప్రజల్లో భ్రమలను కల్పించడం పైనే మోడీ ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందని వివరించారు. మత ఉద్రిక్తతలను రెచ్చగొడితేనే బీజేపీ బలపడుతుందన్నారు. రాష్ట్రంలో వామపక్షాలకు బీఆర్‌ఎస్ మిత్ర ద్రోహం చేసిందని విమర్శించారు. వారి రాజకీయ వైఖరిలో మార్పు రావడం వల్లే సీపీఐ, సీపీఐ(ఎం)కు బీఆర్‌ఎస్ దూరమైందని చెప్పారు. ఇండియా కూటమిలో వామపక్షాలుండడం కేసీఆర్‌కు ఇష్టం లేదంటూ, కేంద్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా బీఆర్‌ఎస్ మద్దతుతోనే అంటూ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు వ్యాఖ్యానిస్తున్నారని అన్నారు. బీజేపీకి దగ్గరయ్యే ఈ ప్రయత్నాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. దేశంలో ప్రాంతీయ పార్టీలకు స్థిరమైన సిద్ధాంత ప్రాతిపదిక ఉండబోదనీ, వారి అవసరాలను బట్టి రాజకీయ నిర్ణయాలుంటాయని వివరించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలతో కేసీఆర్ డిఫెన్స్‌లో పడ్డారని చెప్పారు. రైతుబంధు కౌలురైతులతో పాటు వ్యవసాయ కార్మికులు, కూలీలకూ ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించిందన్నారు. ఇంకోవైపు నిరుద్యోగ భృతి, ఆసరా పెన్షన్ల వయస్సును 58 ఏండ్లకు తగ్గిస్తామన్న బీఆర్‌ఎస్ ఎన్నికల హామీలకు అతీగతీ లేదన్నారు. మరోవైపు వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తక్కువ సీట్లొస్తే ఎంఐఎం, బీజేపీ సహకారం కోరే అవకాశముందన్నారు. ఇది లోపాయికారిగా జరుగుతున్నదనీ, బహిరంగంగా ప్రకటిస్తే ముస్లింల ఓట్లు బీఆర్‌ఎస్ కోల్పోయే ప్రమాదముందంటూ జాగ్రత్త పడుతున్నారని చెప్పారు. నవతెలంగాణ హైదరాబాద్ రీజియన్ మేనేజర్ లింగారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, నవతెలంగాణ సీజీఎం పి ప్రభాకర్, ఎడిటర్ ఆర్ సుధాభాస్కర్, న్యూస్ ఎడిటర్ రాంపల్లి రమేష్, మొఫషీల్ ఇన్‌చార్జీ వేణుమాధవ్, జనరల్ మేనేజర్లు భరత్, రఘు, వెంకటేశ్, ఆర్ వాసు, శశిధర్, నరేందర్‌రెడ్డి, పవన్, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనమివ్వాలి

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించాలి : జె.వెంకటేశ్

హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్



కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనమివ్వాలనీ, వారి సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె.వెంకటేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని కలెక్టరేట్ ఎదుట ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జె.కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 40 శాఖల్లో సుమారు 1,40,000 మంది పనిచేస్తున్నారన్నారు. అనేక శాఖల్లో రెన్యూవల్స్ చేయకపోవడంతో సిబ్బందికి నెలల తరబడి జీతాలు అందటం లేదని వాపోయారు. అరకొర వేతనాలతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. జీఓ నెం.60 విడుదలై రెండేండ్లు దాటినా అమలుకు నోచుకోవడంలేదన్నారు. 20 ఏండ్ల నుంచి అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కనీస వేతనంతో పాటు డిఏ, హెచ్‌ఆర్‌ఏ వర్తింపజేయాలన్నారు. 2023 జులై నుంచి ప్రభుత్వోద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కొత్త వేతనాలివ్వాలని డిమాండ్ చేశారు. అందర్నీ పీఆర్సీ జీవో పరిధిలోకి తేవాలని కోరారు. రెన్యూవల్ కాని 200 మంది పాలిటెక్నిక్ నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యల్ని పరిష్కరించాలనీ, తొలగించిన 23 మందిని విధుల్లోకి తీసుకోవాలని విన్నవించారు. పెండింగ్ బకాయిలను విడుదల చేయాలనీ, తొలివారంలోనే జీతాలివ్వాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల దీర్ఘకాలిక సర్వీస్‌ను పరిగణలోకి తీసుకొని రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

భారత్‌లో ఆకలి కేకలు !

(మొదటిపేజీ తరువాయి)

ప్రాతిపదికన భారత్ ర్యాంక్ 111గా వుంది. దీని ప్రకారం భారత్‌లో ఆకలి బాధలు చాలా తీవ్రంగా వున్నాయని వెల్లడవుతోంది. పోషకాహార లోపం, పిల్లల్లో ఎదుగుదల సమస్యలు, బరువు తగ్గుదల, బాలల్లో మరణాలు ఈ నాలుగు అంశాలతో కూడిన ఫార్ములా ఆధారంగా జిహెచ్ఐ స్కోర్‌ను లెక్కిస్తారు. 2000, 2015 మధ్యలో ఆకలి బాధలను పరిష్కరించడంలో భారత్ పనితీరు బాగుంది. గణనీయమైన విజయాలను సాధించింది. 2వేల సంవత్సరంలో 38.4గా వున్న స్కోర్ 2008లో 35.5గా వుండగా, 2015లో 29.2కి చేరింది. గత ఎనిమిదేళ్లలో కేవలం 0.5పాయింట్లు మాత్రమే తగ్గింది. భారత్ పనితీరు మొత్తంగా అంతర్జాతీయ ధోరణిని ప్రతిబింబిస్తోంది. 2023లో మొత్తంగా ప్రపంచ దేశాల జిహెచ్ఐ స్కోర్ 18.3గా వుంది. అయితే, 2015నాటి స్కోరుతో పోలిస్తే కేవలం ఒక పాయింట్ తగ్గింది. వాస్తవానికి పోషకాహారం లోపంతో బాధపడే వారి సంఖ్య 2017లో 7.5శాతంగా వుండగా, 2022లో 9.2శాతానికి పెరిగింది. అంటే 73.5 కోట్ల మంది ప్రజలు ఈ పోషకాహారం లోపం బారిన పడ్డారు. తీవ్రమైన ఆకలి బాధలను ఎదుర్కొంటున్న దేశాల్లో దక్షిణాసియా, ఆఫ్రికా, దక్షిణ సహారా ప్రాంతాలు వున్నాయి. ఇక్కడ వీటి జిహెచ్ఐ స్కోర్లు 27గా వున్నాయి. అంటే చాలా తీవ్రమైన క్షుద్బాధ వుందని సంకేతం. పశ్చిమాసియా, ఉత్తరాఫ్రికాలు 11.9 స్కోరుతో మూడవ అత్యధిక క్షుద్బాధ స్థాయి గల ప్రాంతాలుగా వున్నాయి. 2015, 2023 మధ్య జిహెచ్ఐ స్కోర్లు మరింత అధ్వాన్నంగా మారిన ఏకైక ప్రాంతం లాటిన్ అమెరికా, కరేబియా. చైనాను అధిగమించి తూర్పు, ఆగ్నేయాసియా దేశాలు రెండవ అతి తక్కువ జిహెచ్ఐ స్కోరు సాధించిన ప్రాంతాలుగా వున్నాయి. యూరప్, సెంట్రల్ ఆసియా ప్రాంతాల్లో జిహెచ్ఐ స్కోరు ఆరుగా వుంది. దీన్ని అత్యంత తక్కువగా పరిగణిస్తారు.

కారును పోలిన గుర్తులను రద్దు చేయాలి

- ఢిల్లీ కోర్టులో బీఆర్‌ఎస్ పిటిషన్
- అంతలోనే వెనక్కి తీసుకున్న గులాబీ దళం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కారును పోలిన గుర్తులు తొలగించాలంటూ ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘాన్ని బీఆర్‌ఎస్ నాయకులు కలిసి విజ్ఞప్తి చేశారు. కానీ సానుకూలమైన ఫలితం రాకపోవడంతో గురువారం ఉదయం ఇదే అంశంపై ఢిల్లీ హైకోర్టును ఆ పార్టీ నేతలు ఆశ్రయించారు. కారును పోలి ఉన్న గుర్తులను ఏ పార్టీకీ కేటాయించొద్దంటూ బీఆర్‌ఎస్ రిట్ పిటిషన్ దాఖలు చేసింది. అలా కేటాయించడం వల్ల తమ పార్టీకి నష్టం జరుగుతోందని రిట్ పిటిషన్‌లో ఆ పార్టీ పేర్కొంది. బీఆర్‌ఎస్ తరపున న్యాయవాది మోహిత్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఢిల్లీ హైకోర్టు విచారణ చేపట్టే లోపే బీఆర్‌ఎస్ ఆ పిటిషన్‌ను వెనక్కి తీసుకుంది.

ఇదే అంశంపై సుప్రీంకోర్టుకు

అలా ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేయడం.. మళ్లీ వెనక్కి తీసుకోవడం ఇవన్నీ గంటల వ్యవధిలోనే జరిగిపోయాయి. తాజాగా ఇదే అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని భావిస్తోంది. కారును పోలిన గుర్తులను ఎన్నికల కమిషన్ తొలగించాలని ఆదేశాలు ఇవ్వాలంటూ భారత రాష్ట్ర సమితి ధర్మాసనాన్ని ఆశ్రయించనుంది. ధర్మాసనం ఎలా రియాక్ట్ అవుతుంది..? కారు పార్టీకి అనుకూలంగా తీర్పు ఉంటుందా..? లేకుంటే పరిస్థితి ఎలా ఉంటుంది. అనేదానిపై సర్వత్రా ఆసక్తి, అంతకుమించి బీఆర్‌ఎస్‌లో ఉత్కంఠ నెలకొంది. గత ఎన్నికల్లో కారును పోలిన గుర్తుల కారణంగా కొన్ని చోట్ల బీఆర్‌ఎస్ పార్టీకి నష్టం జరిగింది. ఈసారి అలా జరగకూడదని ఆ పార్టీ భావిస్తోంది.

కేసీఆర్ ఆటలో రేవంత్, హరీశ్‌రావు బలిపశువులు

- సీఎం పదవి కోసం కొట్టుకుంటున్న హరీశ్, కేటీఆర్ : బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేసీఆర్ ఆడుతున్న రాజకీయ చదరంగంలో రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు బలిపశువులు కాబోతున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమమార్ అన్నారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో రూపకల్పనపై సీఎం కేసీఆర్ దగ్గర హరీశ్‌రావు, కేటీఆర్ చర్చిస్తున్నారనే వార్త పెద్ద డ్రామా అనీ, వారిద్దరూ సీఎం పదవి కోసం కొట్టుకుంటున్నారని విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మెన్ ఈటల రాజేందర్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ సమక్షంలో మానకొండూరు మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, మాజీ జడ్పీటీసీ జోగిరెడ్డి, మాజీ కల్లల్ భిక్షపతి ముదిరాజ్, పరిగి నియోజకవర్గానికి చెందిన వన్నె ఈశ్వరప్ప, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు బీజేపీలో చేరారు. వారికి కిషన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ.. కేసీఆర్ ఆమోద ముద్ర పడకపోవడం వల్లనే కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా ఇంకా ఫైనల్ కాలేదని ఆరోపించారు. అడ్డా కూలీలకు పైసలిచ్చి కండువా కప్పి ప్రచారం చేసుకుంటున్న పరిస్థితిలో బీఆర్‌ఎస్ ఉందని విమర్శించారు. బీజేపీ అభ్యర్థుల ప్రకటన విషయంలో కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో అందరమూ కలిసి చర్చించి నిర్ణయం తీసుకుంటున్నామనీ, ఇప్పటికే తమ లిస్టు జాతీయ నాయకత్వం వద్దకు వెళ్లిందని చెప్పారు. కాంగ్రెస్ లిస్ట్ మాత్రం ఇంకా ప్రగతి భవన్‌లోనే ఉందనీ, కేసీఆర్ 30 మంది అభ్యర్థుల పేర్లు నిర్ణయించి స్టాంపు వేసిన తర్వాతనే ఢిల్లీకి పోతుందనే విషయం రేవంత్‌రెడ్డికి తెల్వదని అన్నారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు వేగంగా మారబోతున్నాయన్నారు. కాంగ్రెస్ కూడా కుటుంబ పార్టీ అనీ, ఎమ్మెల్యేలు అమ్ముకునే పార్టీని అని ఆరోపించారు. రాష్ట్రంలో బెల్ట్ షాపులను ఇష్టానుసారంగా పెంచి ప్రజల రక్తాన్ని తాగుతున్నారని విమర్శించారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే బెల్టు షాపులను రద్దు చేస్తామని చెప్పారు. ప్రజా ధనాన్ని దోచుకున్న వారిని వదిలి పెట్టే ప్రసక్తే లేదని వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ..కేసీఆర్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారనీ, మానకొండూరులో బీజేపీ గెలవడం ఖాయమని చెప్పారు. ప్రజలనే కాదు అధికారులను కూడా నమ్మలేని నైరాశ్య స్థితిలోకి కేసీఆర్ వెళ్లారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో కేసీఆర్ ఒక్కొక్క నియోజక వర్గంలో 30 నుంచి 100కోట్లు ఖర్చు పెట్టి గెలవాలని చూస్తున్నారని విమర్శించారు. డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. బీసీల ఓట్లు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు లేదన్నారు. ఎన్నికల నేపథ్యంలోనే కులగణన పేరుతో కాంగ్రెస్ మొసలి కన్నీరు కారుస్తున్నదని విమర్శించారు.

దక్షిణాదిలో బీజేపీకి ఒక్క సీటూ రాదు

- డీలిమిటేషన్‌తో ఆయా రాష్ట్రాలకు అన్యాయం
- దీనిపై కమలం పార్టీ వైఖరేంటో చెప్పాలి
- కులగణన చేయకపోవడంలో కాంగ్రెస్, బీజేపీలది సమాన బాధ్యత : కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ- చెన్నై

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి ఒక్క ఎంపీ స్థానం కూడా రాదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తేల్చిచెప్పారు. 2026 తర్వాత జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలు సీట్లు కోల్పోతాయనీ, దీనిపై బీజేపీ వైఖరి ఏంటని ప్రశ్నించారు. ఈ అంశంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో దక్షిణాది రాష్ట్రాలు రాజకీయ ప్రాతినిధ్యాన్ని కోల్పోడానికి సిద్ధంగా లేవన్నారు. దశాబ్దాల కాంగ్రెస్, బీజేపీ పాలనలో అన్ని రంగాల్లోనూ వైఫల్యం అడుగడుగునా కనిపిస్తోందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వాన్ని గద్దెదించాలన్న ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్న ఇండియా కూటమి ప్రజల కోసం ఏమి చేస్తుందనే ఎజెండాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ మరోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గురువారం చెన్నైలో ఏబీపీ నెట్వర్క్ సంస్థ నిర్వహించిన సదరన్ రైజింగ్ సమ్మిట్‌లో "సార్వత్రిక ఎన్నికలు 2024: ఎవరు గెలుస్తారు ? ఎవరు ఓడుతారు ?" అన్న అంశంపై చర్చాగోష్ఠి నిర్వహించారు. దీనికి ప్రముఖ రచయిత చేతన్ భగత్ సమన్వయకర్తగా వ్యవహరించారు. అందులో కవితతో పాటు కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం, తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కె.అన్నమలై పాల్గొన్నారు. కవిత మాట్లాడుతూ.. ఇండియా, ఎన్డీఏ కూటములకు సమాన దూరంలో ఉంటామన్నారు.

కాంగ్రెస్, బీజేపీల కంటే ప్రాంతీయ పార్టీలు మంచి పనితీరు ప్రదర్శిస్తున్నాయని ఉదహారణలతో వివరించారు. ప్రజల ఆశీస్సులతో అనేక ప్రాంతీయ పార్టీలు బలమైన శక్తిగా ఎదిగాయన్నారు. జాతీయ స్థాయిలో బీజేపీ, కాంగ్రెస్‌లకు 75 ఏండ్ల పాటు పరిపాలించే సమయం లభించినప్పుడు ఏమీ చేయలేదని విమర్శించారు. అందుకే బీఆర్‌ఎస్ జాతీయస్థాయిలో మరో రాజకీయ శక్తిగా ఎదగాలని చూస్తున్న దన్నారు. వచ్చే ఎన్నికల్లో తృణముల్ కాంగ్రెస్, బీజేడీ, వైఎస్‌ఆర్‌సీపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఎక్కువ సీట్లు సాధిస్తాయని చెప్పారు. బీఆర్‌ఎస్ మాత్రమే కాకుండా ఎవరైనా గేమ్ చేంజర్ కావచ్చని అభిప్రాయపడ్డారు. కులగణననే కాకుండా సాధారణ జనగణన ఎందుకు చేయడం లేదని నిలదీశారు. దేశంలో కులగణన జరగకపోవడానికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సమాన బాధ్యత వహించాలన్నారు. ఇప్పుడు కచ్చితంగా కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు.

దిక్కులేని స్థితిలో రాష్ట్ర సమాచార కమిషన్లు



తెలంగాణలో సమాచార కమిషన్ లేదు

- పెండింగ్‌లో 3 లక్షలు ఆర్టీఐ ఫిర్యాదులు : నివేదికలో వెల్లడి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



దేశంలోని రాష్ట్ర సమాచార కమిషన్లు దుర్భర స్థితిలో ఉన్నాయి. 29 సమాచార కమిషన్లలో కనీసం నాలుగు పూర్తిగా పని చేయటం లేదు. తెలంగాణ, మిజోరాం, త్రిపుర, జార్ఖండ్‌లో సమాచార కమిషన్ లేదు. జార్ఖండ్‌లో గత మూడేండ్లుగా, త్రిపురలో రెండేండ్లుగా కమిషన్ లేదు. సమాచార హక్కు చట్టం-2005కి సంబంధించి ప్రభుత్వాన్ని జవాబుదారీగా ఉంచడానికి ప్రయత్నిస్తున్న సతార్క్ నాగ్రిక్ సంగతన్ (ఎస్ఎన్ఎస్) సంస్థ ఈ మేరకు నివేదిక విడుదల చేసింది.

అక్టోబర్ 3న ప్రధాన సమాచార కమిషనర్ పదవీ విరమణ చేయడంతో సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్(సీఐసీ)తో సహా మరో ఆరు రాష్ట్ర కమిషన్‌లు ప్రస్తుతం తలలేనివిగా ఉన్నాయి. మణిపూర్‌లో 56 నెలలుగా చీఫ్ లేకుండానే పనిచేస్తున్నది. చట్టంలో అలాంటి నిబంధన ఏదీ లేనప్పటికీ, మరో అధికారిని తాత్కాలిక కమిషనర్‌గా నియమించారు. ఛత్తీస్‌గఢ్ లో 2022 డిసెంబర్ నుంచి చీఫ్ లేకుండా పనిచేస్తోంది. మహారాష్ట్రలో ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచి, బీహార్‌లో మే నుంచి, పంజాబ్‌లో గత నెల నుంచి చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ లేకుండానే కమిషన్లు పని చేస్తున్నాయి.

నివేదికను రూపొందించడంలో కీలక వ్యక్తి అంజలి భరద్వాజ్ మాట్లాడుతూ "2014 నుంచి ప్రభుత్వం సమాచార కమిషనర్‌ను ఎన్నడూ నియమించలేదు. ' అని అన్నారు. ఎస్ఎన్ఎస్ కి చెందిన అమృతా జోహ్రీ మాట్లాడుతూ "సమాచార కమిషన్లను నిర్వీర్యం చేయడం ,పౌరుడి ప్రాథమిక సమాచార హక్కును అణచివేయడానికి ఒక మార్గం. అప్పీల్ చేయడానికి ఎవరూ లేకపోవడంతో సమాచారం కోరే అప్లికేషన్‌కు అర్థం లేకుండా పోతుంది" అని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ తో ఈ చట్టాన్ని రెండుసార్లు సవరించింది. మొదటిది 2019లో, రెండవది ఈ ఏడాది.సవరణ' జరిగిన ప్రతిసారీ, ఆర్టీఐ చట్టం బలహీనపడుతోంది" అని తెలిపారు.

"సమాచారాన్ని తిరస్కరించడానికి మరొక మార్గం అప్పీళ్లను పెండింగ్‌లో ఉంచడమే. 2023 జూన్ 30 నాటికి 27 సమాచార కమిషన్లలో 3,21,537 అప్పీళ్లు, ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. కమిషన్లలో అప్పీళ్లు, ఫిర్యాదుల బకాయిలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి" అని నివేదిక పేర్కొంది. "2019 మార్చి 31 నాటికి 26 సమాచార కమిషన్‌లలో మొత్తం 2,18,347 అప్పీళ్లు, ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. 2021 జూన్ 30 నాటికి అది 2,86,325కి చేరింది. 2022 జూన్ 30 నాటికి 3 లక్షలు దాటింది" అని నివేదిక పేర్కొంది.

స్వామినాథన్ సేవలు మరువలేనివి..

వ్యవసాయం అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి

- విత్తన రంగంలో నిరంతరం పరిశోధనలు జరగాలి
- కేరళ తరహాలో పంట క్వింటాకు రూ.700 బోనస్ ఇవ్వాలి : సెమినార్‌లో అఖిలభారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి





నవతెలంగాణ-సూర్యాపేట

భారత వ్యవసాయ రంగం అభివృద్ధికి ఎంఎస్.స్వామినాథన్ చేసిన సిఫారసులు మరువలేనివని అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్.స్వామినాథన్ స్మారకార్థం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నర్సింహారెడ్డి భవన్‌లో గురువారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 'భారత వ్యవసాయరంగం- స్వామినాథన్ సంస్కరణలు' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో సారంపల్లి ప్రసంగించారు. స్వామినాథన్ సిఫారసులను అమలు చేస్తామని కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం పదేండ్లు అవుతున్నా చేయలేదని విమర్శించారు. స్వామినాథన్ రైతుల ఆదాయాన్ని పెంచాలనే ఉద్దేశంతో వ్యవసాయ రంగంలో అనేక పరిశోధనలు చేశారని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగం మరింత పురోభివృద్ధి సాధించాలని, అప్పుడే దేశం అభివృద్ధి అవుతుందని, రైతాంగానికి మద్దతు ధర ఇవ్వాలని.. ఇలాంటి అనేక సిఫారసులు స్వామినాథన్ చేశారని చెప్పారు. విత్తన ఉత్పత్తి సంస్థగా భారతదేశం అభివృద్ధి కావాలని నిరంతరం ఆకాంక్షించారని తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాల మూలంగా రాష్ట్రంలో ఎంతోమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, కొంతమంది విద్యుత్ ప్రమాదం మూలంగా చనిపోయారని వివరించారు.

మరికొందరు రైతులు వ్యవసాయం గిట్టుబాటు కాక, తెచ్చిన అప్పులు తీరక చనిపోయారని చెప్పారు. సీపీఐ(ఎం) నేతృత్వంలోని కేరళ వామపక్ష ప్రభుత్వం పంటలకు మద్దతు ధరతోపాటు రూ.700 అదనంగా బోనస్ ఇస్తోందని తెలిపారు. రానున్న ఎన్నికల్లోబీజేపీ, బీఆర్ఎస్‌ను రైతాంగం ఓడించాలని పిలుపునిచ్చారు. మహిళా రైతుల అభ్యున్నతి కోసం కుటుంబ స్త్రీ పథకం అమలు చేయాలని స్వామినాథన్ సిఫారసు చేశారన్నారు.

విత్తన రంగంలో వస్తున్న మార్పులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం పరిశోధనలు జరపాలని డిమాండ్ చేశారు. దేశంలో 1991 నుంచి ప్రవేశపెట్టిన సరళీకరణ ఆర్థిక విధానాలు, ప్రతిపాదనల వల్ల దేశంలో సంస్కరణలు వేగవంతం అయ్యాయని తెలిపారు. ఫలితంగా రైతాంగం అనేక సబ్సిడీలను కోల్పోయిందన్నారు. కార్పొరేట్ శక్తులకు లాభం జరిగే చర్యలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయన్నారు.

అంతకుముందు ఎంఎస్.స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభానాయక్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, బుర్రి శ్రీరాములు, మట్టిపల్లి సైదులు, కోటగోపి, చెరుకు ఏకలక్ష్మీ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండా వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.వంద కోట్ల క్లబ్‌లో ఇన్ఫినిటీ లెర్న్ శ్రీచైతన్య



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యారంగంలో దూసుకెళ్తున్న ఇన్ఫినిటీ లెర్న్ శ్రీచైతన్య రూ.వంద కోట్ల క్లబ్‌లో చేరి భారీ లాభాలను సాధించింది. ఈ మేరకు శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర, ఇన్ఫినిటీ లెర్న్ ఫౌండర్, డైరెక్టర్ సుష్మా బోపన్న, ఇన్ఫినిటీ లెర్న్ బై శ్రీచైతన్య వ్యవస్థాపక సీఈవో ఉజ్వల్ సింగ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐఎల్ విస్టా వర్చువల్ ఇంటెలిజెంట్ సిస్టమ్ ఫర టైలర్డ్ అకడమిక్స్ అని ప్రకటించారు. ఇందుకోసం ఒక మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టామని తెలిపారు. ఐఎల్ విస్టా రాబోయే దశల కోసం అదనంగా మిలియన్ డాలర్లు కేటాయించామని వివరించారు. ఐఎల్ విస్టా విద్యా ప్రపంచంలో సంచలనాత్మక సాంకేతిక కార్యక్రమమని పేర్కొన్నారు. ఇంటెలిజెంట్ సిస్టమ్ ఫర్ టైలర్డ్ అకడమిక్స్, విద్యార్థుల పూర్తి సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఇది అధ్యాపకులు, అభ్యాసకులు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరిస్తోందని వివరించారు. మొబైల్, వెబ్ అప్లికేషన్ల ద్వారా విద్యార్థులు, అభ్యాసకులు దీన్ని వినియోగించుకోవచ్చని సూచించారు.

ఐవోక్యూఎం ఫలితాల్లో శ్రీచైతన్య ప్రభంజనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశవ్యాప్తంగా మ్యాథమెటిక్స్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియన్ ఒలింపియాడ్ క్వాలిఫయర్ ఇన్ మ్యాథమెటిక్స్ (ఐవోక్యూఎం) ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థుల ప్రభంజనం సృష్టించారు. ఈ మేరకు శ్రీచైతన్య డైరెక్టర్ సీమ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందులో అత్యధికంగా 365 సెలెక్షన్లు ఒక్క శ్రీచైతన్య విద్యాసంస్థ సాధించిందని వివరించారు. ఏపీ నుంచి 167 మంది, తెలంగాణ నుంచి 47 మంది, కర్నాటక నుంచి 63 మంది, తమిళనాడు నుంచి 28 మంది, నార్త్ఇండియా నుంచి 60 మంది విద్యార్థులు ఎంపికయ్యారని వివరించారు. ఈ ఫలితాలను సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఆమె అభినందనలు తెలిపారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, రీసెర్చ్ ఓరియెంటెడ్ టీచింగ్ మెథడాలజీ, సీవో-ఐపీఎల్, సీ-ఐపీఎల్, ఐకాన్ వంటి పటిష్టమైన అకడమిక్ కార్యక్రమాల వల్లే ఇలాంటి అద్భుత ఫలితాలు సాధ్యమవుతున్నాయని పేర్కొన్నారు.

హలో బీసీ...చలో గాంధీభవన్

- కాంగ్రెస్ నేత చెరుకు సుధాకర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో బీసీలకు 34 అసెంబ్లీ స్థానాలు ఇస్తామన్న హామీ ప్రకారం నెరవేర్చాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు చెరుకు సుధాకర్ కోరారు.గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేత కత్తి వెంకటస్వామితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. హలో బీసీ...చలో గాంధీభవన్ పేరుతో శుక్రవారం గాంధీ భవన్‌లో దీక్ష చేస్తామన్నారు. బీసీలే కాకుండా సామాజిక న్యాయం కావాలని కోరుకునేవారంతా దీక్షలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. బీసీలకు ఇస్తామన్న స్థానాలు ఇవ్వకపోతే కాంగ్రెస్ అధికారంలోకి రాదన్నారు. కాంగ్రెస్ గెలుపే లక్ష్యం, ఓబీసీల వాటానే ముఖ్యమన్నారు.

హుజురాబాద్, గజ్వేల్‌లోనూ బరిలో కేసీఆర్ వల్ల నరకం అనుభవించా..

- బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

నవతెలంగాణ - హుజురాబాద్

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌పైన గజ్వేల్‌లో, హుజురాబాద్‌లోనూ పోటీ చేస్తానని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మెన్, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. గురువారం కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలోని ఓ గార్డెన్‌లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనను ఇంతవాన్ని చేసిన హుజురాబాద్ గడ్డపై రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తానని.. సీఎం కేసీఆర్‌ను ఓడించడానికి ఆయనపై కూడా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. కొంతమంది చిల్లరగాళ్లు తనను కేసీఆర్ కోవర్టుగా ప్రచారం చేస్తున్నారని.. తాను మాత్రం రాబోయే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ను ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని చెప్పారు. కొత్త రాష్ట్రంలో రాజకీయ వాతావరణాన్ని పాడు చేసిన దుర్మార్గపు పార్టీ బీఆర్ఎస్ అని విమర్శించారు. కేసీఆర్ వల్ల నరకం అంటే ఏందో సంపూర్ణంగా అనుభవించిన వాడిని నేను.. అందువల్ల ఎన్నికల్లో నా వేడి, నా శక్తి మొత్తం వినియోగిస్తాను' అన్నారు. ఈ నెల 16న కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హుజురాబాద్‌కు వస్తున్నారని, ఆ సభను విజయవంతం చేయాలని కోరారు.

భువనేశ్వరికి కాసాని సంఘీభావం

- రాజమండ్రిలో భేటి

నవతెలంగాణ-హైదరాబాద్

తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిని రాజ మండ్రిలో టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ కలిసి సంఘీభావం ప్రకటించారు. సెప్టెంబర్ 10న చంద్రబాబును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌లో రిమాండ్‌లో ఉంచిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గురువారం తెలుగు దేశం తెలంగాణ శాఖ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ రాజమండ్రిలో ఆపార్టీ సీనియర్ నేతలు, కార్య కర్తలతో భువనేశ్వరితో భేటి అయ్యారు. చంద్రబాబు అరెస్ట్, తదనంతర పరిస్థితులు, తెలంగాణ చేపట్టిన కార్యక్రమాల గురించి చర్చించారు. కాసాని వెంట టీడీపీ జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, జాతీయ కార్యదర్శి కాసాని వీరేష్, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి సతీష్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పొలంపల్లి అశోక్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మేకల భిక్షపతి, నల్లగొండ పార్లమెంటు అధ్యక్షులు కసిరెడ్డి శేఖర్‌రెడ్డి తది తరులు ఉన్నారు. ప్రపంచం వ్యాప్తంగా చంద్ర బాబుకు మద్దతు లభించిందనీ, ఆయన కడిగిన ముత్యంలా త్వరలో బయటకు వస్తారని కాసాని వ్యాఖ్యానించారు. జగన్ ప్రభుత్వం ఆయనపై అక్రమ కేసులు బనాయించిందని ఆరోపించారు. తెలుగు రాష్ట్రాల అభివద్ధి ప్రధాతగా, ఐటీ వైభవ మూల విరాట్‌గా, రాష్ట్ర ఆర్థిక సంపత్తిని రూ. 10 వేల కోట్ల నుంచి 60 వేల కోట్లకు తీసుకెళ్లిన విజనరీ లీడర్‌గా ఆయన్ను తెలుగు ప్రజలే కాకుండా ప్రపంచం మొత్తం గుర్తించి గర్విస్తున్నదని పేర్కొన్నారు. చంద్రబాబు నాయకత్వంలో తెలుగుదేశం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి రావడం తథ్యమని అభిప్రాయపడ్డారు.

రాజస్థాన్‌లో మాదిరిగానే జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలి : టీడబ్ల్యూజేఎఫ్‌విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని తెలంగాణ ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌కు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాజస్థాన్‌లో జర్నలిస్టులకు ఈ అవకాశం కల్పించారని గుర్తు చేసింది. ఎనిమిది శాఖలకు చెందిన సర్వీసు ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పిస్తూ రాజస్థాన్ ఎన్నికల సీఈవో నోటిఫికేషన్ జారీచేశారని తెలియజేసింది. మీడియా సిబ్బందిని సర్వీసు ఓటర్లుగా గుర్తించడం పట్ల ఫెడరేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఇప్పటి వరకు ఎన్నికల విధుల్లోనే పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు, ఆర్మీ, పారామిలిటరీ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే సదుపాయం అమల్లో ఉందన్నారు. తెలంగాణలోనూ జర్నలిస్టులకు రాజస్థాన్‌లో మాదిరిగానే సర్వీసు ఓటర్లుగా గుర్తిస్తూ పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని కల్పించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని కోరారు.

ఐక్య పోరాటం ద్వారానే సమస్యలు పరిష్కారం

తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి



నవతెలంగాణ-కంఠేశ్వర్

అంగన్‌వాడీల ఐక్య పోరాటం ద్వారానే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అంగీకారం తెలిపిందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. గురువారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సెక్టార్ లీడర్లతో విజయోత్సవ సభను స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి హాజరై మాట్లాడారు. 24 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా పోరాడి సాధించుకున్న ఈ విజయం ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త విజయమని వారికి అభినందనలు తెలియజేశారు. దశల వారీ ఆందోళనలు, పోరాటాలు నిర్వహించి సాధించుకున్న హామీలను వెంటనే అమలు జరపటానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎప్పటికప్పుడు రాష్ట్ర కమిటీ చేసే సూచనలను అనుసరిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు అందరూ వీరోచితంగా పోరాడటం మూలంగా ప్రభుత్వం స్పందించిందని, భవిష్యత్తులో ఉద్యోగ భద్రతకు గుర్తింపు పొందటానికి ఇదే ఐక్యత పోరాటాన్ని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. సమ్మె పోరాటాల్లో ఉన్న సందర్భంలో ప్రభుత్వాలు స్పందించి పరిష్కారం చేసిన ఏకైక పోరాటం అంగన్‌వాడీల దేనని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె. దేవగన్, పి.స్వర్ణ, జిల్లా నాయకులు చంద్రకళ, రాజ సులోచన మంగాదేవి, శివరాజమ్మ, జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ రమేష్ బాబు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, యూనియన్ నాయకులు జ్యోతి, గోదావరి, లావణ్య, ఎలిజబెత్ రాణి, సూర్య కళ, వాణి, జగదాంబ, అనంతలక్ష్మి, సునంద, పాల్గొన్నారు.

14న రాస్తారోకోకు అనుమతించండి

సీఈవో, డీజీపీకి అఖిలపక్షం వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్‌పీయస్సీ నిర్వహించిన పరీక్షా పత్రాల లీకేజీ, అమ్మకం వ్యవహారాలతో నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని అఖిల పక్షం డిమాండ్ చేసింది. విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు డాక్టర్ మల్లు రవి తదితరులు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌తో పాటు డీజీపీని కలిసి వినతిపత్రం సమర్పించారు.

టీయస్‌పీయస్సీ నిర్వహించిన గ్రూప్ వన్ పరీక్షను రాష్ట్ర హైకోర్టు రద్దు చేసిందని గుర్తుచేశారు. 16 పరీక్షాపత్రాలు లీక్ కావడమే కాకుండా వాటిని అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో నష్టపోయిన విద్యార్థులకు న్యాయం కోరుతూ కాంగ్రెస్ పార్టీ, సీపీఐ, సీపీఐ (ఎం), తెలంగాణ జన సమితి , బీయస్పీ, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీలు అక్టోబర్ 14న రాస్తారోకో తలపెట్టాయని చెప్పారు. రామగుండం-హైదరాబాద్, ఖమ్మం-హైదరాబాద్, మహబూబ్‌నగర్- హైదరాబాద్, వరంగల్-హైదరాబాద్ రహదారిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రాస్తారోకో నిర్వహించేందుకు అనుమతించాలని వారు కోరారు.

ఈ సందర్భంగా డాక్టర్ మల్లు రవి, ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ ప్రస్తుత బోర్డు చైర్మెన్‌తో సహా సభ్యులను తొలగించాలని డిమాండ్ చేశారు. కమిషన్ చట్టంలో పేర్కొన్న నిబంధనల ప్రకారం కొత్త సభ్యులను నియమించాలనీ, కమిషన్ను సంపూర్ణంగా ప్రక్షాళన చేయాలని కోరారు. డీయస్సీ పోస్టుల సంఖ్యను సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన విధంగా 13,500కు పెంచాలని (బ్యాక్‌లాగ్ పోస్టులు కాకుండా అదనంగా) డిమాండ్ చేశారు. పరీక్షల రద్దుకు కమిషన్ బాధ్యత వహించి పరీక్షలు రాసిన అభ్యర్థులకు రూ.3 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఈసారైనా ఓట్లు రాల్చేనా?

50 రోజులు.. 40 సభలంటూ బీజేపీ హడావిడి

- 2018లో అగ్రనేతలు ప్రచారం చేసినా డిపాజిట్లు గల్లంతు
- రాష్ట్రానికి మళ్లీ క్యూ కట్టనున్న కేంద్ర మంత్రులు, సీఎంలు
- త్వరలో యూపీ, అస్సాం సీఎంల రాక



నవతెలంగాణ- హైదరాబాద్

ప్రధాని మోడీ.. కేంద్ర మంత్రి అమిత్‌షా వరుస పర్యటనలతో రాష్ట్రంలో హడావిడి చేస్తున్నారు. కర్నాటక ఎన్నికల ఫలితాలు, అధ్యక్షుడి మార్పు తర్వాత పడిపోయిన గ్రాఫ్‌ను జాకీలు పెట్టి మరీ లేపాలని చూస్తున్నారు. 50 రోజులు..40 సభలంటూ సుడిగాలి పర్యటనలకు తెరలేపారు. అయినా, క్షేత్రస్థాయిలో పట్టులేమి ఆ పార్టీని కలవరపెడుతున్నది. యూపీ సీఎం యోగీ ఆదిత్యనాథ్, అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మతో పాటు బీజేపీ పాలితరాష్ట్రాల ఇతర సీఎంలు, కేంద్ర మంత్రుల పర్యటనలు, సభలు తమకు ఓట్లు రాలుస్తాయని రాష్ట్ర నాయకత్వం కొండంత ఆశలు పెట్టుకున్నది. తెలంగాణలో 2018 ముందస్తు ఎన్నికల్లో మోడీ, అమిత్‌షా, గడ్కరీ, నడ్డా, యోగీ ఆదిత్యనాథ్, తదితర అగ్రతనేతలు, కేంద్ర మంత్రులతో ఇలాగే ఎన్నికల ప్రచారంలో తెగ తిప్పించారు. తీరా ఫలితాలు వచ్చాక చూస్తే మోడీ, అమిత్‌షా, యోగి పర్యటించిన నియోజకవర్గాల్లోనూ బీజేపీకి డిపాజిట్లు కూడా దక్కలేదు. 2014లో ఏడు శాతం ఓట్లతో ఐదు అసెంబ్లీ స్థానాలను గెలుచుకున్న ఆ పార్టీకి 2018కి వచ్చేసరికి ఓట్ల శాతం కూడా తగ్గింది. ఆ ఎన్నికల్లో 6.98 శాతం ఓట్లతో ఒక స్థానానికి మాత్రమే పరిమితమైంది. ఆ తర్వాత దుబ్బాకలో అధికార పార్టీలో గ్రూపు తగాదాలు, ఎంఐఎం హ్యాండివ్వడం, వంటి కారణాలతో పాటు బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు సొంత బలంతో రెండు వేల ఓట్ల లోపు ఓట్లతోనే గెలిచారు. కేసీఆర్ బీఆర్ఎస్ నుంచి అన్యాయంగా బయటకు గెంటేశాడు అనే ఒకే ఒక్క సానుభూతి, సొంత పలుకుబడితో ఈటల రాజేందర్ హుజూరాబాద్‌లో విజయం సాధించారు. అంతేగానీ, ఈ రెండు ఉప ఎన్నికల్లో బీజేపీని చూసి జనం ఓట్లేయలేదనీ, వ్యక్తిగత ఇమేజ్‌తో వారిని ప్రజలు ఆదరించారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. దక్షిణ తెలంగాణలో బలంగా ఉన్న కాంగ్రెస్‌ను దెబ్బకొట్టాలని అదే పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో రాజీనామా చేయించి మునుగోడు ఉప ఎన్నికలో ఆయన్నే తమ పార్టీ అభ్యర్థిగా పోటీచేయించిన కమలం పార్టీ చావుదెబ్బ తిన్న విషయం విదితమే. అమిత్‌షా వచ్చి ప్రచారం చేసినా అక్కడ ఆపార్టీ గెలవలేదు. హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో నోటా కంటే తక్కువ ఓట్లు పడ్డాయి. నాగార్జునసాగర్ ఉప ఎన్నికల్లో ఆ పార్టీకి పడ్డ ఓట్లు నాలుగు శాతానికి మించలేదు. ఈ ఎన్నికల్లో కేంద్రమంత్రులు తెగ హడావిడి చేసినా బీజేపీకి ఓటు షేరింగ్ ఏమాత్రం పెరగలేదు.

ఈసారీ అలాగేనా?

తాజాగా 50 రోజులు..40 పర్యటనలు, బహిరంగ సభలు అంటూ బీజేపీ రాష్ట్రంలో మళ్లీ తెగ హడావిడి చేస్తున్నది. షెడ్యూల్ రాగానే అన్ని పార్టీల కంటే ముందే తొలిసభను ఆదిలాబాద్‌లో నిర్వహించింది.

అగ్ర నేతలను పూర్తిగా రంగంలోకి దింపాలని భావిస్తోంది. త్రిమూర్తుల(ప్రధాని మోడీ, అమిత్ షా, నడ్డా) పర్యటనలు ఇక నిత్యం ఉంటాయని బీజేపీ నేతలు చెబుతున్నారు. కేంద్ర మంత్రులతో ఒక్కో రోజు రెండు నియోజకవర్గాల్లో సభలు నిర్వహించేలా బీజేపీ ప్లాన్ చేసుకుంది. ఇప్పటికే దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను సైతం విడుదల చేసింది. ఈనెల 14వ తేదీన రంగారెడ్డి అర్బన్ జిల్లా శేరిలింగంపల్లితో పాటు గ్రేటర్ పరిధిలోని మరో నియోజవర్గంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పర్యటించనున్నారు.

15న కేంద్ర మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి ముషీరాబాద్‌తో పాటు మరో నియోజకవర్గంలో ప్రచారం చేయనున్నారు. 16న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ హుజూరాబాద్, మహేశ్వరం నియోజకవర్గాల్లో జరిగే ఎన్నికల సభల్లో పాల్గొంటారు. 19న మధిర శాసనసభ నియోజకవర్గ పరిధిలో కేంద్ర మంత్రి నారాయణస్వామి పర్యటిస్తారు.

భారీ బహిరంగ సభలతో శ్రేణుల్లో జోష్ తీసుకురావాలని బీజేపీ ఎంత ప్రయత్నిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అది కనిపించడంలేదు. 2018లో లాగానే ఫలితాలు పునరావృతం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కర్నాటక ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ జోష్‌తో తెలంగాణలో బీజేపీ గ్రాఫ్ అమాతం పడిపోయిన సంగతి తెలిసిందే. నేతల అధిపత్యపోరు, అధ్యక్ష మార్పుతో పార్టీ మరింత పతనమైంది. అదే సమయంలో బీజేపీ-బీఆర్ఎస్ ఒక్కటే అన్న భావన ప్రజల్లోకి బలంగా వెళ్లిపోయింది. నేతల మధ్య సమన్వయం లేకుండా, పార్టీకి క్షేత్రస్థాయిలో పట్టులేకుండా వలస నేతల తోక పట్టుకుని ముందుకెళ్లడం ఏటికి ఎదురీదటం లాంటిదేనని బీజేపీ కార్యకర్తలే గుసగుసలాడుతున్నారు. గతంలో అగ్రనేతలు పర్యటించిన అనేక నియోజకవర్గాల్లో కనీసం డిపాజిట్లు కూడా దక్కని విషయం విదితమే. కొన్ని చోట్ల నోటా కంటే తక్కువ ఓట్లు పడటం గమనార్హం.

చెరువులో స్నానానికి వెళ్లి ఇద్దరు మృతి

- భార్య కండ్లముందే భర్త మరణం
- శోకసముద్రంలో కుటుంబసభ్యులు

నవతెలంగాణ-జవహర్ నగర్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలంలో ఓ చెరువులో స్నానానికెళ్లిన ఇద్దరు ప్రమాదవశాత్తు మునిగిపోయి మృతిచెందారు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కౌకూర్ బార్షపేట చెరువులో గురువారం జరిగింది. దర్గాలో ఉర్సు ఉత్సవాల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ లంగర్‌హౌజ్ నుంచి వచ్చి ప్రాణం కోల్పోయారు. ఎస్‌హెచ్‌ఓ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. లంగర్‌హౌజ్‌కు చెందిన సలీం(30), ఫర్వీజ్(17) పెయింటింగ్ పని చేసుకుంటూ జీవనం సాగించేవారు. కౌకూర్ దర్గాలో బుధవారం ఉర్సు పండుగను పురస్కరించుకొని కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. గురువారం ఉదయం అందరూ కలిసి కౌకూర్ బార్షపేట చెరువులో స్నానం చేయడానికి వెళ్లారు. అయితే చెరువు లోపలికి దిగిన సలీం, ఫర్వీజ్‌కు లోతు తెలియక ప్రమాదవశాత్తు మునిగిపోయారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాలను బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది. సలీంకు భార్య సుల్తానా, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కండ్ల ముందే భర్త మరణించడంతో సుల్తానా గుండెలవిసేలా రోదిస్తోంది. ఫర్వీజ్ అదే కాలనీలో నివాసముంటున్నాడు.

మా పాఠశాలను యథావిధిగా కొనసాగించాలి

- విద్యార్థులు, గ్రామస్తుల రాస్తారోకో



నవతెలంగాణ-ముథోల్

నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని చించాల గ్రామంలో గురువారం విద్యార్థులు, గ్రామస్తులు పాఠశాల కోసం రోడ్డుపై బైటాయించారు. ఉన్నత పాఠశాలను తమ గ్రామంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. 6, 7, 8వ తరగతి విద్యార్థులు ఉన్నప్పటికీ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లలను ఎడ్‌బిడ్ పాఠశాలకు పంపడం అన్యాయమన్నారు. ఇలా చేయడంతో విద్యార్థులకు రవాణ చార్జీలు భారమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పాఠశాలకు ప్రధానోపాధ్యాయులతో పాటు మూడ్రోజుల కింద రూ.6లక్షల సాంకేతిక పరికరాలు సైతం వచ్చాయని చెప్పారు. 9, 10 తరగతుల్లో పిల్లలు లేకుంటే 6, 7, 8వ తరగతుల్లో పిల్లలు ఉన్నప్పటికీ అధికారులు మరో పాఠశాలలో కలిపి తమ గ్రామానికి అన్యాయం చేయొద్దని కోరారు. ఫోన్ చేసినా జిల్లా విద్యాశాఖాధికారులు ఎత్తడం లేదన్నారు. తాము వినతిపత్రం అందజేసినా పట్టించుకోకుండా ఇలా చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. మా పాఠశాల మాకు కావాలని, విద్యార్థులకు గ్రామంలోనే విద్యాబోధన చేయాలని డిమాండ్ చేశారు.

సంపాదకీయం

తిరోగమనంలో ప్రపంచ వృద్ధి రేటు!



కరోనా మహమ్మారి దెబ్బ నుంచి ప్రపంచం కోలుకోవాలి అన్న ఆశాభావం ఎంతగా వెల్లడవుతున్నా అందుకు అనుగుణంగా ప్రపంచ పరిణామాలు లేవు. తాజాగా అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) వెల్లడించిన ప్రపంచ ఆర్థిక దృక్కోణం రానున్న రోజుల్లో ప్రపంచ ప్రగతి మరింత దిగజారనుందని జోస్యం చెప్పింది. ఇతరత్రా అనేక మంది ఆర్థికవేత్తల విశ్లేషణలు, దేశాలు, ప్రాంతాల పని తీరును చూసినా అధోగతి తప్ప పురోగతి కనుచూపు మేరలో కనిపించటం లేదు. గతేడాది ప్రపంచ వృద్ధి రేటు 3.5 శాతం ఉండగా వర్తమానంలో మూడు, వచ్చే ఏడాది 2.9 శాతానికి తగ్గుతుందని ఐఎంఎఫ్ చెప్పింది. రెండు వేల నుంచి 2019 వరకు సగటు వృద్ధి రేటు 3.8శాతం ఉంది. అభివృద్ధి చెందిన దేశాల పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ఐరోపాలో పెద్ద ఆర్థిక వ్యవస్థ ఉన్న జర్మనీ పురోగమనం సంగతి దేవుడెరుగు తిరోగమనంలోకి దిగజారుతుందా అన్న భయాలు ఉన్నాయి. ఇప్పటికే అది రోగిగా మారినట్లు వర్ణిస్తున్నారు. ధనిక దేశాల వృద్ధి రేటు గతేడాది 2.6శాతం ఉండగా ప్రస్తుత ఏడాదిలో 1.5, వచ్చే ఏడాది 1.4 శాతానికి దిగజారుతుందని, అభివృద్ధి చెందుతున్న దేశాల వృద్ధి రేటు 4.1 నుంచి నాలుగు శాతానికి తగ్గుతుందని అంచనా. ఇవన్నీ కూడా ఇప్పుడున్న పరిస్థితి ఇలాగే ఉంటే అన్న ప్రాతిపదిక మీద చెప్పిన మాటలు. ఉక్రెయిన్ సంక్షోభం కొత్త సమస్యలను తెచ్చిపెట్టింది. ఐఎంఎఫ్ తాజా అంచనాలను రూపొందించే సమయానికి ఇజ్రాయిల్ - పాలస్తీనా సంక్షోభం ఊహలో కూడా లేదు. అమెరికా తన ఆయుధ పరిశ్రమలకు లాభాలను సమకూర్చేందుకు ప్రపంచంలో ఎప్పుడు ఏ మూలన చిచ్చుపెడుతుందో, అది అసలే అంతంత మాత్రంగా ఉన్న ఆర్థిక వ్యవస్థలను ఎలా ప్రభావితం చేస్తుందో చెప్పలేము. ఇటువంటి స్థితిలో ఎగుమతుల మీద ఆశలు పెట్టుకున్న మన వంటి దేశాల పరిస్థితి అగమ్యగోచరం, దిగుమతులతో వాణిజ్య లోటు పెరుగుతుంది అన్నది వేరే చెప్పనవసరం లేదు. ఎగుమతుల్లో మిగులు ఉన్న చైనాకు వాణిజ్య మిగులు తగ్గవచ్చు తప్ప ఇప్పటికిప్పుడు లోటులో పడే అవకాశం లేదు.

ఎంత చెట్టుకు అంతగాలి అన్నట్లుగా పెరిగిన ద్రవ్యోల్బణం గృహస్తుల పొదుపు ఇప్పటికే హరించింది. ఒత్తిడి తీవ్రత తగ్గింది తప్ప దాని పర్యవసానాలైన పెరిగిన రుణ భారం, ఇతర వ్యవస్థాగత ప్రతికూలతలు ఇంకా అలాగే ఉన్నాయి. ప్రపంచమంతటా వాణిజ్య విశ్వాస సూచిక దిగువ చూపులు చూస్తున్నది. గిరాకీ తగ్గుతున్నది, ఆ మేరకు ఉత్పత్తిని తగ్గిస్తే నిరుద్యోగం తీవ్రత పెరుగుతుంది. అది గిరాకీని మరింతగా తగ్గిస్తుంది. అలాంటపుడు కోలుకోవటం ఎలా అన్నది ప్రశ్న

పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణ సంకటం అన్నట్లుగా తన ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు అమెరికా తీసుకుంటున్న చర్యలు యావత్ ప్రపంచాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నాయి. వడ్డీరేటును పెంచటంతో ప్రపంచంలో ఉన్న డాలర్లన్నీ అమెరికాకు పయనం కట్టటం, దాని విలువ పెరగటంతో అనేక దేశాల కరెన్సీల విలువ పతనమౌతున్నది. అది కష్టజీవుల మీద ఎనలేని భారాన్ని మోపుతున్నది. 2022లో 8.7శాతంగా ఉన్న ప్రపంచ ద్రవ్యోల్బణం క్రమంగా తగ్గుతూ 2024లో 5.8 ఉంటుందని అంచనా. ఇదేమీ తక్కువ కాదు. రెండు శాతానికి పరిమితం చేయాలన్న ప్రపంచ ద్రవ్యోల్బణ లక్ష్యం ఎప్పటికి నేరవేరుతుంది అన్నది ప్రశ్నే. మనదేశంతో సహా అనేక దేశాలు తీవ్రమైన లోటును ఎదుర్కొంటున్నాయి. అమెరికా విత్తలోటు 8 నుంచి వచ్చే ఏడాదికి 7.4శాతానికి, ఐరోపాలో 3.4 నుంచి 2.7 శాతానికి తగ్గుతుందని చెబుతున్నారు. మరోసారి ప్రపంచ మార్కెట్లో ఇంధన ధరల పెరుగుల సూచనలు కనిపిస్తున్నాయి. ఎగుమతి దేశాలు తమను తాము కాపాడుకునేందుకు ఉత్పత్తి, సరఫరాను తగ్గించాలన్న నిర్ణయం దిగుమతి దేశాలకు ఆశనిపాతమే. ఒకవైపు రష్యా ఇంధన ఎగుమతులపై అమెరికా, ఐరోపా దేశాలు ఆంక్షలు విధించి దాన్ని దెబ్బతీయాలని చూస్తున్నాయి. రష్యా నుంచి ఐరోపాకు ఇంధన సరఫరా చేసే పైప్‌లైన్లను ధ్వంసం చేయించింది అమెరికాయే అనే వాస్తవాలు వెల్లడయ్యాయి. ఉక్రెయిన్ సంక్షోభాన్ని అవకాశంగా తీసుకొని తన ఇంధనాన్ని ఎక్కువ ధరలకు ఐరోపాకు అంటగట్టేందుకు చేసిన కుట్ర ఇదని చెబుతున్నారు. తనను నమ్మిన దేశాలకే అమెరికా పంగనామాలు పెడుతోంది. ఇప్పటికే ఐరోపా దేశాలు ఇంధన ధరల పెరుగుదలతో సతమతమౌతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఎంత మేరకు తట్టుకోగలవు అన్నది ప్రశ్న. అంతిమంగా కార్మికవర్గం మీదనే ఆ భారాలు మోపుతారన్నది వేరే చెప్పనవసరం లేదు.

ఎంత చెట్టుకు అంతగాలి అన్నట్లుగా పెరిగిన ద్రవ్యోల్బణం గృహస్తుల పొదుపు ఇప్పటికే హరించింది. ఒత్తిడి తీవ్రత తగ్గింది తప్ప దాని పర్యవసానాలైన పెరిగిన రుణభారం, ఇతర వ్యవస్థాగత ప్రతికూలతలు ఇంకా అలాగే ఉన్నాయి. ప్రపంచమంతటా వాణిజ్య విశ్వాస సూచిక దిగువ చూపులు చూస్తున్నది. గిరాకీ తగ్గుతున్నది, ఆ మేరకు ఉత్పత్తిని తగ్గిస్తే నిరుద్యోగం తీవ్రత పెరుగుతుంది. అది గిరాకీని మరింతగా తగ్గిస్తుంది. అలాంటపుడు కోలుకోవటం ఎలా అన్నది ప్రశ్న. తాజా ప్రపంచ ఆర్థిక దృక్కోణ నివేదిక వెల్లడించిన అంశాలు పరిస్థితి మరింగా దిగజారటాన్నే సూచిస్తున్నాయి. ఇది ఆందోళన కలిగించే అంశం.



పాలస్తీనా... ఓ నెత్తుటి ప్రవాహం

'సామ్రాజ్యవాదమంటే యుద్ధం'- అని లెనిన్ అన్నట్టు ప్రస్తుత ఇజ్రాయిల్-పాలస్తీనా యుద్ధం దానికి అద్దం పడుతోంది. అమెరికా సామ్రాజ్యవాద సహకారంతో పాలస్తీనాలో చొరబడ్డ యూదులు క్రమక్రమంగా అక్కడి ప్రాంతాలను ఆక్రమిస్తూ స్థానికులను శరణార్థులుగా చేసే స్థితికి చేరారు. అసలు యూదులకు పాలస్తీనాతో సంబంధమే లేదు. అక్కడ నివసించటం తమ పవిత్ర హక్కుగా వారే ప్రకటించుకున్నారు. 19వ శతాబ్దం చివర పలు ప్రాంతాల నుండి పాలస్తీనాకు వలసొచ్చారు. క్రమంగా పాలస్తీనాలో చొరబడి స్థానిక అరబ్బుల సంఖ్యను మించిపోయారు. అంతర్జాతీయ న్యాయ సూత్రాలను ఉల్లంఘించి బలప్రయోగంతో, అమెరికన్ సామ్రాజ్యవాద సహకారంతో 1948లో ఇజ్రాయిల్ అనే నూతనదేశాన్ని ప్రకటించుకున్నారు. వాస్తవానికి అంతకుముందు ప్రపంచ రాజకీయ పటంలో ఇజ్రాయిల్ అనే దేశమే లేదు. అప్పటి నుండి పాలస్తీనా నిత్యం మండే రావణ కాష్టం, ఓ నెత్తుటి ప్రవాహం. యూదుల దాడికి తట్టుకోలేక పాలస్తీనాలోని అరబ్బులు పక్క దేశాలైన జోర్డాన్, లెబనాన్, సిరియా, ఈజిప్ట్ తదితర దేశాలలో శరణార్థులుగా శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. చివరకు తమ సొంతదేశంలో సైతం శరణార్థులుగా మిగిలిపోయారు. 75 ఏండ్లుగా నానా బాధలు పడుతూ జీవచ్ఛవాలుగా జీవిస్తున్నారు. తమ మాతృభూమిపై మమకారం, తిరిగి దాన్ని దక్కించుకోవాలనే పట్టుదలతో ఎన్ని దెబ్బలు తిన్నా, త్యాగాలు చేస్తూ పోరాడుతూనే ఉన్నారు. శత్రువుది సామ్రాజ్యవాద బలం, దొంగదెబ్బ అయితే, వారిది ఆత్మస్థైర్యం. పక్క దేశాలలో తలదాచుకొని పోరాటం చేయడం అనేది చరిత్రలోకి పాలస్తీనా ప్రజలతోనే వచ్చింది. కాళ్ల కింద నేల ఉంటే నిలదొక్కుకొని, నిలబడి పోరాటం చేయవచ్చునని, విజయం సాధించవచ్చని చైనా, వియత్నాం ప్రజలు నిరూపించారు. కాని సొంత భూమిలో నిలువ నీడ లేక, కాళ్ల కింద నేల కోసం పోరాటం చేయాల్సి రావడం చరిత్రలో అత్యంత విషాదం.

1933 తర్వాత యూరప్‌లో నాజీయిజం, ఫాసిజం బలపడి యూదు వ్యతిరేకత తీవ్రమై సుమారు 57.5 లక్షల యూదులను నాజీలు హతమార్చారు. దీంతో యూదులు పాలస్తీనాకు పెద్దఎత్తున వలసొచ్చి తలదాచుకున్నారు. పాలస్తీనా అరబ్బు ప్రజలు వీరిని సాదరంగా దయతో ఆశ్రయమిచ్చారు. అయితే ఏండ్లు గడిచేకొద్ది పాలస్తీనాలో యూదుల జనాభా పెరిగిపోయింది. దీంతో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తతలు మరింతగా పెరగడం మొదలైంది. 1948 మే 18న యూదులు ఇజ్రాయిల్ దేశాన్ని సొంత దేశంగా, పాలస్తీనాలో తాము ఆక్రమించుకున్న భూభాగంలో ప్రకటించుకున్నారు. దీంతో ఇక్కడ అప్పటి నుంచి యుద్ధ వాతావరణం ఏర్పడింది. అలాగే అమెరికా, ఇతర బడా దేశాల ఆయుధాలు, అండదండలతో ఇజ్రాయిల్ దూకుడుగా పాలస్తీనా భూభాగాలను ఆక్రమించుకుంటూ రోజురోజుకూ ముందుకు పోయింది. దీనిని సహజంగా స్థానికులైన పాలస్తీనీయులు ప్రతిఘటిస్తున్నారు. అది నేడు ఈ దశకు చేరుకుంది. ఐక్యరాజ్యసమితి పశ్చిమాసియాలో సార్వభౌమాధికారం గల స్వతంత్ర దేశమైన పాలస్తీనాను 2012 దాక గుర్తించలేదు. సభ్యత్వం కూడా ఇవ్వలేదు.

ఈ నేపథ్యంలో పాలస్తీనా విమోచనకు యాసర్ అరాఫత్ నాయకత్వంలో పీఎల్ఓ (పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్) ఏర్పడింది. ఇది కొంతకాలం పాటు సాయుధ పోరాటం కొనసాగించి, క్రమేణ సంప్రదింపులు, సంధి చేసుకోవడం వంటి మెతక వైఖరి అవలంభించటంతో 1987లో 'హమాస్' సాయుధ పోరాటంతో పాలస్తీనా విమోచనమే లక్ష్యంగా ఏర్పడింది. దీంతో సంక్షోభం మరింత ముదిరింది. నేటి ఈ పరిస్థితులకు పూర్తి బాధ్యత ఇజ్రాయిల్‌దే. పాలస్తీనా తన అస్థిత్వం కోసం ఆరాటపడుతూ ఉంది. వీరిది ధర్మాగ్రహం, పోరాటం. ఏండ్ల తరబడి అణిచివేతకు ప్రతీ కారమే నేటి ఈ తాజా దాడి. వాస్తవం ఇది కాగా ఇజ్రాయిల్, అమెరికా బడా పెట్టుబడిదారులకు పుట్టిన విష మీడియా హమాస్‌ను తీవ్రవాద, ఉగ్రవాద సంస్థ అంటూ ప్రచారం చేస్తున్నాయి. వాస్తవానికి ప్రపంచంలో భయంకరమైన ఉగ్రవాద దేశం అమెరికాయే. ప్రతి చిన్నదానికి ఇతర దేశాల ఆంతరంగిక సమస్యలలో వేలుపెట్టి, కలహాలు పెట్టి యుద్ధాలు సృష్టించి ఆయుధాలు అమ్ముకుంటూ ఆయా దేశాలలో రక్తం పారించిన చరిత్ర అమెరికాది. నేడు ప్రపంచమంతటా న్యాయమైన తమ సహజ హక్కులు, గౌరవంగా జీవించటం కోసం విధిలేని పరిస్థితుల్లో ప్రజలు పోరాటాలకు దిగితే వారిని తీవ్రవాదులు, ఉగ్రవాదులుగా ముద్ర వేయడం మామూలై పోయింది.

రోజురోజుకూ పాలస్తీనీయన్ల న్యాయపోరాటానికి ప్రపంచ దేశాల నుండి మద్దతు పెరుగుతూ ఉంది. గతంలో అలీన విధానంతో బడుగుదేశాలకు అండగా నిలబడిన భారతదేశం నెహ్రూ హయాం నుండి పాలస్తీనాకు అండదండలు అందించింది. కాని నేడు దేశ ప్రధాని మోడీ మాత్రం ఇజ్రాయిల్‌కు భారత్ అండగా ఉంటుందని ప్రకటించారు. దీనిని బట్టి బీజేపీ విదేశాంగ విధానం అర్థం చేసుకోవచ్చు. పశ్చిమాసియా ఒక వనరుల గని. అపారమైన చమురు సంపదకు నిలయం. ఈ వనరుల మీద కన్నేసిన అమెరికా, ఇతర సామ్రాజ్యవాద దేశాలు ఈ సంపదను దోచుకోవడానికి మంటలు రాజేసి చలి కాచుకుంటున్నాయి. ముఖ్యంగా అమెరికా అన్నదమ్ములైన ఇరాన్- ఇరాక్ మధ్య చిచ్చుపెట్టి యుద్ధం సృష్టించింది. ఇరాక్‌ను దురాక్రమించి వల్లకాడుగా మార్చివేసింది. ఆఫ్ఘనిస్తాన్‌ను శ్మశానంగా మార్చి వేసింది. ఇక సిరియా సంక్షోభం అంతాఇంతా కాదు. మొత్తం పశ్చిమాసియాను శరణార్థి శిబిరంగా మార్చివేసింది. ఇదంతా సామ్రాజ్యవాదం సృష్టించిన మానవ సంక్షోభం. అందుకే లెనిన్ మహాశయుడు సామ్రాజ్యవాదమంటే దురాక్రమణ, దోపిడీ, యుద్ధం అంటారు. ఈ విష విలయం నుండి మానవాళి విముక్తి చెందాలంటే సోషలిస్టు వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. పాలస్తీనా ప్రజలు వారి మనుగడ కోసం సొంత భూమిలో నిలవనీడ కోసం పోరాటం చేస్తున్నారు. వారికి యావత్ భారతదేశం అండగా నిలబడాలి. వారి పోరాటం న్యాయ మైనది. న్యాయమైన ఈ పోరాటంలో పాలస్తీనా ప్రజల గెలుపు తథ్యం. పాలస్తీనా విమోచనం తోనే సమస్య పరిష్కారం అవుతోంది.



- షేక్ కరిముల్లా
సెల్ : 9705450705

మనుస్మృతిని అంబేద్కర్ ఎందుకు తగలబెట్టారు?



డాక్టర్ దేవరాజు మహారాజు

పైకి ఎదగడానికి ఏ మాత్రం వీలులేని కుటుంబంలో పుట్టి, ఏ అవకాశమూ లేని సామాజిక పరిస్థితుల్లో పెరిగి, అస్పృశ్యుడిగా అవమానాల పాలవుతూ కూడా నిబ్బరంగా ఉంటూ, ఆత్మవిశ్వాసంతో, మొక్కవోని దీక్షతో ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ విశ్వమానవుడిగా ఎదిగినవారు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆ కాలంలో అన్ని పుస్తకాలు చదివి, అన్ని డిగ్రీలు సంపాదించి అత్యున్నత స్థాయికి చేరిన మేధావి ఆయన! మరి, మనుస్మృతి లాంటి గ్రంథాన్ని బహిరంగంగా, బాహాటంగా, ధైర్యంగా ఎందుకు తగులబెట్టారూ? అలా తగులబెట్టాల్సిన ప్రమాదకరమైన విషయాలు, సమాజానికి హాని కలిగించే విషయాలు అందులో ఏమున్నాయి? - అని పరిశీలిస్తే... ఉన్నాయి! ఈ అత్యాధునిక వైజ్ఞానిక సమాజాన్ని వెనక్కి నడిపించే చెత్తంతా అందులో ఉంది. అంబేద్కర్ ఆ గ్రంథాన్ని తిరస్కరించడంలో న్యాయముంది. మనువాద భావజాలాన్ని వదులుకోవాల్సి ఉందన్న సందేశం ఈ దేశ ప్రజలకు ఇవ్వడం కోసం ఆయన అలా ఆ గ్రంథాన్ని తగలబెట్టి చూపించారు. అయినా, సమాజంలో రావల్సినంత మార్పు రాలేదు. అణగారిన వర్గాలకు చెందిన వారే మూర్ఖంగా మనువాద భావజాలంలో కొట్టుకుపోతున్నారు. వైదిక ధర్మ ప్రబోధాలకు ప్రభావితులై, వాటిని పాటిస్తూ తాము అగ్రవర్ణాల వారి స్థాయికి చేరుకున్నామని సంతృప్తి పడుతున్నారు. కానీ అది అర్థం లేనిది. ఏ వర్గం వారైనా, ఏ వర్ణం వారైనా తమ తమ స్థాయి భేదాల్ని వదులుకుని, అందరం మనుషులమేనని గుర్తించుకున్న నాడే మానవత్వం పరిమళిస్తుంది. ఆధునిక జన్యుశాస్త్ర సారాంశం గ్రహించిననాడే మానవవాదం బలపడుతుంది. మనుస్మృతిని అంతా ఇక్కడ పరిచయం చేయబోవడం లేదుగానీ, మానవీయ విలువలకు విఘాతం కలిగించే అంశాలు ఏమేము న్నాయో కొన్నిటిని విశ్లేషించుకుందాం! మతిలేని సూక్తులు ఆ గ్రంథంలో ఇంతగా ఉన్నాయా? అని ఆశ్చర్యపోవాల్సి వచ్చినా.. ఏ మాత్రం ఆశ్చర్యపోవద్దు. డా. బి.ఆర్. అంబేద్కర్‌ను అనుసరిస్తే చాలు!!

బ్రాహ్మణుడు మూడు రోజులు పాలు అమ్మితే గనక, అతను శూద్రుడయిపోతాడు (మనుస్మృతి 10/92) అంటే పాల వ్యాపారం చేసేవారు ఎవరైనా బ్రాహ్మణుల దృష్టిలో శూద్రులే- యజ్ఞంలో కొడుకును బలి ఇచ్చినా బ్రాహ్మణుడు బ్రాహ్మణుడి గానే ఉంటాడు (మనుస్మృతి 10/105) బ్రాహ్మణుడు కుక్క మాంసం భుజించినా బ్రాహ్మణుడిగానే ఉంటాడు (మనుస్మృతి 10/106-10/108) ఇతరులు గనక ఏ మాంస భక్షణ చేసినా పతితులైపోతారు. ఇదేం న్యాయం? ఇక మనుస్మృతి 10వ అధ్యాయంలోని 95 నుండి 98 వరకు నాలుగు శ్లోకాల సారాంశమేమంటే- బ్రాహ్మణ వర్గానికి చెందని తక్కువస్థాయి వ్యక్తులెవరూ బ్రాహ్మణులు చేసే పనులు చేయగూడదు. పైనున్న బ్రాహ్మణ వర్గం వారు మాత్రం అవసరమైనప్పుడు జీవిక కోసం తక్కువ స్థాయి వారి పనులు చేసుకోవచ్చు. ఆ విధంగా కొంచెం నిలదొక్కుకున్న తర్వాత మళ్ళీ వారు, వారి కులవృత్తిని స్వీకరించవచ్చు. ఇలాంటి అవకాశం కింది కులాల వారికి లేదు. అంటే బ్రాహ్మణులు బతకడానికి నిమ్న వర్గాల వారి వృత్తులు చేసుకోవచ్చు. నిమ్న వర్గాల వారి బతుకుదెరువు మీద దాడి చెయ్యొచ్చు. వారికి పుట్టగతులు లేకుండా చేసే అధికారం బ్రాహ్మణులకు ఉంది. కానీ, ఎట్టి పరిస్థితుల్లోనూ నిమ్న వర్గాలవారు పై వర్గం వారి కులవృత్తిని దెబ్బ తీయకూడదు. తమ వర్గం వారికి అనుగుణంగా మనుస్మృతి రాసుకుని, దాన్ని బలవంతంగా జనం మీద రుద్దారు అని అనడానికి ఇంత కన్నా ఏ సాక్ష్యాలు కావాలి? ఇందులో ఏ న్యాయముంది? ఏ మానవీయ విలువలున్నాయి.

లోకంలో ఉన్న వాస్తవానికీ మనుధర్మ శాస్త్రంలో వారు రాసుకున్నది పూర్తి వ్యతిరేకం. పూజలు, వ్రతాలు, యాగాలు, కర్మకాండలు వగైరా చేసి భూరి సంభావనలు స్వీకరించి, సంపాదించుకున్నది వారి స్వంత ఆస్థి అని భ్రమపడుతున్నారు పాపం! బ్రాహ్మణార్యులకు ఉన్న బ్రహ్మ జ్ఞానమేమిటో వివరంగా చెప్పుకుంటే బావుండేది.

> ఉత్పత్తి రేవ విప్రస్య మూర్తిర్ధర్మస్య శాశ్వతీ,
> సహి ధర్మార్థముత్పన్నో బ్రహ్మభూయాయ కల్పతే. 98
> బ్రాహ్మణో జాయమానో హి పృథివ్యామధి జాయతే,
> ఈశ్వరస్సర్వ భూతానాం ధర్మకోశస్య గుప్తయే. 99
> సర్వం స్వం బ్రాహ్మణ స్యేదం యత్కించి జ్జగతీగతం!
> శ్రేష్ఠ్యే నాభిజనేనేదం సర్వం వై బ్రాహ్మణోర్హతి. 100

ఈ సృష్టి యందు ప్రాణులు గొప్పవి. ప్రాణుల యందు బుద్ధి వల్ల జీవించు జీవులు గొప్పవి. ఆ జీవుల యందు మానవులు మిక్కిలి గొప్పవారు. వారిలో బ్రాహ్మణులు గొప్పవారు. ఆ బ్రాహ్మణులలో విద్వాంసులు శ్రేష్ఠులు. ఆ విద్వాంసుల యందు యుక్తాయుక్త విచక్షణ కలవారు శ్రేష్ఠులు. కాగా వారి కంటె బ్రహ్మ జ్ఞానము కలవారు మిక్కిలి గొప్పవారు. ఈ బ్రాహ్మణుడు ధర్మ రక్షణకై పుట్టినాడు. ధర్మాన్ని ఆచరిస్తున్నందు వల్లనే అతడు బ్రహ్మత్వాన్ని పొందుతున్నాడు. అతడు సర్వశ్రేష్ఠుడు. అందరకు సమీపస్థుడు కావున, ఈ ప్రపంచమంతయు అతని సొత్తుగానే పరిగణింపబడుచున్నది.

పై శ్లోకాలకు తాత్పర్యం అలా ఉంటే, అందులో మనుషులందరిలో బ్రాహ్మణుడు ఎందుకు శ్రేష్ఠుడయ్యాడో వివరణ లేదు. ఇక్కడ ధర్మ రక్షణ అంటే- తమ పూట తాము గడుపుకోవడమేనని అర్థం చేసుకోవాలి! వారు కష్టపడిందీ లేదు. ఇతరులకు సహాయపడిందీ లేదు. సామాజిక కార్యాచరణ లోగడ ఏమీ లేదు. ఇప్పుడూ లేదు. భవిష్యత్తులోనూ ఉండదు. పూజలు చేయకపోతే అరిష్టం అని బ్లాక్‌మెయిల్ చేసి, భయపెట్టి సొమ్ము లాగేసుకోవడం తప్ప మరొకటి లేదు కదా? అది అక్రమార్జన అవుతుంది తప్ప సక్రమార్జన కాదు. ఈ దేశం మూఢనమ్మకాల్లో కూరుకుపోవడానికి వీళ్ళే ముఖ్య కారణం! వీరితో పాటు అన్ని మతాల మత బోధకులు కూడా కారణం!!

> స్వమేవ బ్రాహ్మణో భుజ్క్తే స్వం వస్తే స్వం దదాతి చ,
> ఆన్నృశంస్యాద్బ్రాహణస్య భుంజతే హీతరే జనాః 101

బ్రాహ్మణుడు తన సొత్తును తానే అనుభవించుచున్నాడు. తన వస్త్రమును తానే ధరించుచున్నాడు. తన వస్తువులనే దానము చేయుచున్నాడు పైగా అతని దయాదాక్షిణ్యముల వలన ఇతరులు బ్రాహ్మణుని సొత్తుననుభవించుచున్నారు.

ఈ శ్లోకాన్ని, దాని తాత్పర్యాన్ని అర్థం చేసుకుని, కొంచెం ఇంగిత జ్ఞానంతో ఆలోచిస్తే విషయం బోధపడుతుంది. సరే- ఇంగిత జ్ఞానమంటే ఏమిటీ? అని అడిగే వారే ప్రస్తుతం అధికారంలో ఉన్నారు. అందుకే కదా జనాన్ని ఆలోచింప జేయడానికి ఈ ప్రయత్నం?

శ్రమజీవుల్ని అదిరించి, బెదిరించి సంపాదించిన సొత్తు శతాబ్దాలుగా అన్యాయంగా అనుభవిస్తున్నారన్నది వాస్తవం. వారు తినే తిండి వారు పండించుకున్నది కాదు. వారు కట్టుకునే గుడ్డ వారు నేసుకున్నది లేదు. కాళ్ళకు వేసుకునే చెప్పులు వారు కుట్టుకున్నవి కావు. మాసిన గుడ్డలు వారు ఉతుక్కున్నది లేదు. వారు వాడుకునే ఏ వస్తువూ వారు తయారు చేసుకున్నది కాదు. ఒళ్లు వంచింది లేదు. చమట కార్చిందీ లేదు. అప్పనంగా వచ్చింది కూర్చుని ఆరగించడం తప్ప, శ్రమ శక్తి విలువ ఏమిటో వారికేమి తెలుసూ? యదార్థం ఆలోచిస్తే, దానాలు వీరు స్వీకరించడమే గానీ, మరొకరికి వీరిచ్చిందెపుడూ? ఒకసారి గతాన్ని నెమరు వేసుకుని చూడండి.



బ్రహ్మ అండం నుండి పుట్టాడు. పుట్టి ఆ అండాన్ని తనే స్వయంగా రెండుగా విడగొట్టాడు. ఆ రెండు భాగాల నుండి ఇంకా ఏమేమి సృష్టించాడో 13వ శ్లోకంలో ఉంది. ఆ పద మూడవ శ్లోకం ప్రకారం ఆకాశం, పృథ్వి, ఆ రెండింటి మధ్య స్వర్గం ఏర్పరిచాడు. ఇంకా వాటి వెంట ఎనిమిది దిక్కులు, ఎనిమిది సముద్ర జలాలు సృష్టించాడు. ఇంత అత్యద్భుతమైన పరిణామ సిద్ధాంతం మనకు మనువాదులు ఇస్తే, దాన్ని గుర్తించకుండా అనవసరంగా డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం వెనక పడ్డారెందుకూ? పాపం! ఈ ప్రస్తుత ప్రభుత్వాన్ని మనం అనవసరంగా ఆడిపోసుకుంటున్నామా? ప్రపంచం ఆమోదించిన డార్విన్ సిద్ధాంతం పాఠ్య గ్రంథాల్లోంచి తీసేసి భావిభారత పౌరుల జీవితాల్లో చీకటి నింపకండని అనవసరంగా గగ్గోలు పెడుతున్నామా? ఒక్కసారి ఇంగిత జ్ఞానంతో ఆలోచిస్తే ఎవరి జవాబు వారికే లభిస్తుంది.

తోటి మనుషుల పట్ల మనువాదుల అభిప్రాయాలు, ఆలోచనలు ఎంత నీచంగా ఉంటాయో గమనించండి-

పంది వాసన చూచుట చేతను, కోడి రెక్కల గాలి చేతను, కుక్క చూపు పడుట వలనను, శూద్రుడు తాకుట చేతను పదార్థములు అపరిశుద్ధమగును (మనుస్మృతి 3-24) ఇది ఒప్పుకోదగ్గదేనా?

అసలైన పరిణామవాదం మనుధర్మ శాస్త్రంలో ఉంది చూస్కోండి ! ఒకటవ అధ్యాయం 9-12 శ్లోకాలలోనే అంతా ఉంది.

బ్రహ్మ అండం నుండి పుట్టాడు. పుట్టి ఆ అండాన్ని తనే స్వయంగా రెండుగా విడగొట్టాడు. ఆ రెండు భాగాల నుండి ఇంకా ఏమేమి సృష్టించాడో 13వ శ్లోకంలో ఉంది. ఆ పద మూడవ శ్లోకం ప్రకారం ఆకాశం, పృథ్వి, ఆ రెండింటి మధ్య స్వర్గం ఏర్పరిచాడు. ఇంకా వాటి వెంట ఎనిమిది దిక్కులు, ఎనిమిది సముద్ర జలాలు సృష్టించాడు. ఇంత అత్యద్భుతమైన పరిణామ సిద్ధాంతం మనకు మనువాదులు ఇస్తే, దాన్ని గుర్తించకుండా అనవసరంగా డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం వెనక పడ్డారెందుకూ? పాపం! ఈ ప్రస్తుత ప్రభుత్వాన్ని మనం అనవసరంగా ఆడిపోసుకుంటున్నామా? ప్రపంచం ఆమోదించిన డార్విన్ సిద్ధాంతం పాఠ్య గ్రంథాల్లోంచి తీసేసి భావిభారత పౌరుల జీవితాల్లో చీకటి నింపకండని అనవసరంగా గగ్గోలు పెడుతున్నామా? ఒక్కసారి ఇంగిత జ్ఞానంతో ఆలోచిస్తే ఎవరి జవాబు వారికే లభిస్తుంది. మనమేమంటున్నామనీ? ప్రభుత్వం వారు అతిగా స్పందిస్తున్నారూ? ఉన్నది ఉన్నట్టుగా చెప్పి, ఆలోచించుకునే స్వేచ్ఛ జనానికి ఇవ్వండని అంటున్నాం! అంతే- కల్లబొల్లి కబుర్లు చెప్పి జనాన్ని మభ్యపెట్టకండని అంటున్నాం. అయినా జనం గతంలో లాగా అమాయకత్వంలో ఏమీ కూరుకుపోలేదు. వారు తెలుసుకుంటున్నారు. ఆలోచిస్తున్నారు. విశ్లేషించుకుంటున్నారు. వాస్తవాల వైపు, నిజాల వైపు ఆకర్షితులవుతున్నారు. అలాంటి ఆరోగ్యకరమైన పరిణామాన్ని మనం ఆహ్వానించాలి!

ఈ ఆధునిక వైజ్ఞానిక యుగానికి సరిపడే విధంగా మనుషుల ఆలోచనా ధోరణిలో మార్పు రావాలన్న తపన తప్ప, మనుస్మృతి పేరుతో ఒక వర్గం వారిని ఉద్దేశించి, వారిని ఎద్దేవా చేయడానికి రాస్తున్నది కాదు. ఇందులోని అమానవీయమైన విషయాలని మన రాజ్యాంగం, కోర్టులు ఒప్పుకుంటాయా అన్న ఆవేదన ఆందోళన తప్ప ఎవరినో తక్కువ చేసి చూపడానికి కాదు! గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దే బాధ్యత ఈ దేశ పౌరులందరిది- అని గుర్తు చేయడం కోసమే ఈ విషయాల్ని ఇక్కడ సమీక్షించడం జరిగింది. శతాబ్దాలుగా ద్వేషం పెంచి పోషించి, మనుషుల్ని విభజించింది చాలదా? ఇకనైనా దృక్పథాలు మార్చుకోవాల్సిన అవసరం లేదా ?

"నువ్వు ఆనందకరమైన జీవితం గడపాలనుకుంటే, దాన్ని వ్యక్తులతోనో లేక వస్తువులతోనో గాక, ఒక లక్ష్యంతో ముడి పెట్టుకో" - ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్.

- కేంద్ర సాహిత్ర అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.

దుస్థితిలో దేశ ఆర్థిక వ్యవస్థ!

పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని కోరుతూ రాజధాని న్యూ ఢిల్లీలో గత ఆదివారం లక్షల సంఖ్యలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రదర్శన జరిపారు. ఇంతటి బృహత్తరమైన ప్రజా ప్రదర్శనకు సంబంధించిన కవరేజీ... మన దేశాన్ని పట్టి పీడిస్తున్న తీవ్ర ఆర్థిక మాంద్యం ప్రతిబింబాన్ని... అస్పష్టంగా కేవలం ఒక సంఘటనగా వర్ణించడానికి మాత్రమే పరిమితమైంది. పాత పెన్షన్ పథకం ప్రకారం, ఒక ఉద్యోగి చివరిసారిగా తాను అందుకున్న జీతంలో 50 శాతాన్ని బోనస్‌గా అందుకుంటాడు. ఈ మొత్తం కూడా ప్రతి ఏడాదీ ద్రవ్యోల్బణానికి తగినట్లుగా సర్దుబాటు అవుతూ వుంటుంది. మరోవైపు కొత్త పెన్షన్ పథకంలో ఉద్యోగి అందుకునే పెన్షన్ పాత పెన్షన్ పథకం కింద వచ్చే మొత్తంలో సగానికి మించదు. 2004 తర్వాత సర్వీసులోకి ప్రవేశించిన వారందరూ కొత్త పెన్షన్ పథకానికి మాత్రమే అర్హులని చట్టం పేర్కొంటోంది.

ఇరవయ్యేళ్ల తర్వాత వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలను ప్రభావితం చేసే సమస్యగా ఇది మారిందన్నది వాస్తవం. పెరుగుతున్న ధరలు, తగ్గుతున్న ఆదాయాలతో భారతదేశాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న జీవన వ్యయ సంక్షోభాన్ని ఇది ప్రతిబింబిస్తోంది. మధ్య తరగతి వారికి కూడా జీవనోపాధులు మరింత దుర్భరంగా మారుతున్నాయి. కొత్త పెన్షన్ పథకాన్ని పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టినపుడు, పెన్షన్ అనేది కార్మికుడి హక్కు అని, అంతేకానీ ప్రభుత్వమిచ్చే నిరుద్యోగ భృతి కాదు అన్న సూత్రానికి కట్టుబడి సీపీ(ఐ)ఎం ఈ కొత్త పెన్షన్ పథకాన్ని వ్యతిరేకించింది. ఈ నాడు, ఆ వ్యతిరేకతకు గల కారణాలు ధృవీకరించబడుతున్నాయి.

మన దేశ ప్రజానీకం వాస్తవిక ఆదాయాలు కృశించి పోతున్నాయి. దీంతో జీవనం మరింత దుర్భరంగా మారుతోంది. దేశ ఆర్థికారోగ్యం కూడా తీవ్రంగా ప్రభావితమవుతోంది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోవడంతో దేశీయ డిమాండ్ తక్కువవుతోంది. పెట్టుబడులు దెబ్బ తింటున్నాయి. ఇటువంటి పెట్టుబడులతో తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ వుండడం లేదు. ఉత్పత్తి చేసింది వెంటనే అమ్ముడయ్యి లాభాలు వచ్చి, అభివృద్ధి నమోదైతేనే పెట్టుబడులు పెరుగుతాయి. డిమాండ్, పెట్టుబడులు లేనపుడు ఆర్థిక వృద్ధి కూడా జరగదు. ఈ నాడు భారతదేశ ఆర్థిక వ్యవస్థను పట్టి పీడిస్తున్న ప్రాథమిక సమస్య ఇది.

మోడీ ప్రభుత్వ హయాంలో మతం-కార్పొరేట్ బంధం మరింత బలపడుతుండడంతో, దేశంలో ఉత్పత్తి అయ్యే సంపదలో ప్రధాన భాగం ఆశ్రితుల చేతుల్లో వుంటోంది. అదానీ వ్యవహారం ఇందుకు మంచి ఉదాహరణగా వుంది. మెజారిటీ ప్రజలను పణంగా పెట్టి కొద్దిమంది ఆశ్రితులను మరింత సుసంపన్నులను చేయడానికి దేశ సంపద మళ్లించబడుతోంది. మోడీ ప్రభుత్వం అనుసరించే ఆర్థిక విధానాలు రెండు భారత దేశాలను-సంపన్నులకు ప్రకాశంతమైన భారతదేశాన్ని, నిరుపేదలకు బాధలు పడుతున్న భారతాన్ని-సృష్టించే క్రమానికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి.

అయితే, భారతదేశం పుంజుకుంటోందని, జీడీపీ దృష్ట్యా చూసినట్లైతే ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారే దిశగా పయనిస్తోందంటూ మోడీ ప్రభుత్వం అవిశ్రాంతంగా చేస్తున్న ప్రచారం పేర్కొంటోంది. ప్రభుత్వానికి ఎవరు నాయకత్వం వహిస్తారనే దానితో నిమిత్తం లేకుండా, ప్రస్తుత గణాంకాల ధోరణులను బట్టి చూసినట్లైతే, 2027లో భారత్ మూడవ స్థానంలో వుంటుంది. కానీ, తలసరి జీడీపీ దృష్ట్యా చూసినట్లైతే, ఈనాడు ప్రపంచంలో భారత్ ర్యాంక్ 142.



ప్రజల ఆదాయాలు తగ్గడం, ధరలు పెరుగుతుండడం, నిరుద్యోగం పెరుగుతుండడం, తయారీ రంగ వృద్ధిలో క్షీణత... ఇవన్నీ కలిసి ఉధృతమవుతున్న ఆర్థిక దుస్థితిని ప్రతిబింబిస్తున్నాయి. ఆశ్రితుల ఆస్తుల వృద్ధికి ఆశ్రయం కల్పించడం ఆపి, దానికి బదులుగా ప్రభుత్వ వనరులను ప్రజా పెట్టుబడులకు ఉపయోగించి, ఎంతగానో అవసరమైన మౌలిక వసతులను నిర్మించాల్సిన అవసరం వుంది. దీని వల్ల ఉద్యోగాలు కల్పించబడతాయి. ఆర్థిక వ్యవస్థలో దేశీయ డిమాండ్ పెరుగుతుంది. అయితే, దేశ జాతీయ ఆస్తులను దోపిడీ చేయడం ద్వారా తమ లాభాలను గరిష్ఠంగా పెంచుకునేందుకు విదేశీ, దేశీయ పెట్టుబడులకు మోడీ ప్రభుత్వం విధేయత కనబరుస్తున్నందున, ఈ సంక్షోభం మరింత అధ్వాన్నంగా మారుతుంది.

కొత్తగా ఆవిర్భవిస్తున్న ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను చూపెట్టేందుకు ఇటీవల జరిగిన జి-20 సదస్సును ఉపయోగించుకున్నారు. కానీ, మళ్లీ వాస్తవాలు పరిశీలిస్తే అసలు సత్యం బోధపడుతుంది. జి-20 దేశాలన్నింటిలోకి అత్యంత తక్కువ తలసరి జీడీపీ భారత్‌దే. అలాగే మానవ వనరుల అభివృద్ధిలో కూడా దిగువ స్థానంలోనే వుంది. దేశ ఆర్థికవ్యవస్థలో అత్యంత తక్కువ కార్మిక ప్రాతినిధ్యం రేటు వున్న రికార్డు కూడా మనదే. అంటే అత్యంత ఎక్కువగా నిరుద్యోగ సమస్య నెలకొందన్న మాట.

దీని వల్ల ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతోంది, ఫలితంగా, స్థూల ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతోంది. గతేడాది కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ పెట్టుబడులు వచ్చే కొత్త ప్రతిపాదనలు 72.5 శాతం క్షీణించగా, ప్రైవేటు పెట్టుబడులు 79.2 శాతం తగ్గాయి.

'మేక్ ఇన్ ఇండియా' పదేళ్ల ఘన విజయంపై పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అయితే అసలు ఇందులో నిజం ఏమిటి? 2013-14 నుండి తయారీ రంగం వృద్ధి సగటున 5.9 శాతం వుంది. పెట్టుకున్న లక్ష్యం మాత్రం 12-14 శాతంగా వుంది. కానీ ఈ లక్ష్యాన్ని సాధించలేదు. జీడీపీలో తయారీ రంగం వాటా 25 శాతం వుండాలని లక్ష్యంగా పెట్టుకోగా 16.4 శాతం దగ్గరే స్తంభించిపోయింది. 2011-12, 2021-22 మధ్య కాలంలో తయారీ రంగంలో ఉద్యోగాలు 12.6 శాతం నుండి 11.6 శాతానికి క్షీణించాయి. ఓబీసీలకు విశ్వకర్మ ప్రాజెక్టులను ఎర్రకోట నుండి ప్రధాని మోడీ ఎంతో ఆర్భాటంగా ప్రకటించారు. నైపుణ్యాలు కలిగిన కళాకారులకు రూ.13 వేల నుండి రూ.15 వేల కోట్లు ఖర్చు పెడతామని చెప్పారు. అయితే, పార్లమెంట్‌లో ప్రకటించింది చూసినట్లైతే, రాబోయే ఐదేళ్ల కాలంలో రూ.13 వేల కోట్ల రుణాల ప్యాకేజీని ఐదు శాతం వడ్డీతో పంపిణీ చేస్తామని ప్రకటించారు.

గ్రామీణ ప్రాంతాల్లో దుస్థితి కూడా పెరుగుతోంది. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్) డిమాండ్ గతేడాది కాలంలో 16.3 శాతం పెరిగింది. 2019-20 నుండి చూసినట్లైతే ఒక్కసారిగా 29.4 శాతం పెరిగింది. ఇది, మనుగడ కోసం ప్రజలు పడుతున్న దుస్థితి స్థాయిని తెలియ చేస్తోంది. వాస్తవిక వేతనాలు ప్రతికూల అభివృద్ధిని నమోదు చేశాయని 2022-23 సంవత్సరానికి ఆర్థిక సర్వే పేర్కొంది.

ఆర్థిక కార్యకలాపాలు క్షీణించాయన్నది వీటన్నింటి ఫలితంగా వుంది. దుస్తులు, సముద్ర ఉత్పత్తులు, ప్లాస్టిక్‌లు, రత్నాలు, ఆభరణాలు వంటి కార్మిక శ్రమ ఎక్కువ వుండే ఎగుమతులు క్షీణించడంలో ఇది కనిపిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లో భారత్ వాటా బాగా తగ్గుతోంది. అంటే ఈ రంగాల్లో దేశీయ ఉపాధి కూడా బాగా తగ్గుతోందనే అర్థం.

ఫలితంగా ఆగస్టులో నిరుద్యోగం రేటు 8.1 శాతంగా వుంది. 2022లో యువత (15-24 సంవత్సరాలు) లో నిరుద్యోగం 23.22 శాతంగా వుంది. పట్టభద్రుల్లో ఇది ఏకంగా 42 శాతంగా వుంది. 2023 ఆగస్టులో దాదాపు 2 కోట్ల కుటుంబాలు ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ కింద పని కావాలని డిమాండ్ చేశాయి. భారతదేశ ప్రజల డివిడెండ్‌ను మోడీ ప్రేరేపించిన విధ్వంసం ఇది.

ఉపాధి తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయి. గత కొన్నేళ్ళుగా ఆర్‌బిఐ పెట్టిన పరిమితి 6 శాతాన్ని ద్రవ్యోల్బణం అధిగమిస్తూనే వుంది. అంతకన్నా అధ్వాన్నమేంటంటే, ఆహార పదార్థాలు, నిత్యావసరాల ధరలు పెరుగుతుండడంతో ఈ ద్రవ్యోల్బణం ఇంకా పెరుగుతోంది.

జిడిపి శాతంగా కుటుంబాల ఆర్థిక ఆస్తులు క్షీణించడమే ఈ మొత్తం సంక్షోభానికి ప్రధాన కారణంగా వుంది. 2020-21లో 15.4 శాతంగా వున్న ఈ ఆస్తులు 2022-23లో 10.9 శాతానికి పడిపోయాయి. బతకడం కోసం ప్రజలు తమ కుటుంబ ఆస్తులుగా వచ్చిన వెండి, బంగారాలను అమ్ముకుంటున్నారు. కుటుంబాల నికర ఆర్థిక ఆస్తులు 11.5 శాతం నుండి 5.1 శాతానికి పడిపోయాయి.

ప్రజల ఆదాయాలు తగ్గడం, ధరలు పెరుగుతుండడం, నిరుద్యోగం పెరుగుతుండడం, తయారీ రంగవృద్ధిలో క్షీణత... ఇవన్నీ కలిసి ఉధృతమవుతున్న ఆర్థిక దుస్థితిని ప్రతిబింబిస్తున్నాయి. ఆశ్రితుల ఆస్తుల వృద్ధికి ఆశ్రయం కల్పించడం ఆపి, దానికి బదులుగా ప్రభుత్వ వనరులను ప్రజా పెట్టుబడులకు ఉపయోగించి, ఎంతగానో అవసరమైన మౌలిక వసతులను నిర్మించాల్సిన అవసరం వుంది. దీని వల్ల ఉద్యోగాలు కల్పించబడతాయి. ఆర్థిక వ్యవస్థలో దేశీయ డిమాండ్ పెరుగుతుంది. అయితే, దేశ జాతీయ ఆస్తులను దోపిడీ చేయడం ద్వారా తమ లాభాలను గరిష్ఠంగా పెంచుకునేందుకు విదేశీ, దేశీయ పెట్టుబడులకు మోడీ ప్రభుత్వం విధేయత కనబరుస్తున్నందున, ఈ సంక్షోభం మరింత అధ్వాన్నంగా మారుతుంది. భారతదేశ సంపదను ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ప్రజల సంక్షేమానికి పెట్టుబడిగా పెట్టేలా చూసేందుకు గాను ప్రభుత్వ అధికార పగ్గాలు బీజేపీ చేతుల్లో వుండకుండా చూడడం ఎంతో ముఖ్యం.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

కరీంనగర్ అభివృద్ధిని చూస్తే ముచ్చటేస్తుంది..

కమిట్‌మెంట్ ఉన్న నాయకుడు గంగుల కమలాకర్..

అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర నాయకుల అభినందన

నగరంలో పర్యటన..



మంత్రిని కలిసిన పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్ ఎమ్మెల్యే అభ్యర్థుల బృందం

నవతెలంగాణ కరీంనగర్

గడిచిన 10 సంవత్సరాల్లో కరీంనగర్‌లో జరిగిన అభివృద్ధిని చూస్తే ముచ్చటేస్తుందని అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్ ఎమ్మెల్యే అభ్యర్థులు అన్నారు. అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పలువురు ఎమ్మెల్యే అభ్యర్థుల బృందం తెలంగాణలో పర్యటిస్తుంది. ఈ సందర్భంగా గురువారం మంత్రి గంగుల కమలాకర్‌ను, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 రోజులుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి గురువారం కరీంనగర్‌కు వచ్చినట్టు తెలిపారు. నగరంలోని కేబుల్ బ్రిడ్జిని సందర్శించడంతో పాటు... చురుకుగా సాగుతున్న మానేరు రివర్ ఫ్రంట్ పనులను, ఐటీ టవర్‌ను సందర్శించారు. నగరంలోని సుందరమైన రోడ్లు... రాత్రి వేళ సెంట్రల్ లైటింగ్‌తో జిగేల్ మంటున్న నగరాన్ని చూసి ఆనందం వ్యక్తం చేశారు. 10 సంవత్సరాల్లో జరిగిన ఇంత అభివద్ధిని ఊహించలేక పోయమన్నారు. చేయాలనే తపన ఉంటే ఏదైనా సాధ్యపడుతుందని.. మంచి కమిట్‌మెంట్ ఉన్న నాయకుడు గంగుల కమలాకర్ అని అభినందించారు. పని చేసే నాయకున్నే ప్రజలు ఆదరిస్తారని.. రాబోయే ఎన్నికల్లో వరుసగా 4వ సారి గెలువబోతున్నారని మంత్రి గంగుల కమలాకర్ కు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అరుణాచల్ ప్రదేశ్ ఎమ్మెల్యే అభ్యర్థులు దోర్జీ ఖండు, థాయి తడప్, టేచికామ, బిరి జాయ్, దెబియ తార, చౌ శోటికే హెూపక్, పికే పు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు సిద్ధార్థ విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ - కరీంనగర్



ఈ నెల 13వ తేదీన స్థానిక అంబేద్కర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు జిల్లా స్థాయిలో వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు స్థానిక మంకమ్మతోట, భగత్‌నగర్‌లోని సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థులు జూనియర్ బాలికల విభాగంలో 8వ తరగతి చదువుతున్న జి.గీతిక, పి.సంజన, బి.నిఖిత, సీనియర్ బాలికల విభాగంలో 10వ తరగతి చదువుతున్న కే.చందన, ఏ.హాసిని, ఏ.అదితి, సీనియర్ బాలుర విభాగంలో 10వ తరగతి చదువుతున్న ఎస్.హర్షిత్, పి.పార్థు, కే.నిఖిలేశ్వర్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ దాసరి శ్రీపాల్ రెడ్డి అభినందించారు. జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచి పాఠశాలకు, తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్టలు తీసుకరావాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయ బృందం, ఇతర విద్యార్థులు అభినందించారు.

యువత భవిష్యత్ బాధ్యత నాదే..

కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా

బీఆర్ఎస్ పార్టీలో చేరిన యువతకు మంత్రి గంగుల బరోసా

నవతెలంగాణ - కరీంనగర్



బీఆర్ఎస్ పార్టీలో చేరిన యువత భవిష్యత్తు బాధ్యత తనదేనని బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. నగరంలోని పలువురు యువకులు స్థానిక మంత్రి మీ సేవ కార్యాలయంలో మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో పార్టీలో చేరారు. యువకులకు మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పెద్ద ఎత్తున గులాబీ గూటికి చేరిన యువత భవిష్యత్తు బాధ్యత తనదేనని వారికి అభయం ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం రాకముందు కరీంనగర్ అన్ని రంగాల్లో వెనుకబడి ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ గారి సహకారంతో వందల కోట్ల నిధులు నగర అభివృద్ధికి తీసుకొని వచ్చినట్టు వెల్లడించారు. నగరంలో ఎక్కడ చూసినా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని.. హైదరాబాద్ తర్వాత కరీంనగర్‌ను రెండో నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే కేబుల్ బ్రిడ్జ్ అందుబాటులోకి తెచ్చామని.. మానేర్ రివర్ ఫ్రంట్ పనులు 25 శాతం పూర్తి చేశామని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ ఢిల్లీ పార్టీలు అని బీఆర్ఎస్ ఒక్కటే మన ఇంటి పార్టీ అని గుర్తు చేసారు. రానున్న ఎన్నికల్లో సీఎం కేసీఆర్ చేతులు బలోపేతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర మేయర్ సునీల్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రకటనలపై పకడ్బందీగా పర్యవేక్షించాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బి.గోపి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ - కరీంనగర్ : రాజకీయ ప్రకటనలపై పకడ్బందీగా పర్యవేక్షించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బి.గోపి అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియావళిని పకడ్బందీగా అమలు చేయడంలో భాగంగా వివిధ మాధ్యమాల ద్వారా ప్రసారమయ్యే ప్రకటనలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రచారం కోసం అవసరమయ్యే అనుమతుల జారీకి ఏర్పాటు చేసిన జిల్లా మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) కేంద్రాన్ని, మీడియా సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బి.గోపి ప్రారంభించారు. గురువారం కరీంనగర్ కలెక్టరేట్‌లో 2వ అంతస్తులో గల జిల్లా శిక్షణ కేంద్రం (ఎమ్‌సీహెచ్)లో ఏర్పాటు చేసిన జిల్లా మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ)ని, మీడియా సెంటర్‌ను సీపీ, అదనపు కలెక్టర్లతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. తెలంగాణలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికలకు భారత ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించిన క్రమంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియావళి అమలులోకి భాగంగా వివిధ విభాగాలను ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో భాగంగా ఎంసీఎంసీని ప్రారంభించామన్నారు. ఈ కమిటీ సభ్యులు నిరంతరం వివిధ వార్తాపత్రికలు, టెలివిజన్, ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా ప్రసారమయ్యే చెల్లింపు వార్తలు, రాజకీయ ప్రకటనలను తనిఖీ చేయడంతో పాటు ప్రసారాలు, ప్రకటనలు వచ్చినట్లయితే ఎప్పటికప్పుడు వాటికి సంబంధించిన నివేదికలను రూపొందించి ఎన్నికల అధికారులకు పంపించాలని సూచించారు. ప్రకటనలకు సంబంధించి ఎంసీఎంసీ అనుమతి పొందే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో సీపీ ఎల్.సుబ్బారాయుడు, అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, డీఆర్‌ఓ (ఇన్‌చార్జి) పవన్ కుమార్, సమాచార శాఖ సహాయ సంచాలకులు అబ్దుల్ కలీం, ఉప కార్యనిర్వాహక సమాచార ఇంజనీర్ సీహెచ్.కొండయ్య, ఏఓ సుధాకర్, డీఐఓ శివరాములు, డీవైఓ వెంకట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ఆకస్మిక తనిఖీ

భారత ఎన్నికల సంఘం శాసనసభ ఎన్నికలకు షెడ్యూల్‌ను విడుదల క్రమంలో ఏర్పాటు చేసిన పర్యవేక్షణ బృందాలు అప్రమత్తంగా ఉండి నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బి.గోపి సూచించారు. గురువారం కలెక్టరేట్ మొదటి అంతస్తులోని వ్యవసాయ శాఖ శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ (సి-విజిల్, ఎన్‌జీసీ, ఈ-సువిధ, ఎక్స్పెండేచర్ మానిటరింగ్ కమిటీ, 1950 కాల్ సెంటర్ కేంద్రాలను సీపీ, జేసీ ఇతర అధికారులతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రతి విభాగం అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకునేలా జిల్లా ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకరావాలన్నారు. సీ-విజిల్ పోర్టల్‌ను పరిశీలించారు. అనంతరం రిజిష్టర్లను పరిశీలించి, ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బంది వారికి కేటాయించిన విధులను పగడ్బందీగా నిర్వహించాలని, ఎవరైన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీ సుబ్బారాయుడు, అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, డీఆర్‌ఓ (ఇన్‌చార్జి) పవన్ కుమార్, సీపీఓ కొమురయ్య, ఏఓ సుధాకర్, డీపీఓ శ్రీధర్, డీఐఓ శివరాములు, సమాచార శాఖ సహాయ సంచాలకులు అబ్దుల్ కలీం, ఉప కార్యనిర్వహక సమాచార ఇంజనీర్ సీహెచ్.కొండయ్య, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, డీవైఓ వెంకట రాంబాబు, డీఎం సివిల్ సప్లై రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వీణవంకలో 48 మంది బైండోవర్

నవతెలంగాణ - వీణవంక : త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలల్లో భాగంగా వివిధ కేసుల్లో ఉన్న నిందితులు 48 మందిని గురువారం తహసీల్దార్ తిరుమల్‌రావు ఎదుట బైండోవర్ చేసినట్లు వీణవంక ఎస్సై ఎండీ ఆసీఫ్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఇల్లందకుంటలో 43మంది..

నవతెలంగాణ - ఇల్లందకుంట

మండలంలో బెల్ట్‌షాపులు నిర్వహించే 43మంది అనుమానితులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్టు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు. ఎలాంటి చట్ట విరుద్ధ పనులకు పాల్పడవద్దని సూచించారు.

మైనార్టీల హక్కుల కోసం ఐక్య పోరాటం

రిటైర్డ్ ప్రొఫెసర్ మహమ్మద్ అన్సారీ



నవతెలంగాణ - శంకరపట్నం : మైనార్టీల హక్కుల కోసం తెలంగాణ ముస్లిం డిక్లరేషన్ ఐక్య పోరాటాలకు పార్టీల అతీతంగా పోరాడాలని రిటైర్డ్ ప్రొఫెసర్, మైనారిటీ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అన్సారి అన్నారు. గురువారం మండలంలోని వంకాయగూడెం గ్రామ శివారులో ఓ ఫంక్షన్ హాల్‌లో చలో శంకరపట్నం తెలంగాణ రాష్ట్ర ముస్లిం డిక్లరేషన్ సంకల్ప సభ శంకరపట్నం మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు, అంబాలాపూర్ గ్రామ మాజీ సర్పంచ్, కరీంపేట్ మాజీ ఎంపీటీసీ మొహినోద్దీన్ రహీం అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుమాట్లాడుతూ ఉర్దూ భవన్, షాదీ ఖానా శంకుస్థాపన చేసి నేటి వరకు ఒక ఇటుక కూడా పెట్టింది లేదని అన్నారు. శంకరపట్నంలో 8నెలల కిందట, మొలంగూర్‌లో నెల కిందట శంకుస్థాపన చేసిన పనులను ఎలక్షన్లకు ముందు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని విమర్శించారు. ముస్లింలకు ఎలాంటి సంక్షేమ పథకం నేటికీ అమలులోకి రాలేదు, రాజకీయంగా గుర్తింపు ఇవ్వడం లేదని, నామమాత్రంగా ఒక ఎమ్మెల్సీ ఇచ్చి హెూమ్ మినిస్టర్‌గా మహమూద్ అలీని నియమించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఇమామిల్ జామిల్ కట్టేందుకే మహమూద్ అలీ ఉన్నాడని ఎద్దేవా చేశారు. 22 డిమాండ్లను నెరవేర్చాలని తెలంగాణ రాష్ట్ర ముస్లిం డెకరేషన్ సంకల్పం తలపెట్టిందని అన్నారు. ఈనెల 25 నుండి నవంబర్ 30న జరిగే ఎన్నికల కోసం డిక్లరేషన్ ఆధ్వర్యంలో చేయాల్సిన పోరాటాలను ఉద్యమించాల్సిన కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ముస్లిం డిక్లరేషన్ కన్వీనర్ సలీం పాషా, కరీంనగర్ జేఏసీ అధ్యక్షుడు సయ్యద్ అజ్గర్ హుస్సేన్, నాయకులు సయ్యద్ ఆరిఫ్, మహమ్మద్ ఇసాముద్దీన్, మహమ్మద్ జాంగిర్, షారుక్, అయాన్, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ షెల్టర్ హోమ్ తనిఖీ

నవతెలంగాణ - కరీంనగర్ : స్థానిక ఓపెన్ షెల్టర్ హోమ్, మనోవికాస్ మానసిక వికలాంగుల పాఠశాలను జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, బాలల పరిరక్షణ అధికారి శాంత, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కో-ఆర్డినేటర్ సంపత్‌తో కలిసి గురువారం సందర్శించి, పరిశీలించారు. వసతులు అన్ని సక్రమంగా ఉన్నాయా లేదా అని ఆరా తీసారు. వసతులు అన్ని సక్రమంగా ఉండాలని హోమ్, పాఠశాల నిర్వాహకులను అదేశించారు. అనంతరం లయన్స్ క్లబ్ సహకారంతో 30 స్కూల్ బ్యాగులను మానసిక వికలాంగుల పాఠశాల పిల్లలకు అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, మానసిక వికలాంగుల పాఠశాల అసోసియేషన్ సభ్యులు రామారావు, పరమేశ్వర్, ఔట్రీచ్ వర్కర్ రమేష్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, హెూమ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మాటల్లో కాదు చేతల్లో అభివృద్ధి చూపిస్తాం

ఏఐఎఫ్‌బీ కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థి అంబటి జోజిరెడ్డి



నవతెలంగాణ - భగత్‌నగర్ : మాటల్లో కాదు చేతల్లో అభివృద్ధి చూపిస్తామని ఏఐఎఫ్‌బీ కరీంనగర్ అసెంబ్లీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అభ్యర్థి అంబటి జోజిరెడ్డి అన్నారు. గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజవర్గ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా జోజిరెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ నియోజకవర్గంలో ఉన్న ప్రతి సమస్య తమకు తెలుసని.. 40ఏండ్లుగా ప్రజా జీవితంలో ఉంటున్నానని తనను గెలిపిస్తే ప్రజలు కోరుకున్న అభివృద్ధిని చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ప్రతి 200 కుటుంబాలకు ఒక కుటుంబ దావకాన ఏర్పాటు చేస్తానని, ప్రతి ఐదు వందల కుటుంబాలకు ఒక వాలంటీర్లను నియమించి ప్రతి నిరుపేద కుటుంబానికి కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందిస్తామని చెప్పారు. సమావేశంలో చొప్పదండి నియోజకవర్గ కన్వీనర్ పెద్దెల్లి శేఖర్, చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ముత్యాల విజయ్ కుమార్, టియుసిసి జిల్లా అధ్యక్షుడు కురువెల్లి శంకర్, పులిమాటి సంతోష్ కుమార్, బెక్కెంటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కిలో డ్రై గంజాయి పట్టివేత

నవతెలంగాణ - చొప్పదండి : వాహనాల తనిఖీలో కిలో డ్రై గంజాయి పట్టుకున్నట్టు చొప్పదండి ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని చాకుంట ఎక్స్‌రోడ్ వద్ద గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా అందులో దాదాపు ఒక కిలో డ్రై గంజాయి ఉంది. వారిద్దరిని విచారించగా మండలంలోని కొలిమికుంట గ్రామానికి చెందిన మాచర్ల అఖిల్, వడ్లూరి వికాస్ కరీంనగర్ మండలం ఫకీర్‌పేట గ్రామానికి చెందిన కడప వంశీ అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసి, చిన్నచిన్న ప్యాకెట్లను అమ్మి డబ్బులు సంపాదిస్తున్నట్లుగా చెప్పారు. వారిని అదుపులోకి తీసుకొని చొప్పదండి డిప్యూటీ తహసీల్దార్ సమక్షంలో పంచనామ నిర్వహించి కోర్టులో హాజరు పరిచేందుకు ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఫకీర్‌పేటకు చెందిన కడప వంశీ అనే వ్యక్తిని పోలీసులు వెతుకుతున్నట్టు తెలిపారు.

మద్యం బాటిల్‌లో గాజు ముక్కలు



నవతెలంగాణ - భగత్‌నగర్ : మద్యం బాటిల్‌లో గాజు ముక్కలు బయటపడిన ఘటన గురువారం కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామంలో చోటుచేసుకుంది. ముగ్ధంపూర్ వాసులైన వంగ కొమురయ్య, పిల్లి ఓదెలు, బండి కొమురయ్య కలిసి ఒక వైన్స్ షాప్‌లో ఎంసీ డైట్ మద్యం ఫుల్ బాటిల్‌ను కొనుగోలు చేసారు . అయితే మద్యం సేవిస్తుండగా అందులో గాజు ముక్కలు కన్పించడంతో భయభ్రాంతులకు గురైన బాధితులు ఇదేమిటని వైన్స్ యజమానిని ప్రశ్నించగా బాటిల్‌లోని మద్యం తమ వద్ద తయారు చేయబడలేదని, వారికి దానితో ఎటువంటి సంబంధం లేదని చెప్పారని అన్నారు.

ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ఎన్నికల నిబంధనలు పాటించాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బి.గోపి

నవతెలంగాణ - కరీంనగర్

తెలంగాణ శాసనసభకు జరుగనున్న ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, 127 'ఎ' సెక్షన్ ప్రకారం ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు లోబడి పని చేయాలని కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బి.గోపి సూచించారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించి పలు రాజకీయ పార్టీల వారు, పోటీ చేస్తున్న అభ్యర్థులు గానీ, వారి తరపువారు గానీ ఎన్నికలకు సంబంధించిన గోడ పత్రికలు (పోస్టర్లు), కరపత్రాల ముద్రణ విషయంలో విధిగా వాటిపై కనిపించే రీతిలో ప్రచురణకర్త (పబ్లిషర్) పేరు, ముద్రణ ప్రెస్ (ప్రింటర్) పేరు విధిగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రింటింగ్, పబ్లిషర్ పేరు లేకుండా ముద్రించిన, కరపత్రముల సంఖ్య తెలపకుండా ఎలాంటి పోస్టర్లు, కరపత్రాలు, ఇతర ప్రచార సామాగ్రిని ఎలాంటి పరిస్థితులలో ముద్రించరాదని తెలిపారు. పోస్టర్లు, కరపత్రాలు, ఇతర ప్రచార సామాగ్రి ముద్రించుటకు ముందుగా ఇద్దరు వ్యక్తులు తనకు పబ్లిషర్ తెలిసినట్లుగా ధృవీకరిస్తూ ఇచ్చిన డిక్లరేషన్ కాపీ రెండు పత్రాలను పబ్లిషర్ నుంచి పొందిన పిదప మాత్రమే సదరు ప్రింటర్ ముద్రణకు చర్యలు చేపట్టాలని అన్నారు. ముద్రితమైన ప్రచార సామాగ్రి ప్రతి వెంట పబ్లిషర్ ఇచ్చిన డిక్లరేషన్ కాపీని జతచేసి జిల్లా ఎన్నికల అధికారికి, రిటర్నింగ్ అధికారులకు సమర్పించవలెనని ఆయన అన్నారు. ముద్రించిన కరపత్రాలు, పోస్టర్లు, ఇతర ప్రచార సామాగ్రిని నిర్దేశించిన సంఖ్యకు మించి జిరాక్సులు తీయడం, పలు పత్రాలుగా సంఖ్య పెంచి పంపిణీకి వినియోగించినచో, ఎన్నికల నియమావళి ఉల్లంఘించినట్లుగా భావించి ఆరు నెలలు జైలు శిక్ష, రెండు వేలు జరిమానా లేదా రెండు శిక్షలు కూడా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, వారు ప్రింటింగ్ ప్రెస్ యజమానులకు అవగాహన కలిగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

సైకియాట్రిక్ సొసైటీ ఎన్నిక



కొత్తగా ఎన్నికైన సభ్యులు

నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్ సైకియాట్రిక్ సొసైటీ 2023-25 సంవత్సరాలకు కొత్త కమిటీని కరీంనగర్‌లోని ఐఎంఏ హాల్‌లో ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, ఇన్‌స్టాలేషన్ అధికారిగా ఐపీఎస్ టీఎస్‌బీ అధ్యక్షుడు డాక్టర్ మిన్‌హాజ్‌జాఫర్ నాసిరాబడి హాజరయ్యారు. ఈ సందర్భంగా కొత్త ప్రెసిడెంట్ డాక్టర్ కెకె లక్ష్మణ్ రాబోయే రోజుల్లో కళంకాన్ని తగ్గించడానికి, అవగాహనను మెరుగుపరచడానికి మానసిక ఆరోగ్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు, కొత్త కరీంనగర్ సైకియాట్రిక్ సొసైటీ స్థాపన సందర్భంగా డాక్టర్ మిన్‌హాజ్‌జాఫర్ నాసిరాబాడి అధ్యక్షుడు ఐపీఎస్‌టీఎస్బీ కరీంనగర్ సైకియాట్రిక్ సొసైటీ నూతన సంస్థను స్థాపించి అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ సైకియాట్రిస్టులు, ఐపీఎస్‌టీఎస్‌బీ గత అధ్యక్షుడు డాక్టర్ యర్రా శ్రీధర్ రాజు, డాక్టర్ వి.జార్జ్ రెడ్డి, ఐఎంఏ సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలు




సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో

నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్‌లోని జ్యోతి నగర్‌లో గల సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్.శ్రీనివాస్‌రావు, అకాడమిక్ డైరెక్టర్ సీహెచ్.నీలిమ ముందుస్తు బతుకమ్మ సంబరాలను గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రైమరీ విద్యార్థినులు దుర్గమాత తొమ్మిది అవతారాల వేషధారణలో ప్రత్యేక ఆకర్షణీయంగా ఉన్నారు. విద్యార్థులు వివిధ రకాల పూలతో ఆకర్షణీయంగా బతుకమ్మను తయారు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మానేరు స్కూల్‌లో..



నగరంలోని మానేరు స్కూల్‌లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణాన్ని మామిడి తోరణాలతో అందంగా ముస్తాబు చేశారు. పాఠశాల విద్యార్థినీలు సంప్రదాయ దుస్తులతో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు అందరు కలిసి రంగు రంగుల పూలను సేకరించి అందంగా బతుకమ్మలను పేర్చారు. అనంతరం బతుకమ్మలను ఒక చోటు పెట్టి కోలాటాలు ఆడుతూ సందడి చేశారు. వేడుకలను మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతా రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. మానేరు విద్యాసంస్థల చైర్మెన్ కడారి అనంత రెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అచీవర్స్‌లో బతుకమ్మ వేడుకలు

అచీవర్స్ పాఠశాలలో..

కోతిరాంపూర్‌లోని అచీవర్స్ ఆక్టివ్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్.పల్లవి, విద్యార్థినులు, ఉపాధ్యాయినిలు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలను మధ్యలో ఉంచి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలతో, దాండీయా, కోలాటాలతో ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. పాఠశాల డైరెక్టర్ సీహెచ్.వెంకటేశ్వర్లు,ఉపాధ్యాయినిలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాన్సన్ గ్లోబల్, కోరా పాఠశాలలో..



స్థానిక జాన్సన్ గ్లోబల్, కోరాలో బతుకమ్మ సంబరాలను విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయ బృందంతో పాటు తల్లిదండ్రులు కూడా అత్యంత వైభవంగా జరుపుకున్నారు. పాఠశాల డైరెక్టర్లు మహిపాల్, వరప్రసాద్, హరికృష్ణ, రామ్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్విన్‌ట్రీ పాఠశాలలో..



స్థానిక అర్విన్‌ట్రీ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమాన్ని పాఠశాలల చైర్మెన్ బి.రమణరావు, డైరెక్టర్ బి.విజయలక్ష్మి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. వివిధ వేషధారణలతో ఎంతో ఆకట్టుకున్నారు. పాఠశాలల కో ఆర్డినేటర్స్ రాం మోహన్ రావు, సరోజ, దీపిక పాల్గొన్నారు.

వివేకానంద పాఠశాలలో..



స్థానిక జగిత్యాల రోడ్డులో గల వివేకానంద రెసిడెన్షియల్ (సీబీఎస్ఈ) పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు అంటరాన్నంటాయి. ముఖ్యఅతిథిగా పాఠశాల డైరెక్టర్ (అకాడమిక్స్) డాక్టర్ టి.లలితా కుమారి విచ్చేయగా, వేడుకలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల చైర్మెన్ సుధాకర్ రావు, సెక్రటరీ రమాదేవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్‌లో..



స్థానిక చింతకుంటలోని ఎస్ఆర్ఆర్ టెక్నో హై స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాజు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బ్లూ బెల్స్ పాఠశాలలో..



కరీంనగర్ హనుమాన్ నగర్ బ్లూ బెల్స్ పాఠశాలలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జంగ సునీతమనోహర్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయునులు బతుకమ్మ ఆటపాటలతో నృత్యాలు చేశారు.

శ్రీచైతన్యలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు





నవతెలంగాణ - కరీంనగర్ : నగరంలో మంకమ్మతోటలోని శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మెన్ ముద్దసాని రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రకృతిని ఆరాధించే గొప్ప సంస్కృతి మనదని, పూలని పూజించే బతుకమ్మ పండుగను తమ కళాశాలకి చెందిన డిగ్రీ, పీజీ విద్యార్థినీలు అధిక సంఖ్యలో పాల్గొని ఆట పాటలతో అలరించడం ఆనందదాయకం అన్నారు. డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణారెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిపై శ్రద్ధ వహించాలి

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



కాకర్ల పల్లిలో అల్పాహార పథకాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-మంథని : పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థిపై శ్రద్ధ వహించి వారి విద్యా ప్రమాణాలు మెరుగుపరచడానికి కషి చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మంథని మండలంలోని కాకర్లపల్లి గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు ఉదయం అందుతున్న అల్పాహార నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, మంచి నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందిస్తున్నారని, ఇదే నాణ్యత కొనసాగించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, మండల విద్యాధికారి దాసరి లక్ష్మి, ఐసీడీఎస్ సీడీపీవో పద్మశ్రీ, సీఆర్పీలు స్వప్న, మల్లన్న, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యా యులు కే.లక్ష్మణ్, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ కనవేన పద్మ-కొమురయ్య పాల్గొన్నారు.

లక్ష రూపాయల నగదు సీజ్



సీజ్ చేసిన నగదును చూపిస్తున్న ఎస్ఐ

నవతెలంగాణ-సుల్తానాబాద్ రూరల్ : సుల్తానాబాద్ చెక్‌పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న లక్ష రూపాయలను పట్టుకున్నట్లు సుల్తానాబాద్ ఎస్సై విజేందర్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని బొల్లారంకు చెందిన కసిరెడ్డి ఉదయ్‌కిరణ్ రెడ్డి తన కారులో కరీంనగర్ నుంచి పెద్దపల్లి వైపు వెళ్తుండగా దుబ్బపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అక్రమంగా నిల్వ ఉంచిన లక్ష రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విజేందర్ తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఆధారాలు లేకుండా డబ్బులు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి అనిల్ తెలిపారు.

ఎలక్షన్ కోసం సిద్ధమవుతున్న పోలింగ్ స్టేషన్

నవతెలంగాణ-కథలాపూర్ : మండలంలోని అన్ని పోలీస్ స్టేషన్లో వాల్ పెయింటింగ్ నిర్వహిస్తున్నారు. ఆ గ్రామాలలోని బూత్ నంబర్లు పెయింటింగ్ గోడలపై రాస్తున్నారు. మండలంలోని 41 బూత్‌లు సిద్ధమైనట్లు ఎమ్మార్వో ముజాబుద్దీన్ తెలిపారు. ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించినట్లయితే తీవ్ర పరిణామాలు ఉంటాయని తెలిపారు. వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

రంగాపూర్‌లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-మేడిపల్లి : భీమారం మండలం రంగాపూర్ గ్రామంలో గురువారం వేములవాడ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలపై గడపగడపకు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నీరెడ్డి మల్లేశం, ఉరుమడ్ల లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షుడు పుప్పాల కొమురయ్య, తోకల నర్సయ్య, ప్రధాన కార్యదర్శి జంగంపల్లి విజయ్, బీసీ సెల్ అధ్యక్షుడు ముంజ కిషన్‌గౌడ్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ సయ్యద్, గ్రామ శాఖ అధ్యక్షుడు నిజాముద్దీన్, ప్రమోద్‌రావు, పెద్దరాజం యువకులు లక్ష్మణ్, మధు, మహేష్, రవి, గంగారెడ్డి, ఉస్మాన్ సోషల్ మీడియా అధ్యక్షుడు అరుణ్ పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ-సుల్తానాబాద్ రూరల్ : మండలంలోని గర్రెపల్లి మోడల్ స్కూల్ లో ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రఘునాథ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే భూ స్వాములు పూజించే ఏకైక పండుగ బతుకమ్మ పండుగ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు కె.జ్యోతి, పర్వీన్ అప్సర్, రజిత, అనురాధ, సుధా, హరిప్రియ, సంధ్య, జ్యోతికుమారి, వెంకటలక్ష్మిలు పాల్గొన్నారు.

నవతెలంగాణ- పెగడపల్లి: మండల కేంద్రంలోని శ్రీ వైష్ణవి పాఠశాల విద్యార్థులు గురువారం ముందస్తుగా బతకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మలు పేర్చి కోలాటాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజన్న, గణేష్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నవీన్, సత్యనారాయణ, స్వామి, మనోజ్, ప్రసాద్, రాజ్ కుమార్, లింగయ్య పాల్గొన్నారు.

నవతెలంగాణ-మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలను ముందస్తు బతుకమ్మ వేడుకలను విద్యార్థినిలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునావత్ రాజు, ఉపాధ్యాయులు షాబాజ్ హుస్సేన్, శ్రుతి, సునీత, గణేష్, లహరి, విజయ లక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మంథని: మంథనిలోని కాకతీయ పాఠశాలలో గురువారం ముందస్తుగా బతకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో అతిపెద్ద పండుగ బతుకమ్మ పండుగ అని, మన సంస్కృతి సాంప్రదాయాలను బతుకమ్మ పండుగ తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రవి కిరణ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, స్రవంతి, మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



సుల్తానాబాద్ రూరల్: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



మంథనిలో...



పెగడపెల్లి: కోలాటాలు ఆడుతున్న విద్యార్థినులు



ఇబ్రహీంపట్నంలో...



మల్లాపూర్‌లో...

విజ్జన్న గెలుపు కోసం ఇంటింటా ప్రచారం



ప్రచారం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ- సుల్తానాబాద్ : పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు గెలుపు కోసం ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేశారు. గురువారం సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల మున్సిపల్ పరిధిలో పలు వార్డులలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటా వెళ్లి కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాల గురించి వివరిస్తూ చేతి గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మినుపాల ప్రకాష్‌రావు, సాయిరి మహేందర్, అబ్బయ్య గౌడ్, కుమార్ కిషోర్, రాజయ్య, శ్రీనివాస్ రెడ్డి, రవి, తిరుపతి, మోబిన్ పాల్గొన్నారు

కుమ్మరికుంటలో ఎమ్మెల్యే సతీమణి ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి

నవతెలంగాణ-జూలపల్లి : మండలంలోని కుమ్మరికుంట గ్రామంలో ఇంటింటా ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సతీమణి దాసరి పుష్పలత ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం మాట్లాడుతూ గత పాలకులు నియోజకవర్గ అభివద్ధిని పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, వైస్ ఎంపీపీ మొగురం రమేష్, సర్పంచ్ మేచినేని సంతోష్ రావు, ఎంపీటీసీ తమ్మడవేణి మల్లేశం, ఉప సర్పంచ్ కొత్త మల్లేష్, రైతు బంధు అధ్యక్షుడు విసారపు వెంకటేశం, కుంట రాజేశ్వర్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు కొత్త శ్రీధర్ పాల్గొన్నారు.

యువతతోనే భవిష్యత్

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్

నవతెలంగాణ-మంథని : దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, ఆ దిశగా యువత అడుగులు ముందుకు వేయాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. మహాముత్తారం మండలానికి చెందిన సుమారు 30మంది యూత్ సభ్యులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంథని పట్టణంలోని రాజగహాలో యూత్ సభ్యులకు ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మహాముత్తారం యూత్ సభ్యులు పంగ సురేష్, పంగ దేవేందర్,కొయ్యాల మహేందర్,మంథెన లవకుమార్,మంథెన రాజబాపు,రామిల్ల వంశీ, ఆసంపెల్లి లచ్చయ్య, కొండ మల్లయ్య, మారపాక పోచయ్య, గంధం రాజబాపు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

అదనపు కలెక్టర్, డిప్యూటీ ఎన్నికల అధికారిణి బీఎస్ లత



నవతెలంగాణ-జగిత్యాల టౌన్ : పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి, ఓటర్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అదనపు కలెక్టర్, డిప్యూటీ ఎన్నికల అధికారిణి బీఎస్ లత అన్నారు. గురువారం ఐడీఓసీలోని తన చాంబర్ నుంచి ఆర్డీవోలు, పలు శాఖల ఇంజనీరింగ్ అధికారులు, తహసీల్దార్లతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవంబర్‌లో జరుగనున్న శాసన సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్లు, ర్యాంపులు, రేలింగ్స్, ఫర్నిచర్ వంటి సౌకర్యాలకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. కాన్ఫరెన్సులో ఆర్డీవోలు నరసింహమూర్తి, రాజేశ్వర్, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి: ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బాలాజీరావు

నవతెలంగాణ-సుల్తానాబాద్ రూరల్ : గ్రామాల అభివద్ధిలో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని ఎంపీపీ పొన్నమనేని బాలాజీ రావు అన్నారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వసభ్య సమావే శంలో ఎంపీటీసీలు సర్పంచులు పలు సమస్యలను సభ దష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివద్ధి పథం లో పయనించిందన్నారు. అనంతరం పలు సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులతో కలిసి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఎంపీటీసీలు, సర్పంచులు పలువురు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఆర్టీసీ బంపర్ ఆఫర్..

నవతెలంగాణ-మంథని : దసరా పండుగను పురస్కరించుకొని ఈనెల 21 నుంచి 23, 28, 30, తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు రూ.11 లక్షల విలువైన బహుమతులు గెలుచుకోవచ్చని మంథని డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 040-69440000, 7382846352 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అప్రెంటిషిప్ సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్స్ అందజేస్తున్న ఎస్ఓటు జీఎంలు

నవతెలంగాణ-రామగిరి : సింగరేణి సంస్థ కార్పొరేట్ హెచ్ఆర్డీ విభాగం ఆధ్వర్యంలో ఐటిఐలో ఎలక్ట్రికల్, ఫిట్టర్, వెల్డర్, డీజిల్ మెకానికల్ మొదలగు కోర్సులలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు అప్రెంటిషిప్ సర్టిఫికెట్ ఏపీఏ, ఎస్ఓ-టూ జీఎం బైద్య ముఖ్య అతిథిగా పాల్గొని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ ద్వారా ఇచ్చే వివిధ రకాల ఉచిత శిక్షణలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జె మల్లన్న, డివైఎస్ఈ అనంతుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సెంటినరీకాలనీలో ఏఐటీయూసీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

నవ తెలంగాణ-రామగిరి : సింగరేణి ఆర్జీ-3 ఏరియాలోని సెంటినరీ కాలనీ కేఎల్ మహేంద్ర భవన్‌లో ఏఐటీయూసీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సెంట్రల్ సెక్రెటరీ జూపాక రామచందర్, బ్రాంచ్ సెక్రెటరీ ఎంఆర్‌సి రెడ్డి మాట్లాడారు. గుర్తింపు సంఘం కార్మికులకు ఒరగబెట్టింది ఏమీ లేదని వాళ్ల పదవీకాలం అయిపోయిన కూడా సింగరేణి యాజమాన్యం ఎలక్షన్లు పెట్టకుండా కార్మికులపై పెరుగుతున్న పని భారాన్ని దష్టిలో పెట్టుకుని ఏఐటీయూసీ ఎలక్షన్లు కావాలని హైకోర్టుకు పోవడం జరిగిందన్నారు. ఎల్లవేళలా కార్మికుల పక్షాన కార్మికుల సమస్యలపై నిత్యం పోరాడుతున్న ఏఐటీయూసీని గెలిపిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ డిటి రావు, జాయింట్ సెక్రెటరీ రవికుమార్, వైస్ ప్రెసిడెంట్ కె సమ్మయ్య, ఓసి-టు ఫిట్ సెక్రెటరి మర్రి రాజు, నాయకులు తోట మొండయ్య, అడ్డూరి రాజయ్య, రాజయ్య పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణా

పట్టించుకోని అధికారులు



ఎక్స్‌కావేటర్‌తో మట్టి తీస్తున్న అక్రమార్కులు

నవతెలంగాణ - సుల్తానాబాద్ రూరల్ : సుల్తానాబాద్ మండలంలోని గట్టేపల్లి శివారులో ప్రభుత్వ భూమిలో కొందరు వ్యక్తులు మట్టిని అక్రమ రవాణా చేస్తున్నారు. పలుమార్లు ఈ ప్రాంతం నుంచి మట్టి తరలించడంతో రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించి జేసీబీ, ట్రాక్టర్లను తహసీల్దార కార్యాలయానికి తరలించారు. జరిమానాలు కూడా విధించారు. అయినా కూడా అక్రమ రవాణా ఆగడం లేదు. ప్రభుత్వ కార్యాలయానికి సెలవు రావడంతో ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతుంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ప్రజాప్రతినిధుల సహకారంతో మట్టిని తరలించి కోట్లాది రూపాయలను దండుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని మండల ప్రజలు కోరుతున్నారు.

గడపగడపకు కాంగ్రెస్ నాయకుల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మంథని : మండలంలోని గుమ్మనూరు గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలపై పై ప్రజలకు గ్రామ కాంగ్రెస్ నాయకులు వివరించారు. కాంగ్రెస్‌ను ఆదరించండి అంటూ పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ బ్లాక్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేల్పుల రాజు,యూత్ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



డాన్స్ చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఫ్రేషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సంజీవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థుల నత్యాలు పలువురిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ కరీంనగర్ జిల్లా ఇంటర్ విద్యాధికారి రాంచంద్రం, హెడ్ మాస్టర్ రాజన్న, రిటైర్డ్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్

నవతెలంగాణ-రామగిరి : రామగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం నామమాత్రంగానే కొనసాగింది. సమావేశానికి వివిధశాఖల అధికారులు గైర్హాజరు అయ్యారు. జడ్పీటీసీ మేదరవేణి శారద-కుమార్ యాదవ్ మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం సమావేశానికి రాకపోవడం చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఇనుముల రమేష్, తహసీల్దార్ బోర్కార్ రామచందర్‌రావు, ఎంపీవో కాటం భాస్కర్, మండల వ్యవసాయ అధికారి భూక్య మోహన్, ఎన్పీడీసీఎల్ సబ్ ఇంజనీర్ కుమ్మరి కుంట సతీష్, ఏపీఎం గొట్టే స్వరూప రాణి, ఎంపీటీసలు కొప్పుల గణపతి, చిందం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూతో యువకుడి మృతి



సాయిచరణ్ (ఫైల్)

నవతెలంగాణ-మంథని : మంథని పట్టణానికి చెందిన రావికంటి సాయి చరణ్ (24) బుధవారం డెంగ్యూతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో మతి చెందాడు. జ్వరంతో బాధపడుతున్న సాయిచరణ్‌కు స్థానికంగా వైద్యం అందించిన ఫలితం లేకపోవడంతో నాలుగు రోజుల క్రితం హైదరాబాదులోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు.

విద్యార్థులకు చికెన్ బిర్యాని



బిర్యానీ పెడుతున్న చిన్నయ్య

నవతెలంగాణ ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు డబ్బా గ్రామానికి చెందిన లింగంపల్లి చిన్నయ్య వారి తల్లిదండ్రులు జ్ఞాపకార్థం విద్యార్థులకు గురువారం చికెన్ బిర్యాని భోజనాన్ని అందజేశారు. ప్రతి సంవత్సరం వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విద్యార్థులకు చికెన్ బిర్యాని భోజనాన్ని వడ్డించడంతో ఎంతో సంతోషాన్ని ఇస్తుందని చిన్నయ్య తెలిపారు. విద్యార్థులకు భోజనాన్ని అందించడం పట్ల పలువురు ఆయనను అభినందించారు

అభివృద్ధి చేసే నాయకుడిని ఆదరించండి



కొదురుపాకలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ బాలాజీ రావు

నవతెలంగాణ -సుల్తానాబాద్ రూరల్ : అభివృద్ధి చేసే నాయకున్ని ఆదరించాలని సుల్తానాబాద్ ఎంపీపీ బాలాజీ రావు అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని కొదురుపాక గ్రామంలోస్థానిక సర్పంచ్ సాగర్‌రావుతో కలిసి ఇంటిం టా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేందర్, గ్రామ శాఖ అధ్యక్షుడు సురేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తోడేటి బాలాజీ గౌడ్, స్వామి, శ్రీహరి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలి

డీసీపీవో రాఫ్‌ఖాన్



షీల్డ్ అందజేస్తున్న కోఆర్డినేటర్ అరుణ

నవతెలంగాణ-సుల్తానాబాద్ రూరల్ : విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా మహిళా సాధికారిత సంక్షేమ అధికారి రాఫ్ ఖాన్ అన్నారు. గురువారం మండలంలోని భూపతిపూర్ కస్తూర్బాగాంధీ పాఠశాల, జూనియర్ కళాశాల ఆవరణలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం మహిళ సాధికారిక కోఆర్డినేటర్ అరుణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి గర్ల్స్ చైల్డ్ డెవలప్మెంట్ అధికారి కవిత మాట్లాడుతూ నేటి సమాజంలో బాలికలు చదువుతోపాటు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌బీసీ సుగుణ, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ ఉమ, సఖి కోఆర్డినేటర్ స్వప్న, ప్రిన్సిపాల్ స్వప్న, మహిళ సాధికారిక కోఆర్డినేటర్ అరుణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి

నవతెలంగాణ-పెగడపల్లి: మండల పరిధిలోని దోమలకుంట గ్రామానికి చెందిన యాదవ సంఘం అధ్యక్షుడు తోట్ల శంకర్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు బాలె దుర్గయ్య, ఒడ్డెర సంఘం అధ్యక్షుడు మ్యాగేని ఎల్లయ్యలు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంత్రి ఈశ్వర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేని సంక్షేమ పథకాలు అందించిన బీఆర్ఎస్ పార్టీని తెలంగాణలో మళ్లీ అధికారంలోకి వస్తుందని అన్నారు.

షుగర్ ఫ్యాక్టరీని పునర్ ప్రారంభిస్తాం

బీజేపీ కోరుట్ల నియోజకవర్గ నాయకుడు సురభి నవీన్‌కుమార్



మాట్లాడుతున్న నవీన్

నవతెలంగాణ-మల్లాపూర్: బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ముత్యంపేట చక్కెర కర్మాగారాన్ని పునర్ ప్రారంభిస్తామని బీజేపీ కోరుట్ల నియోజకవర్గ నాయకుడు సురభి నవీన్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని ముత్యంపేట గ్రామంలో ముత్యంపేట గ్రామంలో పల్లె పల్లెకు బీజేపీ, గడప గడపకు నవీన్ అన్న కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ ని గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, నియోజకవర్గ నాయకులు అనిల్, మండల ప్రధాన కార్యదర్శి గున్నాల శ్రీనివాస్, మహిళ మోర్చా మండల అధ్యక్షురాలు కావ్య, కుర్మ లక్ష్మీ, బీజేవైఎం అధ్యక్షుడు పందిరి నాగరాజ్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి అంజిరాజ్ దండుగుల, కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కేబుల్ టీవీ ఆపరేటర్ల కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-ఎండపల్లి : ఎండపల్లి మండల కేబుల్ టీవీ ఆపరేటర్స్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం ఏర్పాటు చేసినట్లు అసోసియేషన్ కమిటీ నూతన అధ్యక్షుడు తుమ్మ రవీందర్ తెలిపారు. అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు తుమ్మ రవీందర్, ఉపాధ్యక్షుడు ఇప్పల మల్లేశం, క్యాషియర్ సొల్లు రాజేష్, ప్రధాన కార్యదర్శి బాలసాని మల్లేశం, ప్రచార కార్యదర్శి పిల్లలమర్రి నాగరాజులను ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



జగిత్యాలటౌన్: పరామర్శిస్తున్న మ్మెల్యే సంజయ్‌కుమార్

నవ తెలంగాణ-జగిత్యాల టౌన్ : జగిత్యాల పట్టణ 11వ వార్డుకు చెందిన అఫ్జల్ భార్య మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామర్శించారు. ఆయన వెంట కౌన్సిలర్ బాలే లత-శంకర్, పట్టణ ఉపాధ్యక్షుడు తాజొద్దిన్, మజీద్ సదర్ రహీమ్, అమీర్, జాకీర్, మంజూర్ ఉన్నారు.



మల్లాపూర్ : పరామర్శిస్తున్న డాక్టర్ సంజయ్

నవతెలంగాణ-మల్లాపూర్: మండలంలోని కొత్తధామరాజు పల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యం పాలైన వ్యక్తులను బీఆర్ఎస్ కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గురువారం పరామర్శించారు. ఈయన వెంట ఎంపీపీ కాటేపల్లి సరోజన ఆదిరెడ్డి, సర్పంచ్ బద్దం సరిత కమలాకర్, రైతుబంధు సమితి జిల్లా సభ్యులు ఉన్నారు.

నవతెలంగాణ-కథలాపూర్ : రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తల్లి వేముల మంజులమ్మ మరణించడంతో వారి కుటుంబానికి మాజీ మార్కెట్ చైర్మన్ లోక బాపురెడ్డి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరి వెంట జడ్పీటీసీ నాగం భూమన్న, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వర్ధినేని నాగేశ్వరరావు, ఎంపీపీ జవ్వాజి రేవతి గణేష్ ఉన్నారు.



కథలాపూర్: పరామర్శిస్తున్న నాయకులు

మండల కేంద్రంలో దళితుల ఆందోళన



ఆందోళన చేస్తున్న దళితులు

నవతెలంగాణ -ఎండపల్లి : మండల కేంద్రంలో ఎండపల్లికి సంబంధించిన దళిత బంధు ఆశావహులు గురువారం గ్రామపంచాయతీ వద్ద ఆందోళన చేపట్టారు. గతంలో ప్రకటించిన గహలక్ష్మి తాజాగా ప్రకటించిన దళిత బంధు పథకాలలో లబ్ధిదారుల ఎంపిక విషయంలో అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. భూములు, ఇండ్లు, ఆస్తులు కలిగి ఉన్నవాళ్లకే దళిత బంధు గహలక్ష్మి స్థానిక గ్రామ బీఆర్ఎస్ నాయకులు చెప్పిన వాళ్లకే మంజూరు చేశారని పేర్కొన్నారు. సర్పంచ్‌కు బాధితులు ఫోన్ చేయగా స్పందించకపోవడంతో గ్రామ పంచాయతీ వద్ద బేటాయించారు. దళిత వాడకు ఓటు అడగడం కోసం రావద్దని ఎండపల్లి దళిత ప్రజలు బీఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు.

బీఆర్ఎస్ నాయకుల ఇంటింటా ప్రచారం



సుద్దాలలో వృద్ధురాలితో మాట్లాడుతున్న అనంతరెడ్డి

నవతెలంగాణ-సుల్తానాబాద్ రూరల్ : మండలంలోని పలు గ్రామాలలో బీఆర్ఎస్ నాయకులు గురువారం ఇంటింటా ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో పెద్దపల్లి ఎమ్మెల్యేగా దాసరి మనోహర్‌రెడ్డిని తిరిగి గెలిపించాలని ప్రజలను కోరారు. సుద్దాల గ్రామంలో కాసర్ల అనంతరెడ్డి, గర్రెపల్లి గ్రామంలో సర్పంచ్ వీరగోని సుజాత రమేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ పడాల అజయ్ గౌడ్, నారాయణపూర్ గ్రామంలో యువత మండల అధ్యక్షుడు గుడుగుల సతీష్, రేగడి మద్దికుంట గ్రామంలో గరిగంటి కుమార్‌బాబు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. చిన్న కల్వల చిన్న బొంకూర్, తొగర్రాయి, మంచరామి అన్ని గ్రామాలలో ప్రచారం నిర్వహించారు.

7

నవతెలంగాణ

రాజన్న సిరిసిల్ల - కరీంనగర్

శుక్రవారం | అక్టోబర్ 13, 2023 | www.navatelangana.com

వాహన తనిఖీ లో నగదు పట్టివేత

నవతెలంగాణ - గంభీరావుపేట

వాహన తనిఖీలో లక్ష రూపాయల నగదును స్వాధీన పరుచుకున్న ఘటన గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గురువారం కామారెడ్డి నుండి కరీంనగర్ కు వెళ్తున్న ఓ కారు (కే ఏ 27ఎమ్ 9264)ను పెద్దమ్మ స్టేజి చెక్ పోస్ట్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది. ఆ కారులో ఉన్న సయ్యద్ ఖలీముద్దీన్ వద్ద నుండి సుమారు లక్ష నగదు పట్టుకున్నారు. నగదుకు సంబంధించిన ఎటువంటి ఆధారిత పత్రాలు చూపించకపోవడంతో స్వాధీన పరుచుకుని జిల్లా ట్రెజరీ కార్యాలయానికి అప్పగించినట్లు అధికారులు తెలిపారు



పట్టుకున్న నగదును చూపెడుతున్న పోలీసులు

జిల్లా ఉద్యమకారుడికి వైఎస్ఆర్‌టీపీ సిరిసిల్ల టికెట్

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్



చొక్కాల రాము

రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పడటానికి ప్రధానంగా ఉద్యమం చేసిన చొక్కాల రాముకు వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ సిరిసిల్ల అసెంబ్లీ టికెట్‌ను అధినేత్రి షర్మిల గురువారం ప్రకటించారు. సిరిసిల్లను జిల్లాగా ప్రకటించాలని ఉద్యమం చేయడంతో ఆయనపై పోలీసులు కేసులు నమోదు చేసి జైలు పంపించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి చొక్కాల రాము పార్టీలోనే ఉన్నారు. అలాగే వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఏర్పడిన సమయంలో రాము పార్టీలో కొనసాగాడు.

కార్మికులకు 10శాతం యారన్ సబ్సిడీ వెంటనే ఇవ్వాలి

పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్

నేత కార్మికులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన 10శాతం యారన్ సబ్సిడీని రెండు రోజుల్లో అందించాలని పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ 2021 సంవత్సరం బతుకమ్మ చీరలకు సంబంధించి పవర్లూమ్ కార్మికులకు రావాల్సిన 10శాతం యారన్ సబ్సిడీని అందించడంలో అధికారులు తీవ్రంగా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. 2020 సంవత్సరం బతుకమ్మ చీరల సబ్సిడీ డబ్బులు కార్మికులకు అందించి దాదాపు 4 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు 2021 సంవత్సరం ఏ ఒక్క కార్మికునికి సబ్సిడీ అందించలేదన్నారు. 2021 సంవత్సరం బతుకమ్మ చీరలకు సంబంధించి కార్మికుల ఉత్పత్తి వివరాలను ఇప్పటికే యజమానుల నుండి అధికారులు తీసుకుని సర్వే కూడా పూర్తి చేసి హైదరాబాద్ చేనేత జౌళి శాఖ అధికారులకు పంపించారన్నారు. అయినా కూడా కార్మికుల ఖాతాలలో సబ్సిడీ డబ్బులు ఇప్పటికీ ఎందుకు జమ చేయడం లేదని ప్రశ్నించారు. సబ్సిడీ డబ్బులు కార్మికులకు కాలయాపన చేయకుండా అందించాలని అక్టోబర్ 5న సిఐటియు పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేనేత జౌళి శాఖ ఆఫీస్ ముందు ధర్నా కార్యక్రమం చేపట్టిన సందర్భంగా రెండు మూడు రోజుల లోపే కార్మికులకు సబ్సిడీ డబ్బులు అందిస్తామని చెప్పారని అన్నారు. కానీ ఇప్పటివరకు సబ్సిడీ డబ్బులు కార్మికుల ఖాతాలో జమ కాలేదన్నారు. ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలు ప్రకటించడంతో కార్మికులు సబ్సిడీ డబ్బులు వస్తాయో రావో అని ఆందోళన చెందుతున్నారన్నారు. మరో వారం పది రోజుల్లో బతుకమ్మ , దసరా పండుగలు ఉన్నందున కార్మికులకు సబ్సిడీ డబ్బులు వస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుందని.. లేకుంటే పండుగల పూట కార్మికులు వారి కుటుంబాలు పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడుతుందని అలాంటి పరిస్థితి రాకుండా కార్మికుల ఇబ్బందులను గుర్తించి ఇప్పటికైనా చేనేత జౌళి శాఖ అధికారులు కాలయాపన చేయకుండా వెంటనే రెండు రోజుల వరకు సబ్సిడీ డబ్బులను కార్మికుల ఖాతాలలో జమ చేయాలన్నారు. లేకుంటే అక్టోబర్ 16 న హైదరాబాద్ చేనేత జౌళి శాఖ కమిషనర్‌ను సబ్సిడీ డబ్బులు గురించి కార్మికుల తో కలిసి వెళ్లి కలుస్తామన్నారు. సమావేశంలో యూనియన్ పట్టణ అధ్యక్షుడు నక్క దేవదాస్, కార్యదర్శి గుండు రమేష్, సబ్బని చంద్రకాంత్, బెజుగం సురేష్, మోర తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ

సిరిసిల్లలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశాలు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చక్రపాణి

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్

పట్టణంలోని 6, 23, 36, 33 వ వార్డులలో బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశాలని నిర్వహించి ఈ నెల 17న సిరిసిల్ల పట్టణంలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి కోరారు. సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా నిర్వహిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను, సిరిసిల్ల నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందిన సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరిస్తూ క్షేత్రస్థాయిలో ప్రజల్లో చైతన్యం కలిగించి భారీ సంఖ్యలో ప్రజలు ఈ నెల 17న నిర్వహించే బి ఆర్ ఎస్ పార్టీ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొనేలా ప్రజలకు సహాయ సహకారాలు అందించి సభను విజయవంతం చేసేలా కృషిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమాలలో టీఎస్‌పిటిడిసి చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, కౌన్సిలర్ గుండ్లపల్లి రామానుజం, భూక్య రెడ్డి నాయక్, అన్నారం శ్రీనివాస్, కల్లూరి రాజు, రాపల్లి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న పలు పార్టీల నేతలు

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని 34వ వార్డులో గురువారం పలువురు పార్టీల నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. అధికార పార్టీ చేస్తున్న అవినీతి అక్రమాలను ప్రజలు జీర్ణించుకోలేకనే రాబోయే ఎన్నికల్లో ఓడించే ప్రయత్నంలో ప్రజలు ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు కాముని వనిత, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం



నవతెలంగాణ - వీర్నపల్లి : వీర్నపల్లి మండలం భూక్య తండ గ్రామంలో సర్పంచ్ గుగులోతు భారతి శ్రీరామ్‌నాయక్, పాలకవర్గం ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుగూలోతు తులసిరామ్, డైరెక్టర్ గుగులోతు రమేష్ నాయక్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తిరుపతి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రవి, నాయకులు రఘుపతి, పీర్యా, మదన్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

'యువత సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం'



నవతెలంగాణ - కొనరావుపేట : యువత సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని మండల యువజన సంఘం అధ్యక్షుడు ముష్టం జీవన్ గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని బావుసాయిపెట గ్రామంలో యువత ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేగా చెలిమెడ లక్ష్మీనరసింహరావును అధిక మెజార్టీతో గెలిపించుకొని గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని అన్నారు. కార్యక్రమంలో గంగసాని రమణరెడ్డి, కోరెపు చంద్రకాంత్, మద్దూరి శ్రీపాల్‌రెడ్డి, బీఆర్ఎస్‌వీ మండల అధ్యక్షుడు శివతేజరావు, నాయకులు బోల్లు రాకేష్‌యాదవ్, తిక్కల బాబు, షాదుల్ల, చక్రాల వేణు, గణేష్, దేవరాజు, మల్లేశం, వినయ్, జింక వెంకటేష్, కర్ణకర్, నీరజ్ పాల్గొన్నారు.

పార్లమెంట్ సమావేశాలకు అల్ఫోర్స్ విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ - కరీంనగర్ : స్థానిక అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన బీకాం (సీఏ) డిగ్రీ ద్వితీయ సంవత్సర విద్యార్థిని కనక్ ముందడా ఢిల్లీ పార్లమెంట్ శీతాకాల సమావేశాలను వీక్షించేందుకు ఆహ్వానాన్ని అందుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి అభినందన సమావేశంలో తెలిపారు. 'మంత్రవాహిని' స్వచ్ఛంద సంస్థ ఉస్మానియా యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన 'సిటిజెన్ యూత్ పార్లమెంట్' గత వారం 8, 9, 10వ తేదీలలో మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్స్ ఇన్‌స్టిట్యూట్, జూబ్లీహిల్స్‌లో ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయకుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 18-40 సంవత్సరాల లోపు తెలంగాణ యువతను ఆన్‌లైన్ ఇంటర్వ్యూల ద్వారా నిర్వహించగా 185 మంది యువతీ యువకులు ఈ కార్యక్రమంలో పాలు పంచుకున్నారు. ఈ నెల 10న గవర్నర్ తమిళసై ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మూడు రోజులలో జరిగిన కార్యక్రమ విజేతలను ప్రకటించగా అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన విద్యార్థిని కనక్ ముందడా గెలుపొందగా, మొత్తం 20 మంది విజేతలను ఫిబ్రవరిలో జరిగే పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సమావేశంలో కళాశాల కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ గోళి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ బి.విజయలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ మండల కమిటీ ఏర్పాటు



నవతెలంగాణ - హుజురాబాద్ : హుజురాబాద్ మండల స్థాయి సమావేశంలో నూతన కమిటీని గురువారం జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్ అధ్యక్షతన నియమించారు. జిల్లా అధ్యక్షులు రామారపు వెంకటేష్ హాజరై మాట్లాడారు. హుజురా బాద్ నియోజకవర్గంలో గురుకుల పాఠశాలలు, హాస్టళ్లకు భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా దోమ్మటి వేణుగోపాల్, కార్యదర్శిగా జూపాక శివమణి, ఉపాధ్యక్షుడిగా గూండ వరుణ్‌తేజ్, సహాయ కార్యదర్శిగా రాంపెల్లి రోహిత్, కోశాధికారి ముదిగంటి నాగేందర్, సభ్యులుగా అదిముల భాస్కర్, మామిడి మదుమేహన్‌రెడ్డి, శ్రీపతి శ్రీచరణ్, జావజి విజయ్, దేవరకొండ శ్రీకాంత్, దుబ్బసి వరుణ్, అబినేయ్, బాలు, తదితరులు ఉన్నారు.

నేను పక్కా లోకల్.. రుద్రంగి మండల అభివృద్ధికి కృషి

బీఆర్ఎస్ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

నవతెలంగాణ - వేములవాడ

తాను పక్కా లోకల్ అని.. ప్రతిపక్ష నాయకులవి అనవసరమైన ఆరోపణలు.. కొనరావుపేట మండలం మల్కపేట బిడ్డననిబీఆర్ఎస్ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు స్పష్టం చేశారు. రుద్రంగి మండలాన్ని అన్ని రంగాల్లో అభివద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. వేములవాడ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహా రావు నివాసంలో గురువారం రుద్రంగి మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకే ముందుకు వస్తున్నానని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పని చేసి కారు గుర్తు గెలుపుకోసం కృషి చేయాలని, సీఎం కేసీఆర్ ను మూడోసారి ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. గెలిచిన వెంటనే రుద్రంగి మండలంలో ఉన్న అన్ని రకాల సమస్యలను పరిష్కరిస్తానని, రుద్రంగిని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతానని హామీ ఇచ్చారు. అనంతరం జెడ్పీటీసీ మీనయ్య, ఎంపీపీ స్వరూప మాట్లాడుతూ అభివృద్దే ధ్యేయంగా ముందుకు వస్తున్న చల్మెడను భారీ మెజారిటీతో గెలిపించేందుకు అందరం కలిసికట్టుగా పనిచేస్తామని అన్నారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, సెస్ డైరెక్టర్ గంగారాంతో పాటు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రుద్రంగి నాయకులతో చల్మెడ

గడప గడపకు బొట్టు పెడుతూ..

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్



ఈ నెల 17వ తేదీ సిరిసిల్ల పట్టణంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొనే బిఆర్ఎస్ పార్టీ బారి బహిరంగ సభను విజయవంతం చేయాలని 34వ వార్డ్ కౌన్సిలర్ దార్ల కీర్తన గురువారం కోరారు. స్థానిక వార్డులో ఆమె ఇంటింటికి వెళ్లి గడపగడపకు ఆహ్వానం పలుకుతూ ఆడపడుచులకు పసుపు కుంకుమలు పెడుతూ బీఆర్ఎస్ పార్టీ భారీ బహిరంగ సభకు తన వంతు ఆహ్వానంగా పిలిచారు.

'సీఎం సభకు పెద్ద ఎత్తున తరలి రావాలి'



నవతెలంగాణ - వీర్నపల్లి

ఈ నెల 17న సిరిసిల్లలో నిర్వహించే ముఖ్యమంత్రి సభకు మండల ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని మండల ప్రజాప్రతినిధులు కోరారు. వీర్నపల్లి మండల కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ సాగర్, జడ్పీ కోఆప్షన్ చాంద్ పాషా, బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట ఎంపీపీ కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ - ఇల్లంతకుంట

ఇల్లంతకుంట ఎంపీపీ వెంకట రమణారెడ్డి గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన కొన్ని గంటల్లోనే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు కవ్వంపెల్లి సత్యనారాయణ సమక్షంలో ఆయనతో పాటు పలువురు మండల నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎంపీపీ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించి ప్రజలకు సేవలు అందించానని అన్నారు. అభివృద్ధిలో భాగంగా నిధుల కేటాయింపు, సహకారం అందించడంలో స్థానిక ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కొంత కాలంగా తనపై పక్షపాత ధోరణి వహిస్తున్నారని ఆరోపించారు. పార్టీలో ఒక్కరిద్దరికీ ప్రాధాన్యతనిస్తూ కనీసం ఎంపీపీ అనే హోదా లేకుండా చిన్న చూపు చూసినందుకు మనస్తాపానికి గురై పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశానని ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, కేశవరెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకన్న, నవీన్‌రెడ్డి, కొమురయ్య ఉన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

4 కిలోల గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్



నవతెలంగాణ - ఇల్లంతకుంట

ఎండు గంజాయిని సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్టు ఇల్లంతకుంట ఎస్సై డి.సుధాకర్ తెలిపారు. గురువారం సాయంత్రం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇల్లంతకుంట మండల కేంద్రంలో గంజాయి అక్రమంగా సరఫరా చేస్తున్నారన్న సమాచారం మేరకు అనంతారం రోడ్డులో కేడీసీసీ బ్యాంకు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అనంతారం నుండి ఇల్లంతకుంట వైపు ఇద్దరు వ్యక్తులు బైక్‌పై అనుమానస్పదంగా వస్తుండగా వారిని ఆపి పట్టుకోగా నాలుగు కిలోల ఎండు గంజాయి దొరికినట్టు తెలిపారు. అనంతరం తహసీల్దార్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించగా నేరస్తులు తమ నేరాన్ని ఒప్పుకుంటూ ఇల్లంతకుంట గ్రామానికి చెందిన దమ్మని నవీన్ అనే వ్యక్తి హైదరాబాద్‌లోని రోహన్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేస్తూ ఇల్లంతకుంటలోని తిప్పాపురంలో గల తన పాత ఇంటిలో గంజాయిని నిల్వ ఉంచి తన సోదరుడు అరవింద్ ద్వారా విక్రయించే వాడని తెలిపారు . గంజాయి సరఫరా విషయమై గతంలో కరీంనగర్ ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్లో అరవింద్ మరియు నవీన్ పైన కేసు నమోదు కాగా అట్టి కేసులో నవీన్ పరారీలో ఉన్నాడు. మండలంలో ఎవరైనా గంజాయి అమ్మినా, సరఫరా చేసినా, త్రాగినా పోలీస్ వారికి డైరెక్ట్ గా లేదా డయల్ 100 ద్వారా సమాచారం అందించాలని సూచించార. ఇల్లంతకుంట హెడ్ కానిస్టేబుల్ ఫసియొద్దీన్, దేవేందర్ రెడ్డి, భూమయ్య, కానిస్టేబుల్ లు తిరుపతి, మధు, అనిల్, లక్ష్మినారాయణ, బాపు చందర్‌ను ఎస్సై అభినందించారు.

పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు



చందుర్తి : నర్సింగాపూర్ పాఠశాలలో

నవతెలంగాణ - చందుర్తి

మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం విద్యార్థులు ముందస్తు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు తీరొక్క పూలు తీసుకువచ్చి బతుక్కమ్మ పేర్చి అలంకరించారు. కోలాటం ఆడుతూ ఆట పాటలతో సంబరాలు జరుపుకున్నారు.

కేరళ పాఠశాలలో..

నవతెలంగాణ - రుద్రంగి

రుద్రంగి మండలకేంద్రంలోని కేరళ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల పువ్వులతో బతుకమ్మను పేర్చి పసుపుతో గౌరమ్మను చేసి బతుకమ్మ పాటలతో ఆడిపాడారు. ఈ సందర్భంగా కేరళ స్కూల్ చైర్మన్ బాబు నంబియర్ కరస్పాండెంట్ లతికా మాట్లాడుతూ.. పండుగ విశిష్టతను వివరించారు.



రుద్రంగి : పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు

నవతెలంగాణ - వీర్నపల్లి

వీర్నపల్లి మండల కేంద్రం అంబేద్కర్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మను తయారు చేసి ఆటపాటలతో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు టి.వకుళ, ఎస్ఎంసి చైర్మన్ జోసెఫ్, ఉపాధ్యాయులు, విధ్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వీర్నపల్లి : పాఠశాలలో వేడుకలు

కాంగ్రెస్ అధికారంలోకి ఖాయం

టీపీసీసీ అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం



నవతెలంగాణ - గంగాధర : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం దీమా వ్యక్తం చేశారు. గంగాధర మండలం నారాయణ పూర్, చర్లపల్లి (ఎన్) గ్రామాల్లో గురువారం గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం ద్వారా సత్యం ఓట్లు అభ్యర్థించారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా చొప్పదండి ఎమ్మెల్యే రవి శంకర్ నిలిచాడని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేయడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, దుబ్బాసి బుచ్చయ్య, రామిడి రాజిరెడ్డి, బుర్గగు గంగన్న, చిప్ప చక్రపాణి, బత్తిని సత్యనారాయణ, ముత్యం శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మోడీ నాయకత్వంపై నమ్మకంతోనే బీజేపీలో చేరా

మానకొండూరు మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్



నవతెలంగాణ - కరీంనగర్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీనాయకత్వంలో అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ చెప్పారు. మోడీ నాయకత్వంపై నమ్మకంతో పాటు బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు చెప్పారు. ఈ విషయంలో తనకు సహకరించిన బండి సంజయ్ కుమార్, ఈటల రాజేందర్, కిషన్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు చెబుతున్నట్లు చెప్పారు.

వాహనాల తనిఖీ



నవతెలంగాణ - కరీంనగర్ క్రైం : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్ మున్సిపల్ ఆఫీస్, బస్టాండ్ రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహించారు. గాదె రమేష్ ఆధీనంలో భారీ మొత్తం రూ.5లక్షలు, సంబంధిత వారికి సరైన రసీదు కింద మొత్తం స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో నగదు ఏ రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని, అందువల్ల కేసు నమోదు చేయలేదని తెలిపారు. తదుపరి చర్య కోసం ఈ పీఎస్‌లోని ఏఎస్ఐ-1944 ఎస్కార్ట్, ఎం.లక్ష్మయ్య అథారిటీ ముందు మొత్తం సమర్పించబడుతోందని తెలిపారు.

నోటి మాటకే పరిమితమైన బీఆర్ఎస్ పథకాలు

• కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్


యాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్

నవతెలంగాణ-గోదావరిఖని: బీఆర్ఎస్ పార్టీ ప్రకటించే పథకాలు కేవలం నోటి మాటకేనని, ఏ ఒక్క హామీ కూడా పేద కుటుంబానికి పూర్తిస్థాయిలో చేరలేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. రాజ్‌ఠాకూర్ చేపట్టిన ప్రజాదీవెన యాత్ర గురువారం ఏడో రోజుకు చేరుకుంది. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 48వ డివిజన్ అధ్యక్షుడు జక్కుల రాజేందర్, 49వ డివిజన్ కార్పొరేటర్ సనా ఫకురొద్దిన్, 40వ డివిజన్ అధ్యక్షుడు ధుళికట్ట సతీష్ ఆధ్వర్యంలో ఆయా డివిజన్లలో ప్రజా దీవెన యాత్రను కొనసాగించారు. రాజ్ ఠాకూర్‌కు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాదయాత్ర చేస్తూ ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ఎస్సీ, బీసీ, మహిళా విభాగం, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామగుండం గెలుపును కేటీఆర్‌కు బహుమతిగా అందిద్దాం

• ఎమ్మెల్యే కోరుకంటి చందర్

నవతెలంగాణ-గోదావరిఖని: రామగుండంలో బీఆర్ఎస్ గెలుపును మంత్రి కేటీఆర్‌కి బహుమతిగా ఇచ్చి, సిరిసిల్ల, సిద్దిపేట తరహాలో రామగుండాన్ని మార్చుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం రాత్రి రామగుండం కార్పోరేషన్ పరిధిలోని 42వ డివిజన్ లో బస్తీనిద్ర చేపట్టారు. గురువారం ఉదయం 42 డివిజన్‌లో ప్రజ అంకిత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు, ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ప్రజా అంకిత యాత్రకు బహ్మరథం పట్టారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సీఎం కేసీఆర్ పథకాలు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర మంత్రివర్యులు కేటీఆర్ నాయకత్వంలో రామగుండం నియోజకవర్గం ప్రగతిలో పరుగులుతీస్తుందని అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో స్వరాష్ట్రం పదేళ్లలో వందేళ్ల అభివృద్ధి సాధించిందన్నారు. కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు మూల విజయ రెడ్డి, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, కార్పోరేటర్ బాల రాజ్ కుమార్, నాయకులు ఆడెపు శంకర్, పిల్లి రమేష్, మెతుకు దేవరాజ్, రాంచందర్, మండల సత్యనారాయణ, మహేందర్, అడిచర్ల నంబయ్య, పిట్ట లక్ష్మినారాయణ, పుట్ట రాజేష్, చిన్నా రావు, మహిళా నాయకురాల్లు కవిత, మీనాక్షి, పద్మ, శ్రీకళ ఉన్నారు.


పాదయాత్ర నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గురువారం స్థానిక విటల్ నగర్ 13వ డివిజన్‌కు చెందిన విఠల్ నగర్ క్లబ్ ఆటో యూనియన్ మాజీ ప్రెసిడెంట్ దండే మహేందర్, ఆటో డ్రైవర్లు గరిగ రవి, ఇంజపురి రాజన్న, బొడ్డు మల్లయ్య, తాని తిరుపతిలు కార్పొరేటర్ రాకం లత దామోదర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. దండే మహేందర్‌ను 13 వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎమ్మెల్యే నిమమించారు. అలాగే 42 వ డివిజన్‌లో బెస్త కులస ఆత్మీయ సమ్మేళన వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. బెస్త కుల సంఘ నాయకులు రాసకట్ల సాంబ మూర్తి, జీదుల సురేష్, మల్లయ్య, అముగుల సదానందం, రామకష్ణ, కిరణ్, సారంగపాణి, అర్కుటి తిరుపతి, ఎల్లయ్య, జీదుల, శంకర్, రవీందర్ పాల్గొన్నారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

• కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

నవతెలంగాణ-రాయికల్: రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయికల్ పట్టణంలోని వీఎస్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయారన్నారు. బీసీ బంధు, మైనార్టీ బంధు, దళిత బంధు రావాలన్నా బీఆర్ఎస్‌లో చేరితేనే పథకాలు వర్తిస్తాయని నాయకుల తీరుపై మండిపడ్డారు. ప్రభుత్వ పరంగా అందరికీ ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కానప్పుడు స్వయం ఉపాధి పథకం కింద ఉపాధి కల్పించడం ప్రభుత్వ బాధ్యతే ఇది నిరంతరం కొనసాగాల్సిన ప్రక్రియని పేర్కొన్నారు. బిస్వాల్ కమిటీ నివేదిక ప్రకారం 1లక్ష 91వేల ఉద్యోగాలు ఖాళీలున్నాయని ఏడాదిలోగా 80వేల ఉద్యోగాలు భర్తీ చేపడుతామని శాసన సభ వేదికగా సీఎం కేసీఆర్ అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి స్థలం కబ్జా చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులకు సోయి ఉండొద్దా అని నిలదీశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్,జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొయ్యేడి మహిపాల్,నాయకులు ఎద్దండి దివాకర్, బత్తిని భూమయ్య, బాపురపు నర్సయ్య, మున్ను, రాకేశ్ నాయక్, సాకీర్, రవీందర్, చౌడారపు లక్ష్మీనారాయణ, బత్తిని నాగరాజు, ఇద్దం సుధీర్, మధు, మసూద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

రెస్క్యూ సిబ్బంది సేవలు విలువైనవి

• టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి


రెస్క్యూ సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న మిర్యాల రాజిరెడ్డి

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ: సింగరేణిలో రెస్క్యూ సిబ్బంది సేవలు ఎంతో విలువైనవని టీబీజీకెఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి అన్నారు. ఆర్జీ-2 ఏరియాలోని రెస్క్యూ క్యాంపస్ లో గురువారం రెస్క్యూ సిబ్బందితో ఆయన మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకుంటూ ప్రమాదాలు జరిగినప్పుడు అత్యంత సాహసోపేతంగా విధులు నిర్వర్తించి ఎంతో మందిని కాపాడారని వారికి సంబంధించిన అలవెన్సులను, అత్యంత ప్రతిభ కనబరిచిన మెంబర్స్‌కి ప్రయోజనం చేకూర్చే విధంగా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అయిలి శ్రీనివాస్, రెస్క్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

నవతెలంగాణ- సుల్తానాబాద్ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్సై విజేందర్ తనిఖీ చేశారు. మండలంలోని సుద్దాల, అల్లిపూర్, రెగడిమద్దికుంట, కనుకుల, మంచిర్యామి, తొగర్రాయి కేంద్రాలను తనిఖీ చేశారు.

ఈపీ ఆపరేటర్ల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ: ఓసీపీ-3 ఈపీ ఆపరేటర్ల సమస్యలపై యాజమాన్యం నిర్లక్ష్యం తగదని టీబీజీకేఎస్ ఆర్జీ-2 ఉపాధ్యక్షుడు అయిలి శ్రీనివాస్ అన్నారు. గురువారం కృషి భవనంను సందర్శించిన ఆయన కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెంపర్ క్యాబిన్లు క్లీనింగ్ కొరకై వాక్యూమ్ క్లీనర్స్ లేకపోవడం వల్ల క్యాబిన్ పరిశుభ్రంగా లేక కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఓసీపీ-3 ప్రాజెక్ట్ కార్యదర్శి కొంగర రవీందర్, కస్తూరి గణేష్, గజ్జి ఓదెలు, ఎలకపల్లి సదయ్య, కల్లూరి రాజయ్య, కూర తిరుపతి, రాజశేఖర్‌రెడ్డి, మహిపతి సతీష్, సదానందం, అరకల రవీందర్, ఆకుల రాజయ్య, శ్రీనివాసరెడ్డి, లక్ష్మన్, తిరుపతి పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న శ్రీనివాస్

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ -మెట్ పల్లి
మండలంలోని ఆత్మకూరు, అనుబంధ తండాకు చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఆత్మకూరు గ్రామానికి చెందిన యాదవ సంఘ సభ్యులు బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేసి అభ్యర్థి సంజయ్ కి అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజయ్య, నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.


పార్టీలో చేరిన మహిళలు

అప్రెంటిషిప్ సర్టిఫికేట్ల ప్రదానం


సర్టిఫికేట్లు ప్రదానం చేస్తున్న ఏజీఎం

నవతెలంగాణ-గోదావరిఖని: సింగరేణి ఆర్జీ 1 జీవిటీసిలో కౌశల్ దీక్షిత్ సమ్రోహ్ కింద అన్యువల్ కన్వకేషన్ సేరమని - 2023 ద్వారా ఐటిఐ ట్రేడ్ అప్రేంటిషిప్ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి ఏరియా ఎస్ఓటూజీఎం రాంమోహన్ ముఖ్య అతిథిగా హాజరు కాగా, ఆయన చేతుల మీదుగా ఈ సర్టిఫికేట్లను అందజేశారు. 32 మంది అంతర్గత అభ్యర్థులు, 37 మంది బహిర్గత అభ్యర్థులకు మెత్తం 69 మంది అభ్యర్థులకు అప్రేంటిషిప్ సర్టిఫికేట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జీవిటీసి మేనేజర్ దినేల్ కుమార్, డివైఎస్‌సి వేణుగోపాల్, డిజిఎం సత్యనారాయణ, అడిషనల్ మేనేజర్ సుజీత్ తదితరులున్నారు.

అక్రమంగా నిర్మించిన గోడ కూల్చివేత

నవతెలంగాణ-గోదావరిఖని: స్థల వివాదం కోర్టు విచారణలో ఉండగా అక్రమంగా నిర్మించిన గోడను గురువారం రామగుండం నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు కూల్చివేశారు. రామగుండం నగర పాలక సంస్థ 26వ డివిజన్ మార్కండేయ కాలనీ శివాలయం సమీపంలో ఖాళీ స్థలం వివాదం హై కోర్టు విచారణలో ఉండగానే, కొందరు వ్యక్తులు అక్రమంగా గోడ నిర్మిస్తున్నారని రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ దృష్టికి రావడంతో తగు చర్య నిమిత్తం ఆయన పట్టణ ప్రణాళికా విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ ఆదేశాలతో పట్టణ ప్రణాళికా విభాగం అధికారి తిరుపతమ్మ సిబ్బందితో కలిసి వెళ్లి అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు.

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాస్

నవతెలంగాణ-గోదావరిఖని:
కాంగ్రెస్ గోదావరిఖని పట్టణ అధ్యక్షుడిగా తిప్పారపు శ్రీనివాస్‌ను నియమించారు. గురువారం తిప్పారపు శ్రీనివాస్‌కు మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా నియామకపు ఉత్తర్వులను అందజేశారు. తనను నియమకానికి సహకరించిన ఎఐసిసి కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


ఉత్తర్వులు అందజేస్తున్న శ్రీధర్‌బాబు

కాంట్రాక్ట్ కార్మికులను బానిసలుగా చూస్తున్న ఆర్ఎఫ్‌సీఎల్

• ఆర్ఎఫ్‌సీఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నరేష్

నవతెలంగాణ-గోదావరిఖని: కాంట్రాక్ట్ కార్మికులను ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం బానిసలుగా చూస్తున్నదని ఆర్ఎఫ్‌సీఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నరేష్ అన్నారు. గురువారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండా యాజమాన్యం పనిచేయిస్తుందని విమర్శించారు. దీంతో పలుమార్లు ప్రమాదాలు జరిగిన కొంతమంది కార్మికులు గాయాలపాలయ్యారని వాపోయారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కార్మికుల జీతభత్యాలు పెంచడంతోపాటు రక్షణ పరికారాలను ఇచ్చి ఇవ్వాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో తాము కార్యాచరణ పొందిస్తున్నామని,ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని, అవసరమైతే సమ్మె నోటీసు ఇచ్చి సమ్మెలోకి దిగుతామని నరేష్ హెచ్చరించారు. సమావేశంలో కార్మికులు బండి అశోక్, రవి, ప్రకాష్, శ్రీకాంత్, బోయిన నాగరాజు, శ్రీనివాస్, గుండబోయిన శ్రీనివాస్, రాజేష్ పాల్గొన్నారు.

రామగుండం బీఆర్ఎస్ ప్రచార కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్: రామ గుండం బీఆర్ఎస్ ప్రచార కార్యదర్శిగా సోక్కుల ప్రవీణ్ కుమార్‌ను రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నియమించారు. ఈ మేరకు రామగుండం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ప్రచార కార్యదర్శిని సోక్కుల ప్రవీణ్ కుమార్‌ను నియమిస్తూ ఆయన గురువారం నియామకపు ఉత్తర్వులను అందజేశారు.


ఉత్తర్వులు అందజేస్తున్న ఎమ్మెల్యే

ముందస్తు బతుకమ్మ సంబరాలు


మేడిపల్లి: బతుకమ్మలతో విద్యార్థినులు


మెట్‌పల్లి: కోలాటం ఆడుతున్న ఎమ్మెల్యే సతీమణి

నవతెలంగాణ-మేడిపల్లి: మండలంలోని మాచాపూర్ గ్రామం నందు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆటలాడుతూ, పాటలు పాడుతూ మహిళలు ,ఉపాధ్యాయ బృందం బతుక మ్మ వేడుకల్లో పాల్గొన్నారు. సర్పంచ్ కుందూరి బాలరాజు వేడుకల్లో హాజరయ్యారు.

నవతెలంగాణ -మెట్‌పల్లి: మెట్‌పల్లి పట్టణంలోని బ్రూక్లిన్ పాఠశాలలో గురువారం ముందస్తు బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఈ సంబరాలకు కోరుట్ల ఎమ్మెల్యే సతీమణి సరోజన పాల్గొని విద్యార్థులను ఉత్సా హపరిచారు. బతుకమ్మ పాటలకు విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమం లో పాఠశాల కరస్పాండెంట్ ప్రిన్సిపల్ ప్రసాద్‌గౌడ్, ఉపాధ్యాయులు రాజశేఖర్,దినేష్, లతిక, లక్ష్మి, భవ్య, కార్తీక్,సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గోదావరిఖని: బతుకమ్మ, దసరా వేడుకల్లో భాగంగా సింగరేణి ఆర్జీ-1 బంగ్లస్ ఏరియాలో లేడీస్ క్లబ్ సభ్యులు సంబురాలను ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. ముఖ్య అతిథులుగా డైరెక్టర్ ఆపరేషన్స్ సతీమణి కల్యాణి శ్రీనివాస్, ఆర్జీ-1 సేవా అధ్యక్షురాలు చింతల లక్ష్మి శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం సంబురాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో జీఎంల సతీమనులు సవిత మనోహర్, విజయ వెంకటేశ్వర్లు, మాలతి సూర్యనారాయణ, జయ సాంబయ్య, పద్మ వెంకటేశ్వర్లు, ప్రియ కేవి రావు, ఎల్.జయని సుధాకర్, లేడీస్ క్లబ్ సభ్యులు చిలక లక్ష్మీ, కవిత, తారా, రమ, శ్రీవాణి, హేమ, కళ్యాణి తదితరులున్నారు. గోదావరిఖని కష్ణవేణి విద్యాసంస్థలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను గురువారం నిర్వహించారు. విద్యార్థినీలు, ఉపాధ్యాయినీలు ఉత్సాహంగా, ఆనందంతో, కోలాహలంగా బతుకమ్మ ఆట పాటలతో సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల డైరెక్టర్ మంజుల శ్రీనివాస్ రెడ్డి కార్యక్రమాన్ని తిలకించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థినీలకు, ఎన్టీపీసీ ఏరియాలోని విశ్వ భారతి, నవోదయ, సెయింట్ జోసెఫ్ పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలను గురువారం చేపట్టారు. కార్యక్రమాలలో ఆయా పాఠశాలల విద్యార్థులు దాదాపు 2000 మంది పాల్గొని విజయవంతం చేశారు. విశ్వ భారతి విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరి గౌడ్ సతీమణి సంధ్య, తిరుపతి గౌడ్, సుజాత నోయల్ జోసెఫ్ తెలిపారు.


గోదావరిఖని: బతుకమ్మ పేర్చుతున్న క్లబ్ సభ్యులు



గోదావరిఖని: బతుకమ్మలతో చిన్నారులు, విద్యార్థినులు

జర్నలిస్టులకు దళితబంధు ఇవ్వడంలో చిత్తశుద్ధి లేదు

• ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ ప్రెసిడెంట్ బందెల రాజశేఖర్

నవతెలంగాణ-పెద్దపల్లి: జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇప్పించడంలో, దళిత జర్నలిస్టులకు దళిత బంధు పథకం ఇవ్వడంలో పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డికి చిత్తశుద్ధి లేదని తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల రాజశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరెల్లి మల్లేష్ పేర్కొన్నారు. గురువారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం మల్లేష్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశం సందర్భంగా తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల రాజశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరేల్లి మల్లేష్ మాట్లాడుతూ అసోసియేషన్ రాష్ట్ర తొలి మహాసభ ఈనెల 30న హైదరాబాదు కేంద్రంలో జరుగుతున్నాయని జిల్లాలోని దళిత జర్నలిస్టులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి జర్నలిస్టులకు సంబంధించిన ఇంటి స్థలాలు ఇప్పించడంలో దళిత జర్నలిస్టులకు దళిత బంధు పథకం ఇవ్వడంలో పూర్తిగా వైఫల్యం చెందారని తెలిపారు. ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యే గెలవకుండా కృషి చేయాలని జర్నలిస్టులకు అందరికీ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కన్నం చంద్రమౌళి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం మల్లేష్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి ముఖేష్, జిల్లా నాయకులు కన్నూరి అంజి, బెజ్జాల ప్రభాకర్ ,బందెల శ్రీనివాస్, వంశీ, కూసనపెల్లి సాహు కుమార్, తాళ్లపల్లి రాజేందర్, ఇరువురాల రాజకుమార్ సంకే రాజ్, దళిత జర్నలిస్టులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్పొరేషన్ బీసీ సెల్ అధికార ప్రతినిధిగా మల్లేశం

నవతెలంగాణ-గోదావరిఖనిటౌన్:
బీఆర్ఎస్ కార్పొరేషన్ బీసీ సెల్ అధికార ప్రతినిధి వొల్లాల మల్లేశం నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రామ గుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నియామకపు ఉత్తర్వులను అందజేశారు. నియమాకానికి సహకరించిన మేయర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్ రావు, కార్పొరేటర్లు రమణా రెడ్డి, కుమ్మరి శ్రీనివాస్, కల్వచర్ల క్రిష్ణవేణి, పట్టణ అధ్యక్షులు చెప్యాల రామారావు, ప్రధాన కార్యదర్శి బుర్ర శంకర్, బిఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు కుమ్మరి శారదలకు కృతజ్ఞతలు తెలిపారు.


నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న ఎమ్మెల్యే చందర్

అంబేద్కర్ యూత్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామం ఎస్సీ కాలనీలో అంబేద్కర్ యూత్ కమిటీ మాజీ అధ్యక్షుడు తాండ్ర మధుకర్ మంథని సంతోష్, మాజీ ఉపాధ్యక్షుడు ఆధ్వర్యంలో నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బూడిద శేఖర్, ఉపాధ్యక్షుడిగా మంథని కుమార్, ప్రధాన కార్యదర్శిగా మంథని పెద్ద కుమార్, కార్యదర్శిగా కందికొండ సంతోష్, కోశాధికారిగా మంథని దిలీప్, సలహాదారులుగా మర్రి బానేష్, తాండ్ర మధుకర్, దాసారపు ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు. కార్యక్ర మంలో అంబేద్కర్ యూత్ సభ్యులు మంథని రాజు, నక్క సాగర్, బూడిద మహేష్, మంథని నాని, బూడిద అజయ్, మంథని వంశీ, మంథని గని కుమార్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.


శేఖర్, మంథని కుమార్

మాటల ప్రభుత్వం బీఆర్ఎస్.. చేతల ప్రభుత్వం కాంగ్రెస్

• ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

నవతెలంగాణ-ముత్తారం: మాటల ప్రభుత్వం బీఆర్ఎస్ అని, చేతల ప్రభుత్వం కాంగ్రెస్ అని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ముత్తారం మండల కేంద్రంలో ఏర్పాటు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మండలంలోని మచ్చుపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలపై నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో అనేక సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందేవని, కానీ బిఆర్ఎస్ పాలనలో కేవలం పార్టీ కార్యకర్తలు, నాయకులకే పథకాలు అన్న విధంగా పరిస్థితి ఉందని, దీంతో అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరగడం లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ అవినీతి ప్రభుత్వంపై ప్రజలు విసిగిపోయారని అన్నారు. పాలనలో విఫలం అయిన కెసిఆర్ ప్రభుత్వానికి ఈ సారి తగిన గుణ పాఠం చెప్పి, ప్రజల సంక్షేమం కోరే కాంగ్రెస్ గెలిపించాలని, మంథనిలో మరోసారి కాంగ్రెస్‌ను గెలిపించేందుకు చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, మండల యువజన అధ్యక్షుడు బియ్యాని శివ కుమార్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు వాజీద్‌పాషా, ఎంపీటీసీ దొడ్డ గీతారాణి, మచ్చుపేట మాజీ సర్పంచ్ గోవిందుల పద్మ ఆనంద్, సోషల్ మీడియా ఇన్‌చార్జి కోల విజయ్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ప్రభుత్వ ఒత్తిడి మేరకే సీఎల్సీ ఎన్నికలు వాయిదా

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ: ప్రభుత్వ ఒత్తిడి మేరకే సీఎల్సీ ఎన్నికలు వాయిదా వేసారని ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కే రాజారత్నం ఆరోపించారు. గురువారం 8వ కాలనీలోని ప్రెస్ క్లబ్ లో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎల్ ప్రకాష్ అధ్యక్షతన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కె.రాజా రత్నం మాట్లాడుతూ సిబ్బందిని ఎన్నికల విధులకు కేటాయించలేమని ప్రభుత్వం చెబితేనే ఎన్నికలు వాయిదా పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో జె రవీందర్,బి అన్నారావు, బుర్ర తిరుపతి,జి గోవర్ధన్,ఈ రాజయ్య,కె అశోక్,వి గట్టయ్య,కె సత్యనారాయణ పాల్గొన్నారు.

16 నుంచి సప్లమెంటరీ పరీక్షల నిర్వహణ

నవతెలంగాణ-పెద్దపల్లి: అక్టోబర్ 16 నుంచి ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఎస్సెస్సీ, ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలను అక్టోబర్ 16 నుంచి అక్టోబర్ 26 వరకు నిర్వహిస్తుందన్నారు. పరీక్షలు రాసే విద్యార్థులు సంబంధిత అధ్యయన కేంద్రానికి వెళ్లి హాల్ టికెట్ పొంది తప్పనిసరిగా పరీక్షలకు హాజరుకావాలన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

నవతెలంగాణ-ముత్తారం: ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ చౌరస్తా వద్ద ముత్తారం ఎస్ఐ మధుసూదన్ రావు ఆధ్వర్యంలో గురువారం విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి, అనుమానితుల నుంచి వివరాలను సేకరించారు. ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ఎన్నికల క్రమంలో అధిక మొత్తంలో డబ్బుల ప్రయాణం చేయవద్దని సూచించారు. ఒకవేళ ఎన్నికల నిబంధనలకు మించి డబ్బులను తీసుకెళ్లిన, రశీదు లేకున్నా సీజ్ చేస్తామని హెచ్చరించారు. అంతేగాకుండా మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ మధునయ్య, సిబ్బంది రాజు తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండలం మచ్చుపేట గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షులు నీలం పాపయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా, విషయం తెలుసుకుతున్న జడ్పిటిసి చెలుకల స్వర్ణలత అశోక్ కుమార్ మానకొండూర్‌లో వాళ్ల కూతురు ఇంటికి వెళ్లి ఆయనను గురువారం పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మచ్చుపేట సర్పంచ్ మేడగోని సతీష్ తదితరులున్నారు.


పరామర్శిస్తున్న జడ్పీటీసీ

కాంగ్రెస్ రామగుండం కార్పొరేషన్ జనరల్ సెక్రెటరీగా రవి


నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్: కాంగ్రెస్ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ సెక్రెటరీగా ఆడెపు రవి నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్ గురువారం నాడు నియామక పత్రాన్ని ఆడెపు రవికి అందజేశారు. తనకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్ ఠాగూర్ మక్కాన్ సింగ్, కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్, నాయకులు కాల్వ లింగస్వామి, మహంకాళి స్వామి, అనుమ సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీలో బతుకమ్మ సంబరాలు


బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయినులు, విద్యార్థినులు

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్: ఎన్టీపీసీ పీటీఎస్‌లోని డి టైప్ క్వార్టర్స్ అంగన్వాడి కేంద్రంలో గురువారం ముందస్తు బతుకమ్మ సంబరాలు జరిగాయి. ఇందులో భాగంగా అంగన్వాడి టీచర్ కె.సుజాత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలికలు బతుకమ్మలతో సంప్రదాయ బద్ధమైన పాటలతో ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో డి టైప్ క్వాటర్ అంగన్వాడి టీచర్ కె.సుజాత, ఆయ పుష్ప విద్యార్థినిలు పాల్గొన్నారు. అదేవిధంగా ఎన్టీపీసీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామగుండం మండల ఎంఈఓ పల్లెపాటి సంపత్ రావు పాల్గొని ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయరాజు, స్వర్ణలత, ఉపాధ్యాయినులు, నిర్వాహకులు అంజన్ కుమార్, శ్రీధర్, శ్రీనివాస్ ఉన్నారు.

నవతెలంగాణ
కరీంనగర్
9
శుక్రవారం | అక్టోబర్ 13, 2023 | www.navatelangana.com

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బి.గోపి

నవతెలంగాణ - చొప్పదండి : ఎన్నికల్ కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బి.గోపి అన్నారు. చొప్పదండి మండలంలోని ఆర్నకొండ చెక్ పోస్ట్‌ను గురువారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బారాయుడుతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బి. గోపి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్నకొండ చెక్‌పోస్ట్ వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. చెక్‌పోస్ట్ వద్ద ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని చెప్పారు. అదనంగా ఎక్సైజ్, ఫారెస్ట్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఎస్ఎస్‌టీమ్‌కు సూచించారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా కేంద్రానికి అందించాలన్నారు. వారివెంట తహసీల్దార్ జక్కని నరేందర్, చొప్పదండి సీఐ గోపతి రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ ఉపేంద్రచారి, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


ఆర్నకొండ చెక్‌పోస్ట్ ను పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

డిజిటల్ బ్యాంకింగ్‌పై ప్రజలకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ - ఇల్లందకుంట : ఇల్లందకుంట మండలంలోని మల్యాల గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు మర్రిపల్లెగూడెం శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ బ్యాంకింగ్ సేవలపై గురు వారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారి నర్సింహ మాట్లాడుతూ మహిళలు పొదుపులు, రుణాలు సకాలంలో చెల్లించాలని అన్నారు. పంట రుణాలు సంవత్సరంలోపు విధిగా రెన్యువల్ చేసుకోవాలని, ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన వంటి బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది రవి, సర్పంచ్ అంతం ఎల్లారెడ్డి, నల్ల లింగారెడ్డి, నన్నెబోయిన రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ అధికారులు

పారునంది జలపతికి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ నేషనల్ అవార్డు

నవతెలంగాణ - తిమ్మాపూర్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని అంబేద్కర్ వాదాన్ని, సిద్ధాంతాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తుదాన్ని గుర్తిస్తూ బహుజన సాహిత్య అకాడమీ న్యూఢిల్లీ వారు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు పారునంది జలపతికి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ నేషనల్ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ మేరకు బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ కమిటీ ఆఫ్ ఇండియా- 2023 సంవత్సరానికి గాను జలపతిని ఎంపిక చేస్తూ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ సమాచారం అందించారు. ఈ అవార్డును అక్టోబర్ 15న ఢిల్లీలో జరుగనున్న 4వ కాన్ఫరెన్స్‌లో ప్రదానం చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ అవార్డ్ వచ్చిన సందర్భంగా ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపన్న, జిల్లా అధ్యక్షుడు సాంబారి కొమురయ్య,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి మహేష్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు, రేణికుంట సర్పంచ్ బొయిని కొమురయ్య, రామకృష్ణ కాలనీ సర్పంచ్ మీసాల అంజయ్య, తదితరులు జలపతిని అభినందించారు.


జలపతి

సివిల్ ఆస్పత్రిని తనిఖీ చేసిన మాడల్ కోడ్ టీం

నవతెలంగాణ - గంగాధర : గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలోని ఆస్పత్రిని ఎన్నికల మోడల్ కోడ్ టీం అధికారులు తనిఖీ చేశారు. గ్రామంలోని గోడలకు రాసిన వివిధ పార్టీల వాల్ రైటింగ్‌ను చెరిపి వేయించారు. ఈ టీంలో ఎంపీడీఓ మల్హోత్ర, పంచాయతీ కార్యదర్శి శ్రీవాణి, కంప్యూటర్ ఆపరేటర్ గంగాధర రమేష్, కరోబార్ మనోహర్ పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న ఎన్నికల మోడల్ కోడ్ అధికారులు

అభివృద్ధి సంక్షేమమే ఎజెండాగా ప్రజల్లోకి బీఆర్ఎస్

- ఆరు కాదు ఆరవై గ్యారెంటీలు పెట్టినా కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరు
- పోటీ చేయడానికి బీజేపీకి అభ్యర్థులు కరువు
- జీవన్‌రెడ్డి గత ఎన్నికల్లోనే కనుమరుగయ్యారు
- కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు

నవతెలంగాణ - కరీంనగర్ : బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటి వరకు చేసిన ప్రజా సంక్షేమం, అభివృద్ధి ఎజెండగా మరోసారి ఆశీర్వదించాలని ప్రజల్లోకి వెళ్తున్నట్టు కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. గురువారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. బీజేపి ఏ జెండాతో ప్రజల్లోకి వెళ్తుందో చెప్పాలన్నారు. ప్రజలు నమ్మి బండి సంజయ్‌ని గెలిపిస్తే నాలుగున్నర సంవత్సరాల కాలంలో కరీంనగర్ ప్రజలకు ఎన్ని రోజులు అందుబాటులో ఉన్నారో తెలపాలన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి పట్టిని, ప్రజలకు అందుబాలో ఉండని నాయకుడు బండి సంజయ్ అని విమర్శించారు. తలనీలాలు ఇస్తే వాటిని వక్రీకరించి మాట్లాడడం సరికాదన్నారు. కండ్లముందు బీఆర్ఎస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమం కనిపిస్తుందన్నారు. గంగుల కమలాకర్ మంత్రిగా పనిచేస్తూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ కరీంనగర్‌ను కనివిని ఎరుగుని రీతిలో అభివృద్ధి చేశారని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి బీజేపీకి అభ్యర్థులు కరువయ్యారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆరుకాదు ఆరవై గ్యారెంటీలు పెట్టినా ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని కోరిన 70వేల ఓట్లుతో పరాజయం పాలైనప్పుడే ప్రజల్లో నుంచి కనుమరుగయ్యారన్నారు. ఉమ్మడి జిల్లాలో ఒక సీటు కూడా కాంగ్రెస్ రాదని అన్నారు. కాంగ్రెస్‌లో దమ్మున్న నాయకుల లేరని సొంత నియోజకవర్గాల్లో పోటీ చేయలేక ఇతర నియోజకవర్గాల్లో పోటీ చేయడానికి ఆలోచిస్తున్నరని విమర్శించారు. బీఆర్ఎస్‌ది ప్రజారంజక పాలన అన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు గందె మాధవిమహేశ్, వాల రమణరావు, బుచ్చిరెడ్డి, కంసాల శ్రీనివాస్, ఐలేందర్‌యాదవ్, తోటరాములు, నాయకులు ఎడ్ల అశోక్, కోల సంపత్, తుల బాలయ్య, అర్ష మల్లేషం, చంద్రమౌళి, ఉయ్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు

ప్రతి కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మెన్ జివి.రామకృష్ణారావు

నవతెలంగాణ- మానకొండూర్ : రానున్న అసెంబ్లీ ఎన్నికలలో ప్రతి కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలని బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మెన్ జివి.రామకృష్ణారావు అన్నారు. గురువారం మానకొండూర్ మండలం చెంజర్లలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తలతో సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు వివరించి అసెంబ్లీ ఎన్నికలలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కి ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించే దిశలో అందరిని కలుపుకుని పోయి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, గ్రామ ఇన్‌చార్జులు దేవా సతీష్‌రెడ్డి, నామాల శ్రీనివాస్, ఎంపీటీసీ గడ్డి రేణుకగణేశ్, నాయకులు పడాల శంకరయ్య, గౌస్, రెహ్మత్, మానకొండూర్ సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుర్రం కిరణ్ గౌడ్ ఉన్నారు.


మాట్లాడుతున్న జీవీ రామకృష్ణా రావు

బీఆర్ఎస్ నిర్లక్ష్యంతోనే పార్టీ మారుతున్నా..

మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్

నవతెలంగాణ - గన్నేరువరం : బీఆర్ఎస్‌లో చేరినప్పటి నుండి తనకు ఏమాత్రం గుర్తింపు ఇవ్వ కుండా తన సేవలను వినియో గించుకోకపోవడం మూలంగానే తాను పార్టీ మారుతున్నట్లు మానకొండూరు మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ అన్నారు. గురువారం రాజీవ్ రహదారి గుండ్లపల్లి స్టేజి వద్ద మానకొండూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల ఆయన శ్రేయోభిలాషులతో కలిసి బీజేపీలో చేరడానికి హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను నియోజకవర్గానికి సుపరిచితుడినని, గతంలో నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశానని అన్నారు. ప్రజలు చివరిసారిగా తనకు ఓటు వేసి గెలిపించి అసెంబ్లీకి పంపించాలని కోరారు. ఆయనవెంట నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అరేపల్లి మోహన్

సభా స్థలం పరిశీలన

నవతెలంగాణ - జమ్మికుంట : ఈ నెల 14న ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రానున్న నేపథ్యంలో పట్టణంలోని బొమ్మల గుడి శివాలయం ఆవరణంలో ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలోని ఆడపడుచులతో బతుకమ్మ సంబరాలలో కవిత పాల్గొని ఆడి పాడనున్నట్లు తెలిపారు. కాబట్టి పట్టణంలోని ఆడపడుచులందరూ పెద్ద సంఖ్యలో బతుకమ్మ సంబరాలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నకోటి, కౌన్సిలర్ మద్ది లావణ్య పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

బీసీ సంఘం జిల్లా ఇన్‌చార్జిగా పైడిపల్లి అయోధ్యగౌడ్

నవతెలంగాణ - జమ్మికుంట : తెలంగాణ బీసీ ప్రజాసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జిగా జమ్మికుంట ధర్మారం గ్రామానికి చెందిన పైడిపెల్లి అయోధ్యగౌడ్‌ను నియమిస్తూ ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నాయిని భరత్ గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అయోధ్య గౌడ్ మాట్లాడారు. బాధ్యతను అప్పజెప్పినందుకు అధ్యక్షునికి కృతజ్ఞతలు తెలిపారు.


నియామక పత్రాన్ని అందుకుంటున్న పైడిపల్లి అయోధ్య గౌడ్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం

యూత్ కాంగ్రెస్ చొప్పదండి పట్టణ అధ్యక్షుడు కనుమల్ల రాజశేఖర్

నవతెలంగాణ - చొప్పదండి : తెలంగాణ ప్రజలకు 6 గ్యారంటీ పథకాలను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ రానున్న ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని యూత్ కాంగ్రెస్ చొప్పదండి పట్టణ అధ్యక్షుడు కనుమల్ల రాజశేఖర్ దీమా వ్యక్తం చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ సోనియా గాంధీ ప్రకటించిన మహాలక్ష్మీ పథకం - ప్రతి మహిళకు ప్రతి నెల రూ.2500, రూ.500 గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా పథకం - ప్రతి ఏటా రూ.15000 రైతులు, కౌలు రైతులకు, వరి ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్, గృహజ్యోతి పథకం - ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇంటి పథకం- ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం, ఉద్యమకారులకు 250 చదరపు గజాలు, యువ వికాస్ పథకం - విద్యార్థులకు రూ.5లక్షల భరోసా కార్డు, చేయూత పెన్షన్ - రూ.4000పెన్షన్, రూ.10లక్షల ఆరోగ్యశ్రీ బీమా వంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి గడపగడపకు తీసుకొని వెళ్లి ప్రజలను చైతన్య పరుస్తున్నట్లుగా తెలిపారు. చొప్పదండి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తామని అన్నారు.


కనుమల్ల రాజశేఖర్

దసరా పండుగపూట జీపీ కార్మికులు పస్తులు ఉండాలా

- పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి
- జీపీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ కొప్పుల శంకర్

నవతెలంగాణ - జమ్మికుంట : ఒక్కో గ్రామపంచాయతీలో కార్మికులకు మూడు నుంచి ఐదు నెలల జీతాలు పెండింగ్ ఉన్నాయని, తెలంగాణలో అతిపెద్ద పండుగైన బతుకమ్మ, దసరా పండుగల పూట కార్మికులు పస్తులుండాల అని గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ కొప్పుల శంకర్ అన్నారు. గురువారం జమ్మికుంట మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. వావిలాల గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. చాలీచాలని జీతాలతో గ్రామపంచాయతీ కార్మికులు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని అన్నారు. ఐదు నెలల నుండి నుండి జీతాలు రాకపోతే వారి కుటుంబాలు ఎలా జీవనం సాగించేది అని ప్రశ్నించారు. బట్టలు, బూట్లు, గ్లౌజులు భద్రత పరికరాలు అందివ్వాలని డిమాండ్ చేశారు. వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయనవెంట కుమార్, నరేష్, కళ్యాణ్, తిరుపతి, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న కొప్పుల శంకర్

కాంగ్రెస్ గడప గడపకు ప్రచారం


నవతెలంగాణ - గన్నేరువరం : మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు గడపగడపకు ప్రచారాన్ని ముమ్మరం చేపట్టారు. కాంగ్రెస్ అధికారం వచ్చిన తర్వాత ఇవ్వబోయే ఆరు గ్యారంటీ పథకాలను ప్రచారం చేశారు. జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్, సాంబయ్యపల్లి సర్పంచ్ నరసింహారెడ్డి, మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, చింతల శ్రీధర్‌రెడ్డి, కొలుపుల, మాతంగి అనిల్, రవి, కూన కొమరయ్య, పర్షరామ్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహనా సదస్సు



నవతెలంగాణ - కరీంనగర్ : పెద్దపల్లి జిల్లా అంతర్గం మండలం ఎక్లాస్పూర్ గ్రామంలో ఇన్సెక్టిసైడ్స్ ఇండియా లిమిటెడ్ ట్రాక్టర్ బ్రాండ్ పురుగుమందుల కంపెనీ ఆధ్వర్యంలో శిన్వా వాడిన పత్తి పంటలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సేల్స్ ఎగ్జిక్యూటివ్ రాగం మల్లేష్ మాట్లాడుతూ శిన్వా మందు చేనుపై వాడినచో వాడితే పచ్చపురుగు, నారపురుగు, తెల్ల దోమ, పచ్చ దోమ, ఆకుముడు, పేనుబంక, రసం పీల్చు పురుగును సమర్థవంతంగా అరికడుతుందని తెలిపారు. ఈ మందు వాడకం వల్ల మొక్క ఎక్కువ పెరుగుతుందని, కొమ్మలు బాగా వచ్చి మంచి పూత పూస్తుందని వివరించారు. ఈ సదస్సులో బుత గడ్డ సంపత్, సాయికుమార్, అజయ్ మరియు ఎక్లాస్పూర్, ఇసంపేట రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పంజాల శ్రీనివాస్‌గౌడ్


శ్రీనివాస్ గౌడ్ ను సన్మానిస్తున్న మేడిపల్లి సత్యం

నవతెలంగాణ - రామడుగు : కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామడుగు మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు పంజాల శ్రీనివాస్‌గౌడ్ నియమితులయ్యారు. తన నియామకం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం, మండల అధ్యక్షుడు బొమ్మరవెని తిరుపతి ముదిరాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనవెంట వన్నారం ఎంపీటీసీ జవ్వాజి హరీష్, నాయకులు ఉన్నారు.

ముందస్తు బతుకమ్మ సంబరాలు





నవతెలంగాణ-కరీంనగర్ : విద్యానగర్‌లోని వోవెల్స్ స్కూల్ యాజమాన్యం ఘనంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించింది. విద్యార్థినులు, ఉపాధ్యాయునులు రంగు రంగు పూలతో బతుకమ్మను పేర్చారు. విద్యార్థినులు, ఉపాధ్యాయునులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకను ఘనంగా జరుపుకున్నారు. కరెస్పాండంట్ జె. తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ పండుగను శాతవాహన క్యాలెండర్ ప్రకారం పిత అమావాస్య నుండి తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటామని, ఇది సాధారణంగా గ్రిగోరియన్ క్యాలెండర్ యొక్క సెప్టెంబర్-అక్టోబర్ నెలలతో సమానంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మమత మరియు ఇతర ఉపాధ్యాయినిలు విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడి వారిలో ఆనందాన్ని నింపారు.

నవతెలంగాణ - కొత్తపల్లి : రేకుర్తిలోని పారడైజ్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మెన్ డాక్టర్ పి.ఫాతిమారెడ్డి బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాలలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు కలిసి తంగేడు, గునుగు, రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో బతుకమ్మ వేడుకలలో పాల్గొన్నారు. అకాడమిక్ సీఈవో ఉమాకాంత్, ప్రిన్సిపాల్ టీ.వసంత, వైస్ ప్రిన్సిపాల్ ఎ.మధు, ఏఓ కే.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నవతెలంగాణ - కరీంనగర్ రూరల్ : మండలంలో ఎలాబోతారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ విశిష్టతను పిల్లలకు ప్రధానోపాధ్యాయుడు జోగు విద్యాసాగర్ వివరించారు. ఉపాధ్యాయులు మాసం సీమ, పురం సరిత, జలజ, రమేష్, వైష్ణవి పాల్గొన్నారు.

నవతెలంగాణ - చొప్పదండి : మండలంలోని ఆర్నకొండ అక్షయ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గురువారం వైభవంగా ముందస్తు బతుకమ్మ పండుగ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల రంగురంగుల పూలతో బతుకమ్మ పేర్చి, పాఠశాల ఆవరణలో ఆటపాటలతో సందడిగా గడిపారు. అనంతరం బతుకమ్మను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తమ్మడి కనకరాజు, ప్రిన్సిపాల్ తమ్మడి శ్రీమతి పాల్గొన్నారు.

చొప్పదండి మండల కేంద్రంలోని వీణాదారి విద్యాని కేతన్ ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తుగా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మామిడి తోరణాల తో అందంగా ముస్తాబు చేసి, విద్యార్థినిలు సాంప్రదాయ దుస్తులతో హాజరై వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి గౌరీదేవిని పూజించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తిప్పర్తి శ్రీనివాస్, ఉపాధ్యాయులు శైలజ, సీమత బస్సు, సరిత, కవిత, దీపిక, సాహితి, అనూష, లావణ్య, సుప్రియ, సువర్ణ, సౌమ్య, తేజ, లక్ష్మీమాల, ఆంజనేయులు, మల్లేశం, చంద్రశేఖర్, మహేందర్, మధుసూదన్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని మొగిలిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాల్లో విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి విద్యార్థులు, ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ - సైదాపూర్ : మండలంలోని వెన్నంపల్లి జెడ్పీహెచ్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఆర్.ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - శంకరపట్నం : శంకరపట్నం మండల కేంద్రంలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో బతుకమ్మ పండుగ సంబరాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు పెద్ద పెద్ద బతుకమ్మ లు తయారు చేసుకొని ఊరేగింపుగా ఆటపాటలతో బ్యాండ్ మేలతో విద్యార్థులు కేశవపట్నం గ్రామంలో నుంచి అంబేద్కర్ చౌరస్తా వద్దకు చేరుకొని ప్రధాన రహదారి గుండా పాఠశాలకు చేరుకొని పాఠశాలలో బతుకమ్మలతో వేడుకల సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు రేణుక, అంజి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - హుజూరాబాద్ : పట్టణంలోని న్యూ కాకతీయ మోడల్ స్కూల్‌లో గురువారం ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు చక్కటి వేషధారణతో బతుకమ్మను పేర్చి పాఠశాల ఆవరణంలో బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బద్దుల రాజ్‌కుమార్, డైరెక్టర్లు ఎం.వెంగళరావు, తవుటం గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట పట్టణంలోని న్యూ జయభారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బతుకమ్మ సంబరాలను గురువారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ పాటలపై ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఆడిపాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జి.రఘుపతి రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు జి.జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యూ మిలీనియం ప్లే స్కూల్లో : బతుకమ్మ పండుగను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందించదగ్గ విషయమని వీణవంక ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి అన్నారు. పట్టణంలోని న్యూ మిలీనియం ప్లే స్కూల్లో నిర్వహించిన ముందస్త బతుకమ్మ వేడుకల్లో విద్యార్థినిలు, టీచర్లతో కలిసి పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ వరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కేరళ పాఠశాలలో.. : పట్టణంలోని కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కెఎస్ బిన్నీ, తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్ పాఠశాలలో.. : జమ్మికుంట పట్టణంలోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలను కరస్పాండెంట్ వై.సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వోక్స్‌పాప్ పాఠశాలలో : పట్టణంలోని వోక్స్ పాప్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ రమణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జడ్పీహెచ్ బాలికల పాఠశాలలో : స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులు బతుకమ్మ వేడుకలను ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. విద్యార్థులు ఇండ్లల్లో తయారు చేసుకోచ్చిన సత్తును (ప్రసాదాన్ని) అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి విద్యార్థులందరికి పంచారు. ప్రధానోపాధ్యాయుడు దామెర సుధాకర్, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, రమాకుమారి, రమాదేవి, రేణుక, ఇందిర పాల్గొన్నారు.



కరీంనగర్: వోవెల్స్ స్కూల్‌లో బతుకమ్మ చిన్నారులతో యాజమాన్యం


కొత్తపల్లి : బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు


కరీంనగర్ రూరల్ : ఎలబోతారం ప్రభుత్వ పాఠశాలలో


చొప్పదండి: ఆర్నకొండ అక్షయ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో


శంకరాపట్నం : శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో


హుజురాబాద్ : కాకతీయ మాడల్ స్కూల్‌లో చిన్నారులు


జమ్మికుంట: న్యూ జయభారతిలో బతుకమ్మ సంబరాలు


చొప్పదండి: వీణాదారిలో బతుకమ్మ వేడుకలలో విద్యార్థినిలు

బిజినెస్

పేటీయం పేమెంట్స్ బ్యాంక్‌కు భారీ జరిమానా

- కెవైసి నిబంధనల అమల్లో విఫలం
- ఆ సంస్థకు రూ.5.39 కోట్ల పెనాల్టీ : ఆర్‌బీఐ చర్యలు



ముంబయి: పేటియం పేమేంట్స్ బ్యాంక్‌కు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారీ షాక్ ఇచ్చింది. ఆర్‌బిఐ నిబంధనలను పాటించ డంలో పేటియం విఫలం కావడంతో ఆ సంస్థకు రూ.5.39 కోట్ల జరిమానా విధించింది. ఈ విషయమై ఆర్‌బీఐ ఓ ప్రకటన విడుదల చేయగా.. పేటీయం రెగ్యూలేటరీ సంస్థల ఫైలింగ్‌లో తెలిపింది. పేమెంట్స్ బ్యాంక్స్ లైసెన్సింగ్‌కు సంబంధించి ఆర్‌బీఐ మార్గదర్శకాలు, బ్యాంకుల సైబర్ సెక్యూరిటీ, ఫ్రేమ్‌వర్క్, మొబైల్ బ్యాంకింగ్ అప్లికేషన్ భద్రతకు నిర్దేశించిన నిబంధనలను పాటించడంలో విఫలమయ్యిందని ఆర్‌బిఐ పేర్కొంది. 'ఆర్‌బీఐ కెవైసి నిబంధనలు 2016' గైడ్‌లైన్స్ అమలు చేయలేదని పేర్కొంది. తాము ఈ లోపాలను గుర్తించామని వెల్లడించింది. యాంటీ మనీలాండ రింగ్ కోణంలో ప్రత్యేక పరిశీలన జరిపామని పేర్కొంది. ఆర్‌బిఐ గుర్తించిన ఆడిటర్లతో పేటీయం పేమెంట్ బ్యాంక్‌లో సమగ్ర సిస్టమ్ ఆడిట్ నిర్వహించామని వెల్లడించింది. ఈ క్రమంలోనే వ్యాపారులకు అందించే సర్వీసు అయినా పేఔట్ సర్వీసులకు సంబంధించి సంస్థ యజమానులను గుర్తించ డంలో పేటీయం పేమెంట్స్ బ్యాంక్ విఫలమైనట్లు తేలిందని తెలిపింది.

పేఔట్ లావాదేవీలకు సంబంధించి ఆయా సంస్థల రిస్క్ అంశాలను పర్యవేక్షణ చేయడంలోనూ విఫలమైందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. పేఅవుట్ సేవలు ఖాతాదారుల అడ్వాన్స్ ఖాతాల్లో ఎండ్ ఆఫ్ ది డే బ్యాలెన్స్‌కు సంబంధించి నిర్దేశించిన పరిమితిని పేటీయం పేమెంట్స్ బ్యాంక్ ఉల్లంఘించినట్లు గుర్తించినట్లు ఆర్‌బిఐ పేర్కొంది. తాము గుర్తించిన ఉల్లంఘనలపై ఎందుకు జరిమానా విధించకూడదో వివరణ ఇవ్వాలని పేటియం పేమెంట్స్ బ్యాంక్‌కు నోటీసులు ఇచ్చింది. దీనిపై ఆ సంస్థ ఇచ్చిన రాతపూర్వక సమాధానంతో పాటుగా వ్యక్తిగత విచారణలోని సమాధానా లకు ఆర్‌బీఐ సంతృప్తి చెందినట్లు లేదని సమాచారం. నిబంధనలు ఉల్లంఘించ నందుకే ఈ జరిమానా వేసినట్లు ఆర్‌బీఐ పేర్కొంది. దీంతో సాధారణ ఖాతాదారుల లావాదేవీలకు ఎలాంటి సంబంధం లేదని తెలిపింది. గురువారం బీఎస్‌ఈలో పేటీయం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ షేర్ ధర 1.47 శాతం పడిపోయి రూ.957.60 వద్ద ముగిసింది.

16, 17న ఐడిబిఐ బ్యాంక్ 'రిటైల్ లోన్ ఫెస్ట్'

న్యూఢిల్లీ : ప్రస్తుత పండగ సీజన్‌లో రుణగ్రహీతలను ఆకర్షించ డానికి ఐడిబిఐ బ్యాంక్ 'రిటైల్ లోన్ ఫెస్ట్'ను ప్రకటించింది. అక్టోబర్ 16, 17 తేదిల్లో తమ 125పైగా శాఖల్లో 'బ్యాంక్ ఎయిసా దోస్త్ జయిసా' నినాధంతో ప్రత్యేక క్యాంపెయిన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. ఖాతాదారుల అవసరాలను తీర్చడానికి ఆకర్షణీయ విధానాలను అనుసరిస్తున్నామని ఐడిబిఐ బ్యాంక్ డిఎండి సురేష్ ఖటన్వర్ పేర్కొన్నారు.

భారత ఉద్యోగులకు యాక్సెంచర్ అన్యాయం

న్యూఢిల్లీ : ప్రముఖ ఐటి సంస్థ యాక్సెంచర్ భారత ఉద్యోగుల పట్ల పక్షపాత దోరణిని అవలంభిస్తోంది. భారత్, శ్రీలంకలో తమ ఉద్యోగులకు ఈ ఏడాది వేతన పెంపుతో పాటు అధిక బోనస్ చెల్లింపులు ఉండవని స్పష్టం చేసింది. అదే విధంగా పదోన్నతులను కుదించనున్నట్లు సమాచారం. కాగా.. రెండు అంశాలు కూడా కొన్ని విభాగాలకు వర్తించదని యాక్సెంచర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ విజ్ తమ ఉద్యోగులకు సమాచారం ఇచ్చారు. ప్రస్తుత ఏడాది ఉద్యోగులకు వేతన పెంపును కంపెనీ చేపట్టడం లేదని పేర్కొన్నారు. మరోవైపు ఒకటి నుంచి నాలుగు లెవెల్స్ వరకూ పదోన్నతులను 2024 జూన్ వరకూ వాయిదా వేస్తున్నామన్నారు. ఇక భారత్‌లో 3 లక్షల మందికి పైగా ఉద్యోగులు యాక్సెంచర్‌లో పనిచేస్తున్నారు.

ప్రథమార్థంలో జెఎల్‌ఆర్ రికార్డ్ అమ్మకాలు

న్యూఢిల్లీ : ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ జాగ్వర్ లాండ్ రోవర్ (జెఎల్ఆర్) 2023-24 ప్రథమార్థం (హెచ్1)లో రికార్డ్ అమ్మకాలను నమోదు చేసినట్లు తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన కాలంలో 105 శాతం వృద్ధితో 2,356 యూనిట్ల విక్రయాలు చేసినట్లు పేర్కొంది. గతేడాది ఇదే కాలంలో 1,308 యూనిట్ల అమ్మకాలు చేసింది. గడిచిన హెచ్1లో మెరుగైన ప్రగతిని కనబర్చామని జెఎల్‌ఆర్ ఇండియా ఎండి రాజన్ అంబా పేర్కొన్నారు.

మైక్రోసాఫ్ట్ సివిపిగా అపర్ణ చెన్నప్రగడ



న్యూఢిల్లీ : గ్లోబల్ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్‌గా ఇండో అమెరికన్ అపర్ణ చెన్నప్రగడ నియమితులయ్యారు. ఆమెకు కీలకమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ విభాగం బాధ్యతలు అప్పగించారు. ఐఐటి మద్రాస్ గ్రాడ్యుయేట్ అయిన అపర్ణకు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, డిజైన్, స్ట్రాటజీ విభాగాల్లో 20 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. గూగుల్‌లో ఆమె 12 ఏళ్లు పని చేశారు. ఎఐలో గూగుల్, మైక్రోసాఫ్ట్ మధ్య నెలకొన్న తీవ్ర పోటీ నేపథ్యంలో అపర్ణకు కీలక బాధ్యతలను అప్పగించడం విశేషం.

కృత్రిమ మేధాతో మానవాళికి ముప్పు

- ఎఐ నిపుణుడు జాఫ్రె హింటన్

న్యూఢిల్లీ : కృత్రిమ మేధాతో మానవాళికి ముప్పు పొంచి ఉందని ఎఐ గాడ్‌ఫాదర్, గూగుల్ మాజీ పరిశోధకుడు జాఫ్రె హింటన్ హెచ్చరించాడు. ఓ వార్త సంస్థకు ఇచ్చిన ఇంటర్యూలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే 5 నుంచి 20 ఏళ్లలో ఎఐతో పనుల తీరు పూర్తిగా మారొచ్చన్నారు. మనుషులు చేసే పనులను ఎఐ తారుమారు చేసే అవకాశం ఉందన్నారు. ఎఐ టూల్స్ అన్ని నవలలను చదవడం ద్వారా అది మనుషులను ఒప్పించడంలో సమర్థవంతంగా వ్యవహరిస్తుందని విశ్లేషించారు. రోబోట్‌లకు అన్నీ తెలుసని, ఏ పనులు ఎలా చక్కబెట్టాలో తెలుసునని హింటన్ పేర్కొన్నారు. వాతావరణ మార్పులు విసిరే సవాల్ కంటే ఎఐతోనే మానవాళికి పెను ముప్పు పొంచి ఉందని హెచ్చరించారు. దీనిపై పాలకులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

కంటి చికిత్సలకు ఎల్‌జి సాయం

న్యూఢిల్లీ : కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)లో భాగంగా కంటి చికిత్సలకు సాయం చేయనున్నట్లు ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ తెలిపింది. 14,500 మందికి కంటి శుక్లాలను తొలగించడానికి మద్దతును అందించనున్నట్లు పేర్కొంది. దక్షిణాదిలో 4వేల శస్త్ర చికిత్సలకు సాయం చేయడానికి ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించింది."కరీన్ రోష్ని : లైట్ ఫర్ ఎవ్రీ సైట్" నినాధంతో కంటి శుక్ల శస్త్రచికిత్సలకు మద్దతు ఇవ్వడానికి ఆరు చారిటేబుల్ ట్రస్ట్‌లతో భాగస్వామ్యం చేసుకున్నట్లు తెలిపింది.

లైంగికదాడి కేసులో బీజేపీ నేత షానవాజ్ హుస్సేన్‌కు సమన్లు

- 20న న్యాయస్థానం ముందు హాజరు కావాలని ఢిల్లీ కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : లైంగికదాడి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి షానవాజ్ హుస్సేన్‌కు ఢిల్లీ కోర్టు సమన్లు జారీ చేసింది. ఈనెల 20న కోర్టు ముందు హాజరు కావాలని అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ వైభవ్ మెహతా ఆదేశించారు. 2018 ఏప్రిల్‌లో హుస్సేన్ తనను ఫామ్‌హౌస్‌కి తీసుకెళ్లి కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపి తనపై లైంగికదాడి చేశాడని బాధితురాలు ఆరోపించింది. మేజిస్ట్రేట్ ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఆ తర్వాత షానావాజ్ హుస్సేన్ ఈ ఉత్తర్వును ఢిల్లీ హైకోర్టులో సవాలు చేశారు. గతేడాది ఆగస్టులో హైకోర్టు హుస్సేన్ పిటిషన్‌ను కొట్టివేసింది. ఇప్పుడు అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ పోలీసులు ఇచ్చిన నివేదికను తోసిపుచ్చారు. విచారణ సమయంలో మహిళ వాదనల విశ్వసనీయతను పరీక్షించవచ్చని చెప్పారు.

ఫీజు బకాయిలు రూ.5,300 కోట్లు విడుదల చేయాలి

12.50 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి

- ప్రయివేటు విద్యాసంస్థల జేఏసీ కన్వీనర్ గౌరి సతీశ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు రూ.5,300 కోట్లున్నాయని తెలంగాణ ప్రయివేటు విద్యాసంస్థల (కేజీ టు పీజీ) జేఏసీ కన్వీనర్ గౌరి సతీశ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండున్నరేండ్లుగా ట్యూషన్ ఫీజులను చెల్లించకపోవడంతో ఉన్నత విద్యను అభ్యసించే 12.50 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీజు బకాయిలతో విద్యార్థులతోపాటు ప్రయివేటు కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఫీజు బకాయిలతో సిబ్బందికి సకాలంలో జీతాలివ్వలేని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనలు, టాస్క్‌ఫోర్స్ ద్వారా తనిఖీలు చేపట్టడంతో రాష్ట్రంలో వెయ్యి జూనియర్ కాలేజీలు, 700 వరకు డిగ్రీ కాలేజీలు, 300 పీజీ కాలేజీలు కలిపి మొత్తం రెండు వేల ప్రయివేటు కాలేజీలు మూతపడ్డాయని వివరించారు. ఫీజులను సకాలంలో ఇవ్వకుండా ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్నదని విమర్శించారు. బీఆర్‌వో టోకెన్ నెంబర్లు ఇచ్చినా డబ్బులు మాత్రం విద్యార్థుల ఖాతాల్లోకి చేరలేదన్నారు. కార్పొరేట్ కాలేజీలకు ప్రభుత్వం కొమ్ముకాస్తున్నదని అన్నారు. నిరుద్యోగ పట్టభద్రులు ఏర్పాటు చేసుకున్న కాలేజీలను ఇబ్బందులకు గురిచేస్తున్నదని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు తక్షణమే చెల్లించాలనీ, 12.50 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. లేదంటే ఆందోళనలకు పూనుకుంటామనీ, ఉద్యమ కార్యాచరణను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీపీజేఎంఏ నేతలు నరేందర్ రెడ్డి, పార్థసారధి, సిద్దేశ్వర్, సుధాకర్ రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, హైమద్ సలీం, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి ప్రశాంత్ రెడ్డికి మాతృవియోగం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తల్లి వేముల మంజులమ్మ గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆమె అనారోగ్యంతో కొంతకాలంగా హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందారు. స్వగ్రామం నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కాగా, తన తల్లి మంజులమ్మ మరణ వార్త తెలిసి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి బోరున విలపించారు. ఆయనను ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రి, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మెన్ డాక్టర్ మధుశేఖర్, మంత్రి వియ్యంకుడు దయానంద్‌రెడ్డి ఓదార్చారు. కాగా శుక్రవారం ఉదయం వేల్పూర్‌లో జరిగే మంత్రి ప్రశాంత్‌రెడ్డి మాతృమూర్తి మంజులమ్మ అంత్యక్రియల్లో బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయకత్వంతో పాటు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొననున్నారు.

ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీని బదిలీ చేయండి

- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసిఫాబాద్ జిల్లా ఎస్పీని వెంటనే బదిలీ చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో ఎన్నికలసంఘం ప్రధాన అధికారి వికాస్‌రాజుకు వినతి పత్రం అందజేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.జిల్లా ఎస్పీ కె సురేష్ కుమార్ ఎన్నికల నియమ నిబంధనలను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. మద్యం,డబ్బు పంపిణీపై ఎన్నికల సంఘం పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కోరారు.

హలో బీసీ...చలో గాంధీభవన్

- కాంగ్రెస్ నేత చెరుకు సుధాకర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో బీసీలకు 34 అసెంబ్లీ స్థానాలు ఇస్తామన్న హామీ ప్రకారం నెరవేర్చాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు చెరుకు సుధాకర్ కోరారు.గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేత కత్తి వెంకటస్వామితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. హలో బీసీ...చలో గాంధీభవన్ పేరుతో శుక్రవారం గాంధీ భవన్‌లో దీక్ష చేస్తామన్నారు. బీసీలే కాకుండా సామాజిక న్యాయం కావాలని కోరుకునేవారంతా దీక్షలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. బీసీలకు ఇస్తామన్న స్థానాలు ఇవ్వకపోతే కాంగ్రెస్ అధికారంలోకి రాదన్నారు. కాంగ్రెస్ గెలుపే లక్ష్యం, ఓబీసీల వాటానే ముఖ్యమన్నారు.

పాలేరు నుంచే పోటీ

- వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పాలేరు నుంచే పోటీ చేయనున్నట్టు వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల ప్రకటించారు.గురువారం హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు.అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ 119 నియోజక వర్గాల్లో వైఎస్ఆర్‌టీపీ పోటీ చేయనున్నట్టు తెలిపారు. పాలేరుతోపాటు మరో నియోజక వర్గంలో తాను పోటీ చేయనున్నట్టు తెలిపారు. వైఎస్ విజయమ్మ, బ్రదర్ అనిల్ కూడా పోటీ చేయాలనే డిమాండ్ ఉన్నదని చెప్పారు. బి ఫామ్‌ల కోసం దరకాస్తు పెట్టుకోవాలని పార్టీ నాయకులకు సూచించారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక ఓటు చీలకుండా ఉండేందుకు కాంగ్రెస్‌తో కలిసి పోవాలనుకున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్‌తో చర్చలు జరిపామనీ, నాలుగు నెలలు కాంగ్రెస్ వైఖరికోసం ఎదురు చూశామన్నారు.రాష్ట్రంలో వైఎస్ఆర్ సంక్షేమ పాలన తీసుకొస్తామని వైఎస్ షర్మిల పేర్కొన్నారు.

పాలస్తీనాకు కాశ్మీర్ సంఘీభావం

- హురియత్ నేత మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్

శ్రీనగర్: కాశ్మీర్ ప్రజలు పాలస్తీనాకు తిరుగులేని మద్దతుగా ఐక్యంగా ఉన్నారని పాలస్తీనియన్లకు ఆల్ పార్టీస్ హురియత్ కాన్ఫరెన్స్ చైర్మెన్ మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్ సంఘీభావం తెలిపారు. నాలుగు సంవత్సరాల తర్వాత ఇటీవల తన గృహ నిర్బంధం నుంచి విడుదలైన మిర్వాయిజ్ ఉమర్ ఫరూఖ్ తాజాగా ఈ ప్రకటన చేశారు. "ఈ సంఘర్షణ మూలాలు మళ్లీ వలసరాజ్యాల గతానికి సంబంధించినవి. వారు పాలించినప్పుడు వలసరాజ్యాల యజమానులు తీసుకున్న నిర్ణయాలలో దీని విషాదకరమైన ప్రభావం ఈ రోజు వరకు స్థానికులు అనుభవిస్తున్నారు" అని ఉమర్ ఒక ప్రకటనలో తెలిపారు. గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న నిరంతర దాడి ఆరో రోజుకు చేరుకున్నది. ఐక్యరాజ్యసమితి(యూఎన్‌ఓ) సెక్రెటరీ జనరల్ 'తీవ్రమైన బాధ' అని పేర్కొన్న ముట్టడి ప్రాంతంలో 250 మంది పిల్లలతో సహా 1055 మందికి పైగా పౌరులు మరణించారు. హమాస్ తన ఆపరేషన్ "అల్-అక్సా ఫ్లడ్" ప్రారంభించిన తర్వాత ఈ దాడి జరిగింది.

అత్తను కాల్చి చంపిన కానిస్టేబుల్

కుటుంబ కలహాలే కారణం


మృతురాలు కమల హంతకుడు

నవతెలంగాణ-హసన్‌పర్తి

ఆర్థిక లావాదేవీలు, కుటుంబ కలహాలతో ఓ కానిస్టేబుల్ తన వద్దనున్న రివాల్వర్‌తో తన అత్తను కాల్చి చంపిన ఘటన నగరవాసులను భయాందోళనకు గురిచేసింది. వరంగల్ నగర పోలీసు కమిషనరేట్‌కు కూతవేటు దూరంలో కేయూ పోలీసు స్టేషన్ పరిధిలోని గుండ్ల సింగారంలో గురువారం ఈ ఘటన చోటుచేసుకున్నది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకతీయ యూనివర్సిటీ పోలీసుస్టేషన్ పరిధిలోని గుండ్ల సింగారంకు చెందిన అనిగాల కమల (50)కి ఇద్దరు కూతుళ్ళు, ఒక కుమారుడు. పెద్ద కుమార్తె రమాదేవి భర్త ఆడ ప్రసాద్ రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధి పెద్దపల్లి జిల్లా కోటపల్లి పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కానిస్టేబుల్ ప్రసాద్, అతని భార్య రమాదేవిలకు ఇద్దరు కుమార్తెలు మధుమతి (16), అక్షిత (14) ఉన్నారు. ప్రసాద్, రమాదేవి దంపతులకు నాలుగేండ్లుగా గొడవలు జరుగుతుండటంతో వేర్వేరుగా ఉంటున్నారు.

కాగా, ఇటీవలే భార్య రమాదేవి మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. వారి కుటుంబ ఖర్చుల నిమిత్తం నెలకు రూ.15వేలు ఇస్తానని ప్రసాద్ ఒప్పుకున్నారు. ఈ క్రమంలో ప్రసాద్ బామ్మరిది దేవేందర్‌తో గొడవ జరిగింది. భార్య కాపురానికి రాకపోవడానికి అత్త కమల, బామ్మరిది దేవేందర్ కారణమన్న ఆగ్రహంతో ఉన్న ప్రసాద్.. బుధవారం తన పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ తుపాకిని తీసుకొని గురువారం ఉదయం గుండ్లసింగారంలోని తన అత్తగారి ఇంటికి చేరుకున్నాడు. ఈ క్రమంలో అత్త కమలతో కొద్దిసేపు బాగానే మాట్లాడాడు. అయితే ప్రసాద్ అత్త కమలకు గతంలో రూ.4 లక్షలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసి అడగడంతో వారివురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దాంతో కోపోద్రిక్తుడైన కానిస్టేబుల్ ప్రసాద్ తన వెంట తెచ్చుకున్న తుపాకితో తన అత్తను కాల్చిచంపాడు. గమనించిన కుటుంబసభ్యులు, స్థానికులు.. ప్రసాద్ వెంటబడి పట్టుకొని దేహశుద్ధి చేసి కేయూ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న డీసీపీ బారి, కేయూ ఇన్‌స్పెక్టర్ ముసుకు అబ్బయ్య, ఎస్ఐలు సురేష్, రాజుకుమార్, ఫింగర్ ప్రింట్ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గాయపడిన కానిస్టేబుల్ ప్రసాద్‌ను అదుపులోకి తీసుకొన్నారు. కమల మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ వెంట ఏసీపీ డేవిడ్‌రాజ్, ఇన్‌స్పెక్టర్ గోపి, కర్ణాకర్, కేయూ, హసన్‌పర్తి, హన్మకొండ పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఆ ఫోటోలు, వీడియోలు వద్దు

- హింసాత్మక కంటెంట్‌పై నిషేధం
- మణిపూర్ రాష్ట్ర సర్కారు ఆదేశం

ఇంఫాల్ : మణిపూర్ రాష్ట్రంలో హింసాత్మక చిత్రాలు, వీడియోలపై మణిపూర్ ప్రభుత్వం నిషేధం విధించింది. చిత్రాలు, వీడియోలు ఎవరైనా ప్రసారం చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించింది. ఒక వ్యక్తి మృతదేహాన్ని కందకంలో కాల్చినట్టు చూపించే వీడియో సోషల్ మీడియాలో వెలువడిన మూడు రోజుల తర్వాత రాష్ట్ర హెూం శాఖ ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది మే 4వ తేదీకి సంబంధించిన వీడియో అని పోలీసులు స్పష్టం చేశారు. ఇటువంటి ఫోటోలు, వీడియోలు ఆందోళనకారుల గుంపులను సమీకరించగలవనీ, దీంతో శాంతిభద్రతల ఆందోళనలు తీవ్రతరం అవుతాయని ప్రభుత్వం తెలిపింది. సాధారణ స్థితిని తీసుకురావడానికి ఇటువంటి విషయాలను నిరోధించాలని నిర్ణయించినట్టు వెల్లడించింది. హింస, ద్వేషాన్ని ప్రేరేపించడానికి ఎవరైనా సాంకేతికతను దుర్వినియోగం చేస్తే సమాచార సాంకేతిక చట్టం, భారతీయ శిక్షాస్మృతిలోని సంబంధిత నిబంధనల ప్రకారం తగిన విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర హెూం శాఖ వివరించింది. మే ప్రారంభంలో మణిపూర్‌లో వివాదం చెలరేగినప్పటి నుంచి హింసకు సంబంధించిన అనేక వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి.జులై 19న ఇద్దరు కుకీ మహిళలను ఒక గుంపు నగ్నంగా ఊరేగించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇది దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహజ్వాలలకు దారి తీసిన విషయం విదితమే. మే 4న మహిళలపై దాడి జరగగా.. మే 18న కేసు నమోదు చేసిన పోలీసులు.. ఆ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసిన తర్వాతే ఈ కేసులో తొమ్మిది మందిని అరెస్ట్ చేయటం గమనార్హం. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం హింసను అణచివేయటంలో విఫలమైందనీ, బాధితులపై జరిగే అకృత్యాలను ఆపలేని ప్రభుత్వం సంబంధిత చిత్రాలు, వీడియోలో సర్క్యులేషన్‌ను అడ్డుకోవడానికి నిర్ణయించిందని సామాజికవేత్తలు, ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు.

ఒకరి కాపీరైట్ ఉన్న పనిని మరొకరు ఉపయోగించుకోలేరు

- ఢిల్లీ హైకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ : ఒకరి కాపీరైట్ ఉన్న పనిని మరొకరు ఉపయోగించుకోవద్దని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. స్టోరీ టెల్లింగ్ ప్లాట్‌ఫారమ్‌లు అయిన హ్యూమన్స్ ఆఫ్ బాంబే, పీపుల్ ఆఫ్ ఇండియా కేసులో న్యాయస్థానం ఈ విధంగా వెల్లడించింది. అయితే, ఏదైనా ప్లాట్‌ఫారమ్‌లకు వ్యక్తులు పంపిన ప్రయివేటు ఫోటోగ్రాఫ్‌లకు కాపీరైట్ క్లెయిమ్‌లు ఉండవని కోర్టు వివరించింది. గత నెలలో, హ్యూమన్స్ ఆఫ్ బాంబే కాపీరైట్ ఉల్లంఘన విషయంలో పీపుల్ ఆఫ్ ఇండియాపై దావా వేసింది. ఇందులో ఒకే రకమైన కంటెంట్ ఉన్నదని ఆరోపించింది. బాంబేలోని హ్యూమన్స్ ఆఫ్ ఇండియా తన సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో అనేక ఫోటోలు, వీడియోలను పునరావృతం చేసిందని ఆరోపించింది.

ఇజ్రాయిల్‌కి ఈ యుద్ధం అంత తేలిక కాదు!

నెల్లూరు నరసింహారావు

అక్టోబర్7వ తేదీనాడు మొదలైన పాలస్తీనా-ఇజ్రాయిల్ ఘర్షణ ప్రపంచాన్ని విస్మయానికి గురిచేసింది. ఇజ్రాయిల్ పైన హమస్ రాకెట్లను ప్రయోగించటమే కాదు, అది ఇజ్రాయిల్ భూభాగంలో కూడా చొరబడ గలిగింది. ఆపరేషన్ "అల్- అక్సా ఫ్లడ్" పేరు తో జరిగిన ఈ దాడి వెనుక పక్కా ప్రణాళిక, ఊహాతీత సాహసం ఉన్నాయి. 1000మందికి పైగా ఇజ్రాయిలీలు మరణించారు. 3500 మందికి పైగా గాయపడ్డారు. కొన్ని ప్రాంతాలు ఆక్రమణలకు గురయ్యాయి. సైనిక సిబ్బంది, పౌరులు బంధీలయ్యారు. ఇజ్రాయిలీ ప్రధాని బెంజమిన్ నెతాన్యాహు పూర్తి స్థాయి యుద్ధాన్ని ప్రకటించి గాజా ప్రాంతాన్ని నేలమట్టం చేస్తానని ప్రతిన పూనాడు. ఈ సంఘటన ఇజ్రాయిలీ భద్రతా వ్యవస్థ వైఫల్యాన్ని తెలియజేస్తోంది. ఇజ్రాయిలీ గూఢచార సంస్థ మొస్సాద్ సర్వవ్యాప్తమని, ఇజ్రాయిలీ సైన్యం అజేయమని భావించే వారివి భ్రమలని హమస్ ఆకస్మిక దాడి నిరూపించింది. పాలస్తీనా సాయుధ గ్రూపులు దేశంపైన దాడి చేస్తుండగా అనేక గంటలపాటు ఇజ్రాయిలీ సైన్యం షాక్ లో ఉంది. గూఢచార వ్యవస్థ పూర్తిగా విఫలమైంది. హమస్ ఇజ్రాయిల్ పైన దాడి చేయటా నికి 1973లో జరిగిన యోమ్ కిప్పూర్ యుద్ధ 50వ వార్షిక దినాన్ని ఎంచుకుంది. ఈ అవమానం నుంచి ఇజ్రాయిల్ బయటపడాలంటే శత్రువును ఊచకోత కోయాలి. అందుకోసం గాజాలో తన సైన్యాన్ని దించాలి. అయితే ఈ పోరులో హమస్ ఒక్కటే లేదు. దానికి ఇరాన్, లెబనీస్ మిలిటెంట్ సంస్థ హెజ్బొల్లాల మద్దతు ఉంది. అంతకుముందు హెజ్బొల్లా రెండవ ఫ్రంట్ ను ఓపెన్ చేస్తానని మాట ఇచ్చింది. నేడు అది బాహాటంగా పాలస్తీనా వైపు సాయుధంగా పాల్గొంటోంది. హెజ్బొల్లా దగ్గర అధునాతన ఆయుధాలు ఉన్నాయి. దానికి ఇరాన్ పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తోంది. 1985లో మొదలైన హెజ్బొల్లా గతంలో ఎన్నడూ లేనంతగా బలోపేతమైవుంది. సిరియాలో జరుగుతున్న అంతర్యుద్ధంలో అనేక విజయా లను సాధించింది. లెబనాన్ లో దానికి పెద్ద ఆయుధాగారం ఉంది. ఆ ప్రాంతంలో బల మైన మిత్రులున్నారు. హెజ్బొల్లా మిలిటెంట్ సంస్థ మాత్రమే కాదు అది లెబనాన్ లో ఒక రాజకీయ పార్టీగా కూడా వుంది. దాని సైనిక బలం గురించి, ఆయుధ బలం గురించి రకరకాల ఊహాగానాలు ఉన్నాయి. ఇరాన్ కున్న ఆయుధాలు హెజ్బొల్లాకు కూడా ఉన్నట్టే. వీటిలో క్షిపణులు, డ్రోన్లు ఉన్నాయి. ప్రతి సంవత్సరం హెజ్బొల్లా ఇరాన్ నుంచి వేల కోట్ల డాలర్ల సహాయాన్ని పొందుతోంది. అంటే హెజ్బొల్లా ఇజ్రాయిల్‌ను భూమి, ఆకాశం, సముద్ర జలాలలో ప్రతిఘటించగలదు. దాని దగ్గర నౌకలను ముంచగలిగిన మిస్సైల్స్, డ్రోన్స్ కూడా ఉన్నాయి. అంతేకాకుండా హెజ్బొల్లా దగ్గర 500 నుంచి 700కిలోమీటర్ల దూరంలోవున్న లక్ష్యాలను ఛేదించగలిగిన బాలిస్టిక్ మిసైల్స్ ఉన్నాయి. అంటే ఇజ్రాయిల్ లో ఏ ప్రాంతంపైనైనా దాడి చేయగల సామర్థ్యం హెజ్బొల్లాకు ఉంది. అంతేకాకుండా హెజ్బొల్లాకు సుశిక్షితులైన ఒక లక్షమంది సైన్యం ఉందని ఆ సంస్థ సెక్రటరీ జనరల్ హస్సన్ నస్రల్లా చెప్పాడు. వీరుకాకుండా ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల నుంచి అనేక సేవల కోసం మద్దతుదారులను కూడగట్టగలిగే శక్తి ఈ సంస్థకు ఉంది. 2006లో జరిగిన రెండవ లెబనాన్ యుద్ధం తరువాత హెజ్బొల్లా దగ్గరవున్న క్షిపణుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఒక అంచనా ప్రకారం హెజ్బొల్లా దగ్గర దాదాపు 2లక్షల క్షిపణులు ఉన్నాయి. వీటిలో సూటిగా లక్ష్యాలను ఛేదించ గలిగేవి, డ్రోన్లు, రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. ఇవేకాకుండా ఇరాన్ హెజ్బొల్లాకు లెక్కలేనన్ని ఫిరంగులు, వాటిలో ఉపయోగించే షెల్స్‌ను సరఫరా చేసింది. ఈ సంస్థ దగ్గర అనేక వేల సాయుధ శకటాలు ఉన్నాయి. వీటిలో టి-55, టి-72, టి-80 ట్యాంకులు కూడా ఉన్నాయి. ఇజ్రాయిల్ పై రోజుకు 3000క్షిపణులను ప్రయోగించగల సామర్థ్యం హెజ్బొల్లాకు ఉంది. హెజ్బల్లా దగ్గర 2000డ్రోన్లు కూడా ఉన్నాయి.



ఇవే కాకుండా ఇజ్రాయిలను మరో సమస్య వేధిస్తోంది. హెజ్బొల్లాకు విస్తృతమైన సొరంగ మార్గాలున్నాయి. వీటివల్ల భూగర్భంలో హెజ్బొల్లా యోధులు ఒక చోటు నుంచి మరొక చోటుకు సురక్షితంగా పయనించగలరు. తమ సైనిక సామాగ్రిని, ఆయుధాలను దాచుకో గలరు. ఇజ్రాయిలీ సైన్యం వీటిని నిరంతరం ధ్వంసం చేస్తూ వుంటుంది. అయితే వీటి సంఖ్య గణనీయంగా ఉండటంవల్ల వీటిని నాశనం చేయటం ఇజ్రాయిల్ కు సాధ్యపడటం లేదు. వీటివల్లనే హెజ్బొల్లా ఆకస్మిక దాడులను చేయగలుగుతుంది. అంతేకాక హెజ్బొ ల్లాకు ఐటి వంటి సమాచార సాంకేతికతల పైన కూడా పట్టువుంది. ఎలెక్ట్రానిక్ యుద్ధ పరి జ్ఞానం, హ్యాకింగ్ వంటి సాంకేతికలపైన హెజ్బొల్లాకు మంచి అవగాహన వుంది. పైన వివరించిన పరిస్థితిని బట్టి మనం కొన్ని ముఖ్యమైన నిర్ధారణలకు రావచ్చు. ఒకవేళ హెజ్బొల్లాపైన ఇజ్రాయిల్ గెలవటం జరిగితే అది కష్టనష్టాలతో వచ్చే విజయమే అవుతుందితప్ప సునాయాసంగా గెలిచేది కాజాలదు. ఇజ్రాయిల్‌తో ప్రత్యక్షంగా తలపడితే హెజ్బొల్లా కూడా తీవ్రంగా నష్టపోతుంది. అయితే ఇరుపక్షాల అస్తిత్వ నియమాల మధ్య ఒక మౌలికమైన తేడావుంది. హెజ్బొల్లా సృష్టించ బడిందే చావోరేవో తేల్చుకోవటానికి. తాను ఎంతగా నాశనమైపోయినా దాని లక్ష్యం శత్రువును చావు దెబ్బ కొట్టటమే. అయితే ఇజ్రాయిల్ అందుకు సిద్ధంగా ఉందా? అనేదే తేలవలసిన ప్రశ్న.



చదువు సంస్కారాలు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుస్తాయి. అనుకున్నది సాధిస్తారు. విజయం ధరహాసమై తొణికిసలాడుతుంది. ఇంకా ఇంకా కృషి చేస్తూ అందరి మన్ననలు అందుకుంటారు. అలాంటి కోవకే చెందుతారు డాక్టర్ దివ్య శ్రీరామ్ డయాగ్నస్టిక్ సెంటర్ స్థాపించి అందులో ఆమె సాధించిన విజయాలను తెలుసుకుందాం.

డయోగ్నస్టిక్స్‌లో నవ్య కేతనం డాక్టర్ దివ్య

దివ్య తండ్రి శ్రీరామ్ దివాకరన్. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో వింగ్ కమాండర్ (రిటైర్డ్). ఉద్యోగ రీత్యా దేశంలోని అన్ని ప్రదేశాలకు తిరగవలసి వచ్చేది. దాంతో విభిన్నమైన సంస్కృతి సంప్రదాయాలు దివ్యకు పరిచయమయ్యాయి. పదవ తరగతి వరకు తమిళనాడులోని తిరునల్వేలిలో చదువుకుంది. దివ్య కేంద్రీయ విద్యాలయ విద్యార్థిగా దేశవ్యాప్తంగా చదువుకోగలిగింది. దివ్య తల్లి భాగ్యలక్ష్మి శ్రీరామ్, సైన్స్ టీచర్. దివ్య చిన్ననాటి నుండి తల్లిని ఎప్పుడు ఏవో ప్రశ్నలు అడుగుతూ ఉండేది. సైన్స్ బయోలాజికల్ ఎక్స్‌పరిమెంట్స్ బాగా నేర్పించేది. తాత(తండ్రి తండ్రి) ఆమెకు ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ సైన్స్ పుస్తకాలను బహుమతిగా ఇచ్చేవారు. వీరు ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేసేవారు. ఇంట్లో వారి గదిలో మూడు గోడలకు పుస్తకాలుండేవట. దివ్య నాన్నమ్మ, విద్యావతి దివాకరన్. వీరు బిజినెస్ వుమెన్, రియల్ ఎస్టేట్ వ్యాపారంలో స్వతంత్రంగా నిలదొక్కుకున్న మహిళ. దివ్య అమ్మమ్మ, బాల స్వామినాథన్. వీరు ఇంగ్లీష్ టీచర్‌గా చేశారు. తాత ఇ.ఎస్.స్వామినాథన్ ఇండియా సిమెంట్స్‌లో మేనేజర్‌గా చేశారు.

చిన్నతనం నుండే...

దివ్యకు చిన్ననాటి నుంచి సైంటిస్ట్ కావాలనే కోరిక ఉండేది. చదువులోనే కాదు ఆటపాటల్లోనూ చురుగ్గా ఉండేది. పాఠశాలలో ఉన్నప్పుడు బాస్కెట్ బాల్ టీం కెప్టెన్ ఈమె. టైం దొరికినప్పుడల్లా లైబ్రరీకి వెళ్లి చదువుకొనే దివ్య ఫిజిక్స్, బయాలజీని ఇష్టంగా చదివేది. బేసిక్ ఫిజిక్స్ వంటివి వాళ్ళ నాన్న కూర్చోబెట్టుకుని చెప్పేవారు. అమ్మ చదవడం పరిచయం చేసింది. దాంతో ఏడెనిమిదేండ్లకే కథలు, పిల్లల నవలలు చదివింది. ఆరవ తరగతి నాటికే అన్ని ఎన్సైక్లోపీడియాలూ చదివేసింది. దివ్య నాన్న కజిన్ ఒకరు మ్యాథమెటిక్స్ సైంటిస్ట్, పీహెచ్డీ. గేమ్ థియరీ, మ్యాథమెటిక్స్ గేమ్ కంప్యూటేషనల్ సైన్స్ ఇన్ మ్యాథమెటిక్స్ వంటి పుస్తకాలు, గేమ్స్ కాంప్లెక్స్ క్యాలిక్యులేషన్స్ వంటి వాటిపై పనిచేశారు. ఆయన తరచూ అమెరికాకు వెళ్లేవారు. అక్కడి నుండి దివ్య కోసం బయాలజీకి సంబంధించిన పుస్తకాలను తెచ్చి బహుమతిగా ఇచ్చేవారు. అవన్నీ దివ్య బాగా చదివేది. ఈ ఉత్సాహం, ఈ ఆసక్తి చదువులోనూ కనబరిచి అందరి మెప్పును పొందిన దివ్య డాక్టర్ లేదా ఇంజనీరింగ్ కావాలని అనుకోలేదు.



టాప్ 30 మందిలో స్థానం

ఇంటర్‌లో మ్యాథ్స్ బయో కాంబినేషన్స్‌తో చదివినా బిట్స్ పిలానీలో బీ.ఎస్.సి, ఎంఎస్సీ ఫిజిక్స్‌తో చదవాలనుకున్నది. కాని ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ కోర్స్ ఎం.ఎస్.సి., వి.ఐ.టి.యూనివర్సిటీ, వెల్లూరులో ఐదేండ్ల డ్యూయల్ డిగ్రీ కోర్సుతో పూర్తిచేసింది. సి.ఎస్.ఐ.ఆర్.ఎన్.ఈ.టి.సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (గవర్నమెంట్), ఆల్ ఓవర్ ఇండియా నుంచి లక్ష మంది హాజరైన ఈ పరీక్షలో టాప్ 30 మంది స్టూడెంట్స్‌లో స్థానం సంపాదించింది. హైదరాబాదులో హబ్సిగూడలో ఉన్న సి.ఎస్.ఐ.ఆర్.ఇన్స్టిట్యూట్ ఆఫ్ బయోటెక్, సి.సి.ఎమ్.బి.లో క్యాన్సర్ సెల్ బయోలజీలో పి.హెచ్ డి. చేసింది.

ఎన్నో ప్రయత్నాలు చేసి

ఇప్పుడు ఉత్పత్తి క్రమం ఒక్కటే చరిత్రను నడిపిస్తున్నది. ప్రజోత్పత్తి విషయాలే మౌలికమైన అంశాలు, అవసరాలు. ఇందులో భాగమైనవే ఆరోగ్యం.. అనారోగ్యం అనేవి. మంచిగా ఉన్నంత వరకు మనుషులను పట్టలేము. ఏదైనా అనారోగ్యం వచ్చిందంటే చాలు ఇక మొదలవుతాయి అవస్థలు. ఏమయిందో తెలుసుకోడానికి ముందు పరీక్షలు చేయాలి. డయోగ్నస్టిక్ సెంటర్స్‌లో పరీక్షలు చేస్తేనే జబ్బును కనుగొనగలరు.

క్యాన్సర్ డిసీజ్‌పై పరిశోధనలు

చదువును కష్టంగా చదివే వాళ్ళకి పూర్తి చేయడం కష్టం కానీ, ఇష్టంగా చదివే వాళ్ళకి ఏం కష్టం? తను చేసే పని మీద శ్రద్ధ, భక్తి ఉన్నవాళ్లు తప్పకుండా విజయం సాధిస్తారు. ఒక ధ్యేయంతో చదువును పూర్తి చేసుకున్నది కాబట్టే దివ్య తొందరలోనే సొంతంగా ఒక డయాగ్నటిక్ సెంటర్ ప్రారంభించాలని అనుకుంది. ఆ సెంటర్ పేరే డినోమ్ ప్రైవేట్ లిమిటెడ్. ఇది హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఉన్నది. ఎంటర్ప్రినర్ లండన్ బేస్డ్ టాలెంట్ ఇన్వెస్టర్స్‌లో మూడు నెలల ప్రోగ్రాంలో పాల్గొన్న దివ్య ఇక్కడ ఆఫీస్‌లో వర్కింగ్ పార్టనర్‌ను సెలెక్ట్ చేసుకుని ఇద్దరూ కలిసి బిజినెస్ చేస్తున్నారు. క్యాన్సర్ డిసీజ్‌పై వీరి పరిశోధనలు, ఫలితాలను చూసి ఇండియా ప్రభుత్వం 50 లక్షల గ్రాంట్ మంజూరు చేసింది. బి.ఐ.జి. బిరాక్ గ్రాంట్ దీన్నే బయోటెక్నాలజీ ఇన్నోవేట్ గ్రాంట్ అని అంటారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుండి ఈ మొత్తాన్ని తీసుకున్న దివ్య శ్రీరామ్, సూయజ్ డెబ్ సహకారంతో క్యాన్సర్‌పై పరిశోధనలు చేస్తున్నది. ఇవి సాధికారికంగా జరుగుతున్నాయి. ఇన్వెస్టర్స్‌గా లండన్ బేస్డ్ టాలెంటెడ్ వారు ఉన్నారు.



మారుతున్న జీవన ప్రమాణాల వల్ల ఎన్నో కొత్త కొత్త జబ్బులు వచ్చి పడుతున్నవి. ఆయా ఇన్ఫెక్షన్స్ ఎట్లా వచ్చాయో, పర్యవసానం ఏమిటో అనేది డయాగ్నస్ చేస్తే గాని డాక్టర్లు సరైన చికిత్స ఇవ్వగలరు. ఈ టెక్నిక్స్ గురించిన సబ్జెక్టులన్నీ చది, ఎన్నో ప్రయత్నాలు చేసి దివ్య ఈరోజు డినోమ్ సంస్థకు సీఈఓ అయింది.

మంచి గౌరవం పొందారు

దివ్య పరిశోధనా అంశాలపై చాలా పత్ర సమర్పణలు చేసింది. ఏ విషయంలో అయినా మనస్ఫూర్తిగా చదివి, శోధించి, పరిశోధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయి అనడానికి దివ్య చక్కటి ఉదాహరణ. 2019లో ఇండియాలో జరిగిన ఎంటీసీ కాన్ఫరెన్స్, Bioconలో కూడా ఈమె పాల్గొన్నది. దేశవ్యాప్తంగా పాల్గొన్న 50 మందిలో ఒకరుగా మంచి గౌరవం పొందారు. భర్త, అత్తమామలు దివ్యకు తోడునీడగా ఉంటున్నారు. తమ్ముడు కూడా ఆమెకు ఎంతో సపోర్ట్ చేస్తున్నాడు. బయో ఏషియా కాన్ఫరెన్స్ అప్పుడు బయోటెక్ సెంటర్లో ఒక ప్రెస్ పర్సన్ లాగా కొందరు ప్రముఖులను ఇంటర్వ్యూ తీసుకున్నప్పుడు తెలంగాణ రాష్ట్ర ఐటి మంత్రి కేటీఆర్‌ని కూడా ఇంటర్వ్యూ తీసుకుంది ఈమె. ఇండియా బయో సైన్స్ పత్రికలో ఈమె ఆర్టికల్స్, జర్నల్స్ కూడా వస్తుంటాయి. కొందరు ఏమీ చేయకుండానే ఎన్నో చేశామని, కొంతచేసే కొండంత చేశామని చెప్పుకుని గర్వపడుతుంటారు. కానీ వివేకవంతులు ఎంతో చేసి కొంతే చేశామని చెప్తుంటారు. వీళ్ళే నిగర్వులు. ఆశయ సాధనలో అడుగులు ముందుకు వేస్తూ సమాజానికి ఉపయోగపడేలా క్యాన్సర్ వంటి భయంకర వ్యాధులను డయాగ్నస్ చేస్తూ సమాజానికి అండగా నిలబడుతున్న డాక్టర్ దివ్య ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు.

- డాక్టర్ కొండపల్లి నీహారిణి

నాయకత్వం అంటే...



చాలా మంది గొప్ప గొప్ప నాయకులు కావాలని కలలుకంటుంటారు. వీరిలో కొందరు తమ కలలను సాకారం చేసుకునే దిశగా తమను తాము మలుచుకుంటారు. అయితే.. నాయకులు కావాలంటే ముందుగా మనలో నాయకత్వ లక్షణాలు ఉన్నాయో లేదో గుర్తించాలి. అలాగే మనలోని బలాలు బలహీనతలపై స్పష్టమైన అవగాహన కలిగి వుండాలి. అపుడే మనం ఓ మంచి లీడర్‌గా ఎదగలం. అసలు నాయకత్వ లక్షణాలు ఎలా ఉండాలో తెలుసుకుందాం.

- ఎల్లవేళలా ఆశావాద దృక్పథం కలిగి వుండాలి. తొలుత చిన్న లక్ష్యాలు, ఆ తర్వాత పెద్ద లక్ష్యాలను చేరుకునేలా సాధన వుండాలి.
- బృందంలోని సభ్యుల ప్రతిభను గుర్తించగలగాలి. వారికిచ్చిన పనులు సక్రమంగా పూర్తి చేస్తున్నారా లేదా అన్నది గ్రహించాలి. వారిని గౌరవిస్తూ వుండాలి. వారిలోని బలహీనతలు, బలాలను తెలుసుకుని మసలుకోవాలి.
- నిర్ణయం తీసుకోవాల్సినపుడు తన నిర్ణయమే చివరిదై ఉండాలి. అప్పుడప్పుడూ బృంద సభ్యుల సలహాలు తీసుకోవచ్చు. సృజనాత్మకతను పెంచుకోవాలని టీం సభ్యులను ప్రోత్సహిస్తూ ఉండాలి.
- నాయకత్వంలో ఉన్నప్పుడు కొన్ని పనులు చేయకూడదు.
- ఒకవేళ పనిలో ప్రతికూల వాతావరణం ఏర్పడితే బృందసభ్యులను నిందించవద్దు. తప్పు ఎక్కడుందో తెలుసుకుని సరిదిద్దేందుకు ప్రయత్నించాలి.

అతి అనర్థమే...

వ్యాయామం ఎవరికైనా చాలా మంచిది. అయితే.. అతి ఎప్పుడూ అనర్థమే.. ఎక్కువ సమయం ఎక్సర్‌సైజ్ చేయడం వల్ల ఎన్నో అనర్థాలున్నాయి. నిత్యం వ్యాయామం చేస్తే ఆరోగ్యం చేకూరుతుంది. ఆ విషయంలో మరో ప్రశ్నకు తావులేదు. అయితే ఏదైనా మితంగా ఉండాలే తప్ప... అతిగా వెళ్తే అనర్థాలు తప్పవు. అందుకే ఎక్కువ సమయం ఎక్సర్‌సైజ్ చేయడం వల్ల ఎన్నో అనర్థాలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆ అనర్థాలు ఏంటో ఇక్కడ చూద్దాం...

- రుతుక్రమంపై అతి వ్యాయామం తీవ్ర ప్రభావం చూపే ప్రమాదముంది. గంటల తరబడి వ్యాయామం చేస్తూ గడపడం వల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడే ప్రమాదముంది. వారంలో ప్రతి రోజూ కఠిన వ్యాయామం చేయటానికి బదులు కొన్నిసార్లు తక్కువ వ్యాయామాలు చేయాలని డాక్టర్ల సూచిస్తున్నారు.
- గంటల తరబడి వర్కౌట్స్ చేస్తే మహిళ్లలో నెలసరి వచ్చే ముందు ప్రొజెస్టెరాన్ స్థాయి పెరిగే అవకాశం ఉంది.
- ప్రొజెస్టెరాన్ స్థాయి పెరగడం ద్వారా శరీరంలో ఎన్నో మార్పులు వస్తాయి. దీని వల్ల మహిళలు అసహనానికి గురయ్యే అవకాశాలు ఎక్కువ అవుతాయి. మహిళలు రోజుకు 90 నిమిషాలకు మించి వర్కౌట్స్ చేస్తే మానసిక సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
- మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే తగినంత పోషకాహారం, సరైన నిద్ర అవసరం. వీటిని త్యాగం చేసి వ్యాయామం కోసం వెచ్చిస్తే దాంతో శరీరానికి అనర్థాలే ఎక్కువగా కలుగుతాయి.
- అందుకే వారంలో 5, 6 రోజులు వ్యాయామం చేసి మిగతా సమయంలో చిన్న యోగాసనాలు వేయడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.



రాష్ట్రానికి వంద కంపెనీల కేంద్ర సాయుధ బలగాలు

(మొదటిపేజీ తరువాయి)

కోడ్ అమల్లోకి వచ్చిన అక్టోబర్ 9 నుంచి గురువారం వరకు మొత్తం రూ.20.43 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే అక్టోబర్ 11-12 తేదీల్లో రూ.31,36,048 లక్షలు విలువైన 19,317 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామనీ, ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటి వరకు మొత్తం 31,739 లీటర్ల మద్యం, వెయ్యి కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నామనీ, వీటి విలువ రూ.86,92,533 ఉంటుందని వెల్లడించారు. అలాగే అక్టోబర్ 11-12 తేదీల్లో రూ.67,64,250 విలువైన 227కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామనీ, ఇప్పటి వరకు మొత్తం రూ.89 లక్షలు విలువైన 310 కిలోల గంజాయి స్వాధీనం అయినట్టు వివరించారు. అలాగే 11-12 తేదీల్లో పోలీసుల తనిఖీల్లో రూ.4 కోట్ల 89 లక్షలు విలువైన 24.257 కిలోల బంగారం, 16.1కిలోల వెండి, 42.203 క్యారెట్ల వజ్రాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అక్టోబర్ 9 నుంచి 12వ తేదీ వరకు మొత్తం రూ.14 కోట్ల 65 లక్షల బంగారం, వెండి, వజ్రాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. 7,040 కిలోల బియ్యం, 440 చీరలు, 80 కుట్టు యంత్రాలు, 87 కుక్కర్లు, ఒక కారు స్వాధీనం చేసుకున్నామనీ, వాటి విలువ రూ.7.86 లక్షలు ఉంటుందని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన అక్టోబర్ 9 నుంచి ఇప్పటి వరకు మొత్తం స్వాధీనాల విలువ రూ.37.07 కోట్లుగా ఉందని వివరించారు. అలాగే రాష్ట్రంలో శాంతిభద్రతల్లో భాగంగా అంతరాష్ట్ర సరిహద్దుల్లో 89 కేసులు, ఇతర రాష్ట్రాల సరిహద్దుల్లో 169 కేసులు నమోదయ్యాయని తెలిపారు.

గాంధీ గిరీ కాదు..'గులాబీ'గిరే..!

(మొదటిపేజీ తరువాయి)

చేసిన ఈ వ్యాఖ్యలు ఆ పార్టీకి 'కొత్త' తలనొప్పులు తెచ్చాయని ఆయన వ్యతిరేక గ్రూపు ఆరోపిస్తోంది. మరోవైపు ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడుతోంది. ఆయనకు గాంధీ పైన గౌరవం లేదని, నోరు అదుపులో పెట్టుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ హెచ్చరించారు. ఈ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని ప్రకటించారు.

ఇన్‌చార్జి పట్టుమని పదిరోజులు కాకముందే..!

బీఆర్ఎస్ భద్రాచలం పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న బాలసాని లక్ష్మీనారాయణను తప్పించి.. తాత మధును ఆ స్థానంలో నియమించి పట్టుమని పదిరోజులు కాకముందే చేసిన ఈ వ్యాఖ్యలు పార్టీని ఇరకాటంలో పెట్టాయనే చర్చ నడుస్తోంది. ఇన్‌చార్జిగా తప్పించడంతో పాటు తెల్లం వెంకట్రావును తనకు తెలియకుండా తిరిగి పార్టీలోకి చేర్చుకోవడంపై తీవ్ర అసహనంతో ఉన్న బాలసాని అనుచరులకు ఈ పరిణామం ఒకింత ఊతం ఇస్తోంది. ఓవైపు పువ్వాడ అజయ్‌కుమార్ బాలసానిని బుజ్జగిస్తున్నారు. మంత్రి హరీశ్‌రావుతోనూ ఫోన్‌లో మాట్లాడించారు. ఈ ప్రయత్నాలు సాగుతుండగానే మధు చేసిన ఈ వ్యాఖ్యలు హాట్‌టాపిక్‌గా మారాయి. ప్రతిపక్షాల విమర్శలకు అస్కారమిచ్చాయి. దీన్ని అవకాశంగా తీసుకుని ఆ పార్టీలో ఓ గ్రూపు ఆయనకు వ్యతిరేకంగా పావులు కదుపుతోంది. ఇప్పటికే బాలసాని ప్రాబల్యం అధికంగా ఉన్న వెంకటాపురం, వాజేడు నాయకులెవరూ మధు మీటింగ్‌లకు హాజరుకావడం లేదు. ఈ ఘటన ఆ పార్టీలో ఎలాంటి పరిణామానికి దారితీస్తుందనే అంశం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

అదీ పాత వీడియో..నాపై ప్రచారాన్ని ఖండిస్తున్నా..:ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

నేను అధికారులను దూషించలేదు. నాపై జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నాను. పాత వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసి తాజా వీడియోగా చిత్రీకరించేందుకు కుట్ర చేస్తున్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఎదుర్కొనే సత్తాలేని కొన్ని పార్టీలు, ఓ సెక్షన్ ఆఫ్ మీడియా ఈ ప్రచారానికి తెరలేపింది. ఈ వీడియో 2019 నాటిది. అప్పుడు గ్రామపంచాయతీ ఎన్నికల్లో కొందరు అధికారుల తీరుకు నిరసనగా నేను మాట్లాడాను. ఆ కామెంట్స్ చేసినప్పుడు నేను ఎమ్మెల్సీగా లేను. ఈ వీడియోపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. బహిరంగంగా ప్రెస్‌మీట్‌లు పెట్టి అధికారుల తాటతీస్తామని భయభ్రాంతులకు గురిచేస్తున్న రేవంత్‌రెడ్డిలాగా మేము బరితెగించి లేము. పదేపదే తెలంగాణ అధికారుల మనోభావాలు దెబ్బతీస్తున్న రేవంత్‌రెడ్డి సంగతి ప్రజలు గమనిస్తున్నారు. అప్పటి పరిస్థితుల్లో కార్యకర్తల రక్షణ కోసమే అలా మాట్లాడాను తప్ప అధికారులను కించపరిచే ఉద్దేశం నాకు లేదు.

అస్మదీయులపై వేటు

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా పలువురు ఐఏఎస్ అధికారులు అధికారపార్టీకి అనుకూలంగా పనిచేసి, వివిధ ఆరోపణలు ఎదుర్కొని, ఆ తర్వాత జైలు పాలైన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఎలక్షన్ కమిషన్ ఆగ్రహానికి గురైన అధికారులందరినీ అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యేవరకు విధులకు దూరంగా ఉంచాలని స్పష్టంగా చెప్పేసింది. వీరి స్థానంలో ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున కొత్త అధికారుల పేర్లను గురువారం సాయంత్రానికల్లా సూచించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించింది. పనిలో పనిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) శాంతికుమారిని కూడా సీఈసీ అభిశంసించినట్టు సమాచారం. ఆబ్కారీ, వాణిజ్యపన్నుల శాఖను కూడా సీఎస్ నిర్వహిస్తున్నారనీ, వాటికి తక్షణం ముఖ్య కార్యదర్శుల్ని నియమించాలని ఆదేశించింది. పోలీసుల తనిఖీల్లో భారీగా పట్టుబడే మద్యం, నగదు విషయాల్లో పారదర్శకత కోసమే సీఈసీ ఈ నియామకాలను ఆదేశించింది. అయితే నేరుగా సీఎస్ అధికారపార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారనే ఫిర్యాదులు ఏమీ రాకున్నా, ఆమెపై కూడా సీఈసీ పూర్తి విశ్వాసం ప్రకటించలేదని ప్రతిపక్షాలు చెప్తున్నాయి. ఎన్నికలు జరిగే ప్రతిసారీ ఇలాంటి బదిలీలు సర్వ సాధారణమే! దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల టైంలో కూడా కేంద్ర ఎన్నికల సంఘం ఇదే తరహాలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను బదిలీ చేసింది. అయితే ఈ బదిలీలు నిష్పక్షపాతంగా జరుగుతున్నాయా లేక కేంద్రంలోని బీజేపీకి అనుకూలంగా చేస్తున్నారా అనే అనుమానాలను కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి. ఉత్తర తెలంగాణలో కనీసం మూడు స్థానాలు, దక్షిణ తెలంగాణలో ఆరు స్థానాలు గెలవాలనేది బీజేపీ రాజకీయ వ్యూహంగా ఉన్నదనీ, దానికోసం కొత్తగా నియమితులయ్యే అధికారులు పనిచేయరనే గ్యారెంటీ ఏమీ లేదని కాంగ్రెస్‌పార్టీకి చెందిన ఓ సీనియర్ నాయకుడు వ్యాఖ్యానించారు. దీనితో సీఈసీ నిష్పాక్షికతపై కూడా సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు ప్రభుత్వ యంత్రాంగంపై కోటి ఆశలు పెట్టుకున్న అధికారపార్టీ బీఆర్ఎస్‌కు ఈ బదిలీల వ్యవహారం మింగుడుపడటం కష్టమే. తమ మాట చెల్లుబాటు కాకుండా పోతుందేమో అనే సందేహం ఆపార్టీ నేతల్లో కనిపిస్తోంది. బీఆర్ఎస్ అధిష్టానం కూడా దీనిపై సీరియస్‌గానే కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఒక్కో పోస్టుకు ముగ్గురి పేర్లు పంపాలనే సీఈసీ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు దృష్టికి తీసుకెళ్లారనే ప్రచారం జరుగుతున్నది. ఆ మేరకు ఆయన కొన్ని పేర్లు సూచించారనీ, ఆ జాబితానే ఆమె సీఈసీకి పంపుతున్నారనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో నడుస్తోంది.

పాలమూరు ప్రగతి నివేదిక భేష్..

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను అభినందించిన సీఎం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పాలమూరు జిల్లా ప్రగతి నివేదిక పుస్తకం పట్ల సీఎం కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై సమగ్ర సమాచారంతో కూడిన పుస్తకాన్ని గురువారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సీఎంకు అందజేశారు. శాఖల వారిగా, ఆకర్షణీయమైన ఫొటోలతో ప్రగతి నివేదిక తీసుకురావటంపై మంత్రికి సీఎం అభినందనలు తెలిపారు.

బాలసోర్ రైలు ప్రమాదం గుర్తు తెలియని

- 28 మృతదేహాలకు అంత్యక్రియలు పూర్తి

భువనేశ్వర్ : సుమారు నాలుగు క్రితం బాలసోర్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మరణించిన 28 మంది గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలకు బుధవారం అంత్యక్రియలు పూర్తి చేశారు. మంగళవారం సాయంత్రం ప్రారంభమైన ఈ దహన ప్రక్రియ బుధవారం ఉదయం 8 గంటలకు ముగిసిందని భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సులోచన దాస్ తెలిపారు. సుమారు నాలుగు నెలలుగా భద్రపర్చబడిన మృతదేహాలు మంచుగా మారాయని, భరత్‌పూర్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించినట్లు చెప్పారు. మృతదేహాలు డీఎన్ఎను భద్రపర్చినట్టు తెలిపారు.

వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో డిసెంబర్ 9న ఏర్పడబోయేది ఇందిరమ్మ రాజ్యమేనని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎల్బీస్టేడియంలో ఆరు గ్యారంటీలపై తొలి సంతకం పెట్టడం ఖాయమని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని చెప్పారు. అందుకే సెప్టెంబర్ 17న సోనియమ్మ ఆరు గ్యారంటీలను ప్రకటించారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలుచేసి తీరతామని పునరుద్ఘాటించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వివిధ నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నేతలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి రేవంత్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ తాగుబోతుల అడ్డాగా మార్చారని విమర్శించారు. వ్యవసాయానికి ఉచిత కరెంట్, రైతులకు రుణమాఫీ, విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలను కాంగ్రెస్ అమలు చేసిందని గుర్తుచేశారు. తమ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మా కార్యకర్తలపై ఇన్నాళ్లు కేసులు పెట్టారనీ, ఇంకో 45 రోజుల్లో తమ కార్యకర్తలకు మంచి రోజులు రాబోతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారుల సంగతి తేల్చుతామని హెచ్చరించారు. రాష్ట్ర డీజీపీని ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ప్రభాకర్ రావు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న వారిపై, పార్టీ నాయకుల ఫోన్‌లపై నిఘా పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు సాయం చేసేవారిని బెదిరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. 'కాంగ్రెస్‌కు సాయం చేస్తున్న 75 మంది లిస్టును కేటీఆర్ తయారు చేశారట. ఆ లిస్టును కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు ఇచ్చారు. కొంతమందిని కేటీఆరే స్వయంగా బెదిరిస్తున్నారట. బిడ్డా కేటీఆర్.గుర్తు పెట్టుకో.నీ అధికారం 45 రోజులే. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంతకు ఇంత మిత్తితో చెల్లిస్తాం. ఐఏఎస్ అధికారులు అర్వింద్‌కుమార్, జయేష్ రంజన్, సోమేశ్ కుమార్ వంటి నేతలు అధికార పార్టీకి చందాలు ఇవ్వాలని ప్రోత్సహిస్తున్నారు. అధికారులు అధికారుల్లా వ్యవహరించండి. బీఆర్ఎస్ కార్యకర్తల్లా కాదు' అని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ కూడా మోడీ, కిషన్ రెడ్డి, రాజాసింగ్‌లా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. నన్ను భాగ్యలక్ష్మి అమ్మవారిపై ప్రమాణం చేయాలంటున్నారు. భాగ్యలక్ష్మి ఆలయానికి వచ్చేందుకు నేను సిద్ధమే, మీరు సిద్ధంగా ఉన్నారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కార్యకర్తలారా 45రోజులు అకుంఠిత దీక్షతో పనిచేస్తే అధికారం మనదే అని భరోసా ఇచ్చారు.

రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నేతలు

- పరిగి - మాజీ మంత్రి కమతం రాంరెడ్డి కుమారుడు, మాజీ డీసీసీబీ చైర్మెన్ కమతం శ్రీనివాస్‌రెడ్డి
- తాండూరు-మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సునీతసంపత్, యువ నేత మహిపాల్ రెడ్డి
- మానకొండూర్ - ఇల్లంతకుంట, మానకొండూర్ ఎంపీపీలు
- ఎల్బీనగర్ -బీఆర్ఎస్ నేత రామ్మోహన్‌గౌడ్ ఆయన భార్య మాజీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్న
- జయశంకర్ భూపాలపల్లి - మాజీ మావోయిస్టు గాజర్ల అశోక్
- కంటోన్మెంట్ - శ్రీగణేష్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.

నేడు స్క్రీనింగ్ కమిటీ భేటీ

- ఢిల్లీ బయలుదేరిన రేవంత్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా తుది దశకు చేరుకుంది.మరోసారి చర్చించేందుకు శుక్రవారం ఢిల్లీలో స్క్రీనింగ్ కమిటీ భేటీ కానుంది. సమావేశంలో పాల్గొనేందుకు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్ తదితరులు వెళ్లారు. సీడబ్ల్యూసీ సభ్యులు దామోదర రాజనర్సింహ శుక్రవారం ఉదయం ఢిల్లీ వెళ్లనున్నారు.వీరే కాకుండా ఆయా నియోజకవర్గాల్లో టికెట్ల లొల్లి ఉన్న నాయకులు కూడా ఇప్పటికే ఢిల్లీ బయలుదేరారు. వెళ్లారు.

తీర్పులో కులమతాల ప్రస్తావన ఉండకూడదు : సుప్రీం

న్యూఢిల్లీ : కోర్టు తీర్పుల్లో కులమతాల ప్రస్తావనే ఉండకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఐదు సంవత్సరాల బాలికపై లైంగిక దాడి చేసిన గౌతమ్ అనే వ్యక్తికి విధించిన శిక్షను తగ్గిస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రాజస్థాన్ ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానంలో సవాలు చేసింది. దీనిని విచారించిన సందర్భంగా న్యాయమూర్తులు అభయ్ ఎస్ ఓకా, పంకజ్ మిథల్‌తో కూడిన బెంచ్ ఈ వ్యాఖ్య చేసింది. ట్రయల్ కోర్టు, రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన తీర్పుల్లో నేరస్తుడి కులాన్ని ఎందుకు ప్రస్తావించారని ధర్మాసనం ప్రశ్నించింది. ఏదైనా కేసును విచారించేటప్పుడు నిందితుడు ఏ కులానికి లేదా ఏ మతానికి చెందినవాడన్న విషయాన్ని కోర్టు పట్టించుకోదని తెలిపింది. అలాంటప్పుడు ఈ కేసులో నిందితుడి కులాన్ని ఎందుకు ప్రస్తావించారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించింది. తీర్పు ఇచ్చిన తర్వాత టైటిల్ నుండి కులాన్ని తొలగించేలా తీర్పులో సవరణలు చేస్తామని తెలిపింది. నిందితుడికి ట్రయల్ కోర్టు జీవిత ఖైదు విధించగా దానిని హైకోర్టు 12 సంవత్సరాలకు తగ్గించింది. నిందితుడి వయసు తక్కువగా ఉండడం, పేద ఎస్సీ కులానికి చెందినవాడు కావడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంది. పైగా నిందితుడు 2014 మే నుంచి జైలులోనే ఉన్నాడన్న విషయాన్నీ గమనంలోకి తీసుకుంది.

ఇన్‌ఛార్జీలు వీరే..

(మొదటిపేజీ తరువాయి)

15. వేములవాడ - మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్
16. మానకొండూరు - సుడా చైర్మెన్ జీవీ రామకృష్ణ
17. మెదక్ - కే తిరుపతి రెడ్డి (మెదక్)
18. అందోల్ -మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్
19. నర్సాపూర్ - ఎమ్మెల్సీ వెంకటరాం రెడ్డి
20. జహీరాబాద్ - మాజీ చైర్మెన్ దేవీ ప్రసాద్
21. సంగారెడ్డి - చైర్మెన్ వీ భూపాల్ రెడ్డి, చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్
22. దుబ్బాక - చైర్మెన్ బాలమల్లు
23. గజ్వేల్ - మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, చైర్మెన్ ప్రతాప్ రెడ్డి
24. మల్కాజ్‌గిరి - ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు
25. ఉప్పల్ - చైర్మెన్ రావుల శ్రీధర్ రెడ్డి
26. ఇబ్రహీంపట్నం - మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణా రెడ్డి
27. చేవెళ్ల - ఎంపీ రంజిత్ రెడ్డి
28. వికారాబాద్ - ఎంపీ రంజిత్ రెడ్డి
29. ముషీరాబాద్ - ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్
30. అంబర్‌పేట్ - కట్టెల శ్రీనివాస్ యాదవ్, అడ్వకేట్ మోహన్ రావు
31. సికింద్రాబాద్ కంటోన్మెంట్ - మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
32. మక్తల్ - చైర్మెన్ ఆంజనేయులు గౌడ్
33. గద్వాల్ -మాజీ చైర్మెన్ రాకేశ్ చిరుమళ్ల
34. అలంపూర్ - ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామ్ రెడ్డి
35. అచ్చంపేట - చైర్మెన్ ఇంతియాజ్ ఇషాక్
36. కల్వకుర్తి- చైర్మెన్ గోలి శ్రీనివాస్ రెడ్డి
37. కొల్లాపూర్ - ఎంపీ రాములు
38. నాగార్జున సాగర్ - ఎమ్మెల్సీ కోటి రెడ్డి, రామచంద్ర నాయక్
39. హుజూర్ నగర్ - విజయసింహా రెడ్డి (నల్లగొండ)
40. కోదాడ - ఎమ్మెల్సీ టీ.రవీందర్ రావు
41. నల్లగొండ - జడ్పీ చైర్మెన్ బండా నరేందర్ రెడ్డి
42. నకిరేకల్ - ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్
43. జనగామ - మాజీ ఎమ్మెల్సీ బీ వెంకటేశ్వర్లు,చైర్మెన్ రాజయ్య, హరీశ్‌రావు
44. మహబూబాబాద్ - మంత్రి సత్యవతి రాథోడ్
45. నర్సంపేట - చైర్మెన్ వీప్రకాశ్
46. వరంగల్ ఈస్ట్ - మండలి డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాశ్
47. భూపాలపల్లి - ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య
48. ములుగు - ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి
49. ఇల్లందు - ఎంపీ వద్దిరాజు రవిచంద్ర
50. మధిర -మంత్రి పువ్వాడ అజయ్, కొండబాల కోటేశ్వర్ రావు
51. వైరా - ఎంపీ నామా నాగేశ్వర్ రావు
52. సత్తుపల్లి - ఎంపీ పార్థసారథి రెడ్డి
53. అశ్వరావుపేట - శేషగిరావు (ఖమ్మం డీసీఎంఎస్)
54. భద్రాచలం - ఎమ్మెల్సీ తాత మధు



దాయాదుల దోస్తీ!

క్రికెట్ పిచ్‌పై భారత్, పాకిస్థాన్ ఎప్పుడు పోటీపడినా ప్రపంచం మరో రసవత్తర సమరానికి ఆస్వాదించేందుకు సిద్ధమైపోతుంది. అటువంటి సమరమే అక్టోబర్ 14 (శనివారం) మరోసారి క్రికెట్ అభిమానుల ముందుకు రానుంది. అహ్మదాబాద్ మొతెరా స్టేడియం వేదికగా దాయాదులు భారత్, పాకిస్థాన్ ఐసీసీ ప్రపంచకప్ పోరుకు సిద్ధమయ్యాయి. సరిహద్దు ఉద్రిక్తతల కారణంగా భారత్, పాకిస్థాన్ ద్వైపాక్షిక సంబంధాలు అత్యంత క్షీణ దశకు చేరుకున్నాయి. రాజకీయ కారణాలు సైతం జతకలవటంతో సరిహద్దుకు ఇరువైపులా క్రికెట్ అభిమానులు ఇరు జట్ల ఢీని మరో యుద్ధంగా పరిగణించే పరిస్థితి. 1947 నుంచి భారత్, పాకిస్థాన్ మూడు యుద్ధాల్లో తలపడ్డాయి. 1999 కార్గిల్ వార్ తర్వాత పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాలను భారత్ పూర్తిగా రద్దు చేసింది. ఈ రెండు దేశాల నడుమ యుద్ధాలు, ఉద్రిక్తతలు, కవ్వింపులు ఎన్ని ఉన్నప్పటికీ.. ఇరు వైపుల క్రికెటర్లు మాత్రం ఎప్పుడూ దాయాదుల దోస్తీ చాటుతూనే ఉన్నారు!.

భారత్, పాకిస్థాన్ ద్వైపాక్షిక సంబంధాలతో సంబంధం లేకుండా.. క్రికెటర్లు పరస్పర గౌరవం, అభిమానం, సోదరభావం ప్రదర్శించారు. అందుకు చరిత్ర సజీవ సాక్షి. ఇటీవల ఆసియా కప్‌లో దాయాదుల సూపర్-4 మ్యాచ్ అనంతరం పాకిస్థాన్ స్టార్ పేసర్ షహీన్ షా అఫ్రిది నుంచి భారత పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రాకు ఓ బహుమతి అందింది. బుమ్రా కూతురు కోసం అఫ్రిది గిఫ్ట్ ఇవ్వటం ఇరు దేశాల అభిమానుల హృదయాలను హత్తుకుంది. 2022లో మహిళల క్రికెటర్లకు సంబంధించి ఓ ఫోటో సైతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పాకిస్థాన్ జట్టు కెప్టెన్ బిస్మా మరూఫ్ కూతురును ముద్దుచేసేందుకు హర్మన్‌ప్రీత్ కౌర్ గ్యాంగ్ ఆ బేబీ చుట్టూ గుమికూడింది. మరూఫ్ కూతురుతో భారత క్రికెటర్ల సెల్ఫీ ఫోటో సోషల్ మీడియాను షేక్ చేసింది.

సరిహద్దు ఉద్రిక్తతలు ఇరు దేశాల నడుమ క్రికెట్ సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపాయి. భారత్, పాకిస్థాన్ ద్వైపాక్షిక క్రికెట్‌కు దూరంగా ఉండటం ఇప్పుడు తొలిసారి కాదు. ఎన్నో పర్యాయాలు దాయాది దేశాలు ద్వైపాక్షిక క్రికెట్‌ను కోల్పోయాయి. 1999 కార్గిల్ వార్ తర్వాత ఇరు దేశాలు క్రికెట్ సంబంధాలను రద్దు చేశాయి. 15 ఏండ్ల సుదీర్ఘ విరామానికి తెరదించుతూ 2003లో టీమ్ ఇండియా తొలిసారి పాకిస్థాన్ గడ్డపై కాలుమోపింది. 2008 ముంబయి ఉగ్రదాడితో ద్వైపాక్షిక క్రికెట్ మళ్లీ మరుగునపడింది. 2012 నుంచి భారత్, పాకిస్థాన్ ఒక్క ద్వైపాక్షిక సిరీస్‌లోనూ ఆడలేదు. అప్పట్నుంచి ఐసీసీ, ఏసీసీ క్రికెట్ టోర్నీల్లోనే దాయాది జట్లు పోటీపడుతున్నాయి.

భారత్, పాకిస్థాన్ క్రికెటర్ల బంధం ఎల్లప్పుడూ బలంగానే ఉన్నాయి. 1947 నుంచి ఇరు దేశాల జెంటిల్‌మెన్.. ఆ మైత్రి



బంధం కొనసాగిస్తున్నారు. 1947లో పుణెలో ఆగస్టు 15న ఏర్పాటు చేసిన ఓ క్యాంప్‌కు ముఖ్య అతిథిగా అవిభాజ్య భారత జట్టు సభ్యుడు ఫజల్ మహ్మద్‌ను ఆహ్వానించారు. హిందూ-ముస్లిం మత ఘర్షణలతో సరిహద్దుల్లో నెత్తుటిధారలు పారుతున్న సమయంలో లాహోర్ నుంచి సాహోసేపతంగా ఫజల్ మహ్మద్ పుణెకు చేరుకున్నా.. స్థానిక పరిస్థితుల కారణంగా ఆ క్యాంప్ రద్దు చేయాల్సి వచ్చింది. ఈ ప్రయాణంలో ఫజల్‌కు తోడుగా భారత జట్టు ప్రథమ కెప్టెన్ సికె నాయుడు ఉన్నారు. రైల్లో ఫజల్‌ను గుర్తుపట్టి కొందరు దాడికి యత్నించగా.. క్రికెట్ బ్యాట్ పట్టుకుని అతివాదులకు నాయుడు వార్నింగ్ ఇచ్చి కాపాడినట్టు ఫజల్ తన జీవితకథలో రాసుకొచ్చారు. భారత క్రికెట్ మూలస్తంభాల్లో ఒకరుగా నాయుడు సుపరిచితుడు. తొలితరం పాకిస్థాన్ బౌలింగ్ దిగ్గజం ఫజల్ మహ్మద్. సికె నాయుడు పూర్వీకులు ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నంకు చెందిన వారు కావటం గమనార్హం.

1987 ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్‌లోనూ గుండెలను హత్తుకునే సన్నివేశాలు చోటుచేసుకున్నాయి. రంగుల పండుగ 'హోలీ' సమయంలో మ్యాచ్ ఉండటంతో.. హోటల్‌లో దాయాది క్రికెటర్లు రంగుల సందడి చేశారు. హోటల్ స్విమ్మింగ్‌పూల్ రంగులతో నిండిపోగా.. ఇరు జట్లకు హోటల్ మేనేజ్‌మెంట్ సుమారు రూ.50 వేలు జరిమానా విధించారు. మ్యాచ్‌కు ముందు పండుగ సందడి చేసిన క్రికెటర్లు.. ఆ మరుసటి రోజు మైదానంలో క్రికెట్ పిచ్‌పై సమరాన్ని షురూ చేశారని అప్పటి భారత జట్టు కెప్టెన్ కిరణ్ మోరె గుర్తు చేశారు. ఆ సమయంలో భారత్, పాకిస్థాన్ ద్వైపాక్షిక సిరీస్‌లు, ఇరు దేశాల పర్యటనలు సర్వసాధారణం.

ఆ మైత్రీ బంధం అక్కడితో ముగియలేదు. గత ఏడాది మన స్పిన్ దిగ్గజం బిషన్ సింగ్ బేడీ పాకిస్థాన్‌లోని సిక్కు దేవాయలం సందర్శనకు వెళ్లారు. అప్పుడు పాకిస్థాన్ మాజీ క్రికెటర్లు బేడీని కలిసేందుకు వెల్లువలా వెళ్లారు. బిషన్ సింగ్ కోసం పాక్ మాజీ కెప్టెన్ ఇంతీకాబ్ ఆలం ఏకంగా గాయకుడి అవతారం ఎత్తాడు. భారత్‌లో జన్మించిన ఆలం.. విభజన అనంతరం పాకిస్థాన్‌కు వెళ్లారు. 2004లో జన్మభూమికి తిరిగొచ్చిన ఆలం.. పంజాబ్ జట్టుకు కోచ్‌గా పని చేశారు. భారత దేశవాళీ జట్టుకు కోచ్‌గా పని చేసిన తొలి విదేశీయుడిగా ఆలం నిలిచారు.

దశాబ్దాలు గడుస్తున్నా.. దాయాది దేశాల క్రికెటర్ల నడుమ స్నేహ, సోదరభావం కొనసాగుతుంది. భారత క్రికెట్ సూపర్ స్టార్ విరాట్ కోహ్లి, పాకిస్థాన్ క్రికెట్ స్టార్ బాబర్ ఆజామ్‌లు ఎన్నో వేదికలపై పరస్పర గౌరవం, అభిమానం చాటుకునేందుకు వెనుకడుగు వేయలేదు. సరిహద్దుకు ఇరువైపుల అభిమానులు సైతం భారత్, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌ను క్రీడా స్ఫూర్తితో చూసేందుకు ఇష్టపడుతున్నారు. అతివాదుల గొడవ అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ ఉండేదే అయినా.. మైదానంలో క్రికెటర్లు, మైదానం బయట అభిమానులు క్రీడా స్ఫూర్తి చాటుతూ దాయాదుల సమరాన్ని మరింత రక్తికట్టిస్తున్నారు!.

-నవతెలంగాణ క్రీడావిభాగం



హంగామా మొదలైంది

- 14న భారత్, పాక్ వరల్డ్‌కప్ పోరు
- అహ్మదాబాద్‌కు క్రికెట్ జ్వరం

నవతెలంగాణ-అహ్మదాబాద్

చెపాక్‌లో భారత్, ఆస్ట్రేలియా పోరుతో ఐసీసీ 2023 ప్రపంచకప్ సిసలైన సందడి షురూ కాగా.. తాజాగా శనివారం భారత్, పాకిస్థాన్ మహా మ్యాచ్‌తో అహ్మదాబాద్ క్రికెట్ ఫీవర్‌తో ఊగిపోతుంది. పొరుగు దేశాల క్రికెట్ సమరం చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో అహ్మదాబాద్‌కు చేరుకుంటున్నారు. హైదరాబాద్‌లో రెండు వారాలు గడిపిన పాకిస్థాన్.. ఉప్పల్‌లో రెండు వార్మప్, రెండు వరల్డ్‌కప్ మ్యాచులు ఆడింది. రెండు వార్మప్‌ల్లో ఓడినా.. ప్రపంచకప్ మ్యాచుల్లో సత్తా చాటింది. వరల్డ్‌కప్‌లో కీలక మూడో మ్యాచ్ కోసం బుధవారమే బాబర్ ఆజామ్ సేన అహ్మదాబాద్‌లో అడుగుపెట్టింది. స్థానిక సంస్కృతి, నృత్య ప్రదర్శనల నడుమ పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు గుజరాత్‌లో ఘన స్వాగతం పలికింది.

హాస్పిటల్స్‌కు క్యూ : భారత్, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో అహ్మదాబాద్‌లో హోటల్ రూమ్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. సాధారణ ధరలతో పోల్చితే ఇప్పుడు 20 రెట్లు అధికంగా టారీఫ్ వసూలు చేస్తున్నారు. దీంతో సాధారణ అభిమానులు హోటల్ రూమ్ వైపు చూసే పరిస్థితి లేదు. దీంతో హాస్పిటల్‌లో ఏదో ఒక చెకప్ పేరుతో చేరేందుకు మొగ్గు చూపుతున్నారు. మొతెరా స్టేడియం చుట్టుపక్కల హాస్పిటల్స్‌లో అనూహ్యంగా ఇన్ పేషంట్స్ చేరిక ఎక్కువైనట్టు అహ్మదాబాద్ మెడికల్ అసోసియేషన్ తెలిపింది. వైద్య పరీక్షల ప్రత్యేక ప్యాకేజీలు తీసుకునేవారు హాస్పిటల్‌లో ఉండాల్సి ఉంటుంది. దీంతో క్రికెట్ అభిమానులు ఈ మార్గం ఎంచుకుంటున్నారు.

భారీ భద్రత : దాయాదుల మ్యాచ్‌కు అహ్మదాబాద్ పోలీసులు భారీ భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం మ్యాచ్‌కు ఏకంగా 11000 మంది పోలీసులు మొతెరా స్టేడియం వద్ద భద్రతా వలయం సృష్టించనున్నారు. శుక్రవారం ఇరు జట్ల ప్రాక్టీస్ సెషన్లకు సైతం ఇదే స్థాయిలో బలగాలను మోహరించనున్నారు.

గిల్ వచ్చేశాడు : డెంగీ జ్వరంతో బాధపడుతున్న టీమ్ ఇండియా యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ అహ్మదాబాద్‌కు చేరుకున్నాడు. ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోవటంతో చెన్నైలోని ఓ ఆసుపత్రిలో చేరిన శుభ్‌మన్ గిల్ గురువారమే అహ్మదాబాద్‌కు చేరుకున్నాడు. ఈ సమయంలో ప్రయాణం సురక్షితం కాదని వైద్యులు సూచించినా.. గిల్ చెన్నైకి వీడినట్టు తెలుస్తోంది!. గుజరాత్ టైటాన్స్ తరఫున అహ్మదాబాద్‌ను సొంత మైదానంగా మార్చుకున్న గిల్ ఇక్కడ తిరుగులేని రికార్డులు నెలకొల్పాడు. ఈ ఏడాది వన్డే ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన శుభ్‌మన్ గిల్.. శనివారం పాకిస్థాన్‌తో మ్యాచ్‌కు అత్యంత కీలకం. కానీ గిల్ తుది జట్టు ఎంపికకు అందుబాటులో ఉంటాడా లేదా అనేది తెలియాల్సి ఉంది.

ఆరు తప్పిదాలతో ఆసీస్ ఓటమి

134 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా గెలుపు



లక్నో: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో ఐదుసార్లు ఛాంపియన్ ఆస్ట్రేలియా జట్టు మరో ఓటమిని చవిచూసింది. గురువారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో ఆసీస్ జట్టు 134 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో ఓటమిపాలైంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 311పరుగులు చేయగా.. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆస్ట్రేలియా 40.5 ఓవర్లలో 177 పరుగులకే కుప్పకూలింది. ఆసీస్ ఓటమికి ఫీల్డర్లు వదిలేసిన ఆరు క్యాచ్‌లే ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. తొలుత దక్షిణాఫ్రికాను ఓపెనర్లు డికాక్, కెప్టెన్ బవుమా సెంచరీ భాగస్వామ్యంతో ఆదుకున్నారు. వీరిద్దరూ కలిసి తొలి వికెట్‌కు 108 పరుగులు జతచేశారు. ఈ క్రమంలో కెప్టెన్ బవుమా వ్యక్తిగత స్కోర్ 35 పరుగుల వద్ద ఔటయ్యాడు. ఆ తర్వాత డికాక్(109) సెంచరీకి తోడు మార్క్‌క్రమ్(56) అర్ధసెంచరీతో మెరిసాడు. జట్టు స్కోర్ 197 పరుగుల వద్ద డీకాక్ మూడో వికెట్‌గా ఔటయ్యాడు. చివర్లో క్లాసెన్(29), జెన్సన్(26) కూడా బ్యాట్ ఝుళిపించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్, గ్లెన్ మ్యాక్స్‌వెల్‌కు రెండేసి, హేజిల్‌వుడ్, కమిన్స్, జంపాకు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో ఆస్ట్రేలియా జట్టు ఓపెనర్ మిచెల్ మార్ష్(7) వికెట్‌ను త్వరగా కోల్పోయింది. వార్నర్(13), స్మిత్(19)కి తోడు ఇంగ్లీస్(5), మ్యాక్స్‌వెల్(3), స్టాయినీస్(8) సింగిల్ డిజిట్‌కే పెవీలియన్‌కు చేరారు. దీంతో ఆసీస్ జట్టు 70 పరుగులకే 6వికెట్లు కోల్పోయి ఓటమి కోరల్లో నిలిచింది. లబూషేన్(46) టాప్ స్కోరర్. చివర్లో స్టార్క్(27), కమిన్స్(22) రెండంకెల స్కోర్ చేశారు. రబడాకు మూడు, మహరాజ్, షాంసీ, జెన్సన్‌కు రెండేసి, ఎన్గిడికి ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ డికాక్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు..

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (బి)మ్యాక్స్‌వెల్ 109, బవుమా (సి)వార్నర్ (బి)మ్యాక్స్‌వెల్ 35, డుస్సెల్ (సి-సబ్)అబాట్ (బి)జంపా 26, మార్క్‌క్రమ్ (సి)హేజిల్‌వుడ్ (బి)కమిన్స్ 56, క్లాసెన్ (సి)ఇంగ్లీస్ (బి)హేజిల్‌వుడ్ 29, మిల్లర్ (బి)స్టార్క్ 17, జెన్సన్ (సి)వార్నర్ (బి)స్టార్క్ 26, రబడా (నాటౌట్) 0, మహరాజ్ (నాటౌట్) 0, అదనం 13. (50 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 311పరుగులు.

వికెట్ల పతనం: 1/108, 2/158, 3/197, 4/263, 5/267, 6/310, 7/311

బౌలింగ్: స్టార్క్ 9-1-53-2, హేజిల్‌వుడ్ 9-0-60-1, మ్యాక్స్‌వెల్ 10-1-34-2, కమిన్స్ 9-0-71-1, జంపా 10-0-70-1, మిచెల్ మార్ష్ 1-0-6-0, స్టొయినీస్ 2-0-11-0

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: మిచెల్ మార్ష్ (సి)బవుమా (బి)జెన్సన్ 7, వార్నర్ (సి)డుస్సెన్ (బి)ఎన్గిడి 13, స్టీవ్ స్మిత్ (ఎల్‌బి)రబడా 19, లబూషేన్ (సి)బవుమా (బి)మహరాజ్ 46, ఇంగ్లీస్ (బి)రబడా 5, మ్యాక్స్‌వెల్ (సి అండ్ బి) మహరాజ్ 3, స్టొయినీస్ (సి)డికాక్ (బి)రబడా 5, స్టార్క్ (సి)డికాక్ (బి)జెన్సన్ 27, కమిన్స్ (సి)మిల్లర్ (బి)షాంసీ 22, జంపా (నాటౌట్) 11, హేజిల్‌వుడ్ (సి)రబడా (బి)షాంసీ 2, అదనం 17. (40.5ఓవర్లలో ఆలౌట్) 177పరుగులు.

వికెట్ల పతనం: 1/27, 2/27, 3/50, 4/56, 5/65, 6/70, 7/139, 8/143, 9/175, 10/177

బౌలింగ్: ఎన్గిడి 9-2-18-1, జెన్సన్ 7-0-54-2, రబడా 8-1-33-3, మహరాజ్ 10-0-30-2, షాంసీ 7.5-0-16-2.

జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి చేస్తాం!

హానెస్ట్, హార్డ్‌వర్కింగ్ హెచ్‌సీఏ ప్యానల్



నవతెలంగాణ-హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అంటే హైదరాబాద్ మాత్రమే కాదు.. తెలంగాణ సైతం అందులో భాగమే. రానున్న మూడేండ్లలో జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధికి కృషి చేయటంతో పాటు అవినీతి రహిత హెచ్‌సీఏను అందిస్తామని హానెస్ట్, హార్డ్‌వర్కింగ్ ప్యానల్ ప్రకటించింది. అక్టోబర్ 20న జరుగనున్న ఎన్నికల్లో ఈ ప్యానల్ పోటీ చేయనుంది. అధ్యక్ష, కార్యదర్శులుగా పిఎల్ శ్రీనివాస్, ఆర్ఎం భాస్కర్‌లు పోటీ చేయనుండగా.. జెరార్డ్ కార్ (కోశాధికారి), సి బాబురావు (ఉపాధ్యక్షుడు), రోహిత్ అగర్వాల్ (సంయుక్త కార్యదర్శి)గా నిలబడుతున్నారు. కౌన్సిలర్‌గా డిఏజె వాల్టర్ పోటీ చేయనున్నారు. ఈ మేరకు గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో హానెస్ట్, హార్డ్‌వర్కింగ్ హెచ్‌సీఏ ప్యానల్ ప్రకటించింది.

వినూత్న రీతిలో టైగర్ 3 ప్రమోషన్లు



కత్రినా కైఫ్, సల్మాన్‌ఖాన్

ఇప్పటి వరకు క్రికెట్ వరల్డ్ కప్ హిస్టరీతో అసోసియేషన్ అయిన బిగ్గెస్ట్ చిత్ర నిర్మాణ సంస్థగా యష్ రాజ్ ఫిలిమ్స్ చరిత్ర సృష్టించనుంది. వరల్డ్ కప్ బ్రాడ్ కాస్ట్ నెట్ వర్క్ అయిన స్టార్ స్పోర్ట్స్‌తో వైఆర్‌ఎఫ్ సంస్థ చేతులు కలిపింది. దీంతో కనువినీ ఎరుగని రీతిలో దీపావళికి రిలీజ్ కానున్న 'టైగర్ 3' చిత్రాన్ని ప్రమోట్ చేయనున్నారు.

ఈ అసోసియేషన్ వల్ల ప్రస్తుతం జరుగుతున్న వరల్డ్ కప్ అంతా ఈ మూవీ ప్రమోషన్స్ పరంగా మారు మోగించనుంది. క్రికెట్ వరల్డ్ కప్‌లో జరుగుతున్న మ్యాచ్‌లన్నింటిలో వైఆర్‌ఎఫ్ సంస్థ ఈ చిత్రాన్ని ప్రమోట్ చేయనుందని ట్రేడ్ వర్గాలు పేర్కొన్నాయి.

మరీ ముఖ్యంగా ఇండియా, పాకిస్థాన్ దేశాల మధ్య జరగబోతున్న మ్యాచ్‌లో ఈ సినిమా గురించి ప్రమోట్ చేయనున్నారు. దీని కోసం బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ క్రికెట్ వరల్డ్ కప్ కో బ్రాండింగ్ ప్రోమోస్‌లో నటించటం విశేషం. ఈ ప్రోమోస్‌ను ఈ వన్డే క్రికెట్ వరల్డ్ కప్ కీలక మ్యాచుల్లో ప్రదర్శిస్తారు. ఇప్పటి వరకు ఇండియన్ ఫిల్మ్ మార్కెటింగ్‌లో ఇదే భారీ అసోసియేషన్ మార్కెటింగ్ స్ట్రాటజీ అని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. 2019లో జరిగిన వరల్డ్ కప్ మ్యాచ్‌లను 500 మిలియన్స్‌కు పైగా వీక్షించారు. వీటిల్లో కేవలం ఇండియా, పాకిస్థాన్ మ్యాచ్‌ను 200 మిలియన్స్‌కు పైగా చూశారు. ఇక 2023లో ఈ సంఖ్య మరింత భారీగా పెరగనుంది. ఇది టైగర్ 3 చిత్రానికి బాగా ప్లస్ కానుంది. యష్ రాజ్ ఫిలిమ్స్ స్పై యూనివర్స్‌లో రూపొందుతోన్న ఈ చిత్రాన్ని మనీష్ శర్మ దర్శకత్వంలో ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు. సల్మాన్ ఖాన్ సరసన కత్రినా కైఫ్ నటించిన ఈ చిత్రం దీపావళికి రిలీజ్ కానుంది.

అన్ని రకాల ఎమోషన్స్ ఉన్నాయి



శివ కంఠమనేని

'అక్కడొకడుంటాడు' ఫేమ్ శివ కంఠమనేని హీరోగా నటించిన హై ఓల్టేజ్ యాక్షన్ డ్రామా 'మధురపూడి గ్రామం అనే నేను'. మల్లి దర్శకత్వం వహించగా, క్యాథలిన్ గౌడ హీరోయిన్‌గా నటించారు.

ముప్పా వెంకయ్య చౌదరి సారథ్యంలో జి.రాంబాబు యాదవ్ సమర్పణలో లైట్ హౌస్ సినీ మ్యాజిక్ పతాకంపై కేఎస్ శంకర్ రావు, ఆర్. వెంకటేశ్వరరావు సంయుక్తంగా నిర్మించారు. ఈనెల 13న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో శివ కంఠమనేని మీడియాతో మాట్లాడుతూ, 'నేను హీరోగా నటించిన 'అక్కడొకడుంటాడు'చిత్రం బి, సి సెంటర్లలో బాగా ఆడింది. ఆ సినిమాలోని ఓ పోస్టర్‌ను ఈ మూవీ డైరెక్టర్ మల్లి చూశారు. తను రాసుకున్న కథకు నేను అయితే సెట్ అవుతానని అనుకున్నారు. ఇది రెగ్యులర్ హీరోలు చేసే కథ కాదని, నేను అయితే బాగుంటానని నన్ను అప్రోచ్ అయ్యారు. ఇందులో నేను సూరి అనే పాత్రను పోషించాను. సూరి, బాబ్జీ.. దుర్యోధనుడు, కర్ణుడు లాంటి పాత్రలు. బాబ్జీ పొలిటికల్‌గా ఎదగడానికి సూరి చేసిన పనులేంటి? ఫ్రెండ్ కోసం సూరి ఎంత దూరం వెళ్తాడు?, ఈ మధ్యలో ప్రేమ కథ ఎలా మొదలైంది? అనేవి చాలా ఆసక్తికరంగా ఉంటాయి. ఈ సినిమాలోని పాత్ర కోసం మెథడ్ యాక్టింగ్ చేయాల్సి వచ్చింది. సూరి పాత్రలోకి పరకాయ ప్రవేశం చేయడం అనేది కూడా కష్టమైన పనే.. అలాగే పాత్ర కోసం ఒంగోలు యాసను కూడా ట్రై చేశాం. ఇది ఊరికి సంబంధించిన కథ. 'నా శరీరం ఎప్పుడూ పచ్చగా ఉండదు.. అప్పుడప్పుడు మనషుల రక్తంతో తడిసి ఎర్రగా అవుతుంది' అని ఊరు తన కథను చెబుతుంటుంది. ఒక ఊరి ఆత్మ కథలా అనిపిస్తుంది. పూర్తిగా విలేజ్‌లో జరిగే కథ ఇది. గ్రామంలో జరిగే అన్ని రకాల సంఘటనలు, అన్ని ఎమోషన్స్‌ను చూపించాం. కథకి తగ్గట్టు ఈ సినిమాలోని ఆర్ఆర్‌ని మణిశర్మ అద్భుతంగా చేశారు. అలాగే ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. మొదట ఈ సినిమాను 100-120 థియేటర్స్‌లో రిలీజ్ చేద్దాం అనుకున్నాం. అయితే బి, సి సెంటర్స్‌లో మేం ఊహించిన దానికంటే మంచి రెస్పాన్స్ వస్తోంది. దీంతో థియేటర్ల సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉంది' అని చెప్పారు.

ప్రస్తుతం మంచు లక్ష్మీ 'ఆదిపర్వం'లో ఒక పవర్ ఫుల్ రోల్ చేస్తున్నాను. 'మణిశంకర్', 'రాఘవరెడ్డి' చిత్రాలు రాబోతున్నాయి. వీటిల్లో లాయర్, ఫ్యాక్షనిస్ట్ ఇలా రకరకాల పాత్రలను పోషిస్తున్నాను. కథా బలం ఉన్న చిత్రాలు, నటనకు బాగా స్కోప్ ఉండే సినిమాలపై ఆసక్తి చూపిస్తున్నాను.

నవచిత్రం


సైంధవ్ వరల్డ్ ఎలాంటిది?



వెంకటేష్

వెంకటేష్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా మూవీ 'సైంధవ్'. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులను శరవేగంగా జరుపుకుంటోంది. జనవరి 13న సంక్రాంతికి ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర టీజర్‌ను ఈనెల 16న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహాని శర్మ, ఆండ్రియా జెరెమియా, బేబీ సారా, జయప్రకాష్ వంటి తారాగణం నటిస్తోంది. చిత్ర గ్లింప్స్ అన్ని ప్రధాన పాత్రలను పరిచయం చేస్తే, 'సైంధవ్' వరల్డ్ గురించి టీజర్ ఇన్‌సైట్ ఇవ్వనుంది.

ఇక టీజర్‌తో సందడి



మృణాల్ ఠాకూర్, నాని

నాని తాజాగా నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'హాయ్ నాన్నా'. ఈ పాన్ ఇండియా చిత్రం గ్లింప్స్‌కు దేశవ్యాప్తంగా అద్భుతమైన స్పందన వచ్చింది. మొదటి రెండు పాటలు చార్ట్ బస్టర్స్‌గా నిలిచాయి. మేకర్స్ ఇప్పుడు ఈ సినిమా టీజర్‌కి సంబంధించిన అప్‌డేట్ ఇచ్చారు. ఈ చిత్ర టీజర్ ఈనెల 15న విడుదల కానుంది. టీజర్ పోస్టర్‌లో లీడ్ పెయిర్ -నాని, మృణాల్ ఠాకూర్ డ్రీమ్ కెమిస్ట్రీని చూపిస్తుంది. ఈ చిత్రానికి సంబంధించిన కోర్ పాయింట్‌ను టీమ్ ఇంకా వెల్లడించకపోవడంతో ప్రేక్షకులు, నాని అభిమానులు టీజర్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. శౌర్యువ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటిస్తుండగా, బేబీ కియారా ఖన్నా నాని కుమార్తెగా కనిపించనుంది.

వైర ఎంటర్‌టైన్ మెంట్స్‌పై మోహన్ చెరుకూరి (సివిఎం), డాక్టర్ విజయేం దర్ రెడ్డి తీగల ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం డిసెంబర్ 21న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

కన్నప్పలో మరో స్టార్..



శివ రాజ్‌కుమార్

విష్ణు నటిస్తూ నిర్మిస్తున్న ప్రాజెక్ట్ 'కన్నప్ప'. ఇప్పటికే ఈ చిత్రంలో ప్రభాస్, మోహన్‌లాల్ వంటి అగ్రకథానాయకులు ముఖ్య పాత్రల్ని పోషిస్తూ ఈ సినిమాలో భాగమయ్యాయి. తాజాగా కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్‌కుమార్ మరో ముఖ్య పాత్రలో కనిపించబోతున్నారు. ఇలా ప్రతీ ఇండస్ట్రీలోని సూపర్ స్టార్ ఈ సినిమాలో పార్ట్ కావడంతో అందరి ఫోకస్ ఈ మూవీపైనే ఉంది.

బుల్లితెరపై మహాభారతం సీరియల్‌ను తీసిన ముఖేష్ కుమార్ సింగ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. శివ భక్తుడైన కన్నప్ప కథను ఆధారంగా తీసుకుని చేస్తున్న ఈ మూవీలో కన్నప్పగా మంచు విష్ణు నటిస్తున్నారు. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయి మాధవ్, తోట ప్రసాద్ రచనా సహకారం అందిస్తున్నారు.

ప్రేక్షకులకు కృతజ్ఞతలు



రత్నం కృష్ణ

'రూల్స్ రంజన్ నాకు ఎప్పటికీ ప్రత్యేకమైన సినిమా. ప్రేమ నేపథ్యంలో పూర్తి వినోదాత్మకంగా రూపొందించి మీ అందరి ముఖాల్లో చిరునవ్వులు నింపడానికి చేసిన ప్రయత్నమిది. ఇది విడుదలైనప్పటి నుండి ప్రేమతో ముంచెత్తినందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు తెలియ జేస్తున్నాను' అని దర్శకుడు రత్నం కృష్ణ తెలిపారు. కిరణ్ అబ్బవరం, నేహాశెట్టి జంటగా నటించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైన విశేష ప్రేక్షకాదరణ పొందింది. ఈ సినిమాని సక్సెస్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్ చెబుతూ దర్శకుడు రత్నం కృష్ణ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. 'నటీనటులు, సాంకేతిక నిపుణులు, నా నిర్మాతలు, నా అసిస్టెంట్లు ఇలా మొత్తం టీమ్ లేకుండా ఇది సాధ్యమయ్యేది కాదు. భవిష్యత్తులో మంచి కథలతో మిమ్మల్ని మరింత అలరిస్తాను' అని రత్నం కృష్ణ తెలిపారు.

అద్భుతమైన రోడ్ జర్నీ సినిమా



పూర్తిగా లడఖ్ ప్రాంతంలో తెరకెక్కించిన మొదటి భారతీయ చిత్రం 'ఆన్ ది రోడ్'.

ఈ సినిమా తెలుగు, హిందీ, కన్నడ, తమిళ, మలయాళ భాషలలో విడుదలకు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్లను, ట్రైలర్లను విడుదల చేశారు. సినిమాలోని విజువల్ మూడ్‌ను, స్టైలిష్ లుక్‌ను మెచ్చుకోవడంతోపాటు ఇలాంటి అవుట్ పుట్ తీసుకువచ్చేందుకు కృషి చేసిన చిత్ర టీమ్ మెంబర్స్‌ను ఆయన ప్రశంసించారు. గతంలో రామ్ గోపాల్ వర్మతో కలిసి పలు చిత్రాలకు పని చేసిన సూర్య లక్కోజు ఎస్‌పీఎల్ పిక్చర్స్ బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మించారు. దీనికి రాజేష్ శర్మ సహ నిర్మాత.

నిర్మాత, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షులు ముత్యాల రాందాస్ ఈ సినిమా విడుదలకు సహకారం అందిస్తూ ఈ ప్రాజెక్టులో భాగం అయ్యారు. ఆయన ఈ చిత్రం గురించి మాట్లాడుతూ,'ట్రైలర్, సినిమా చాలా ప్రత్యేకంగా ఉన్నాయి. తప్పకుండా ప్రేక్షకాదరణ పొందుతుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు.

'వెస్టర్న్ ఫిల్మ్ జోనరైన రోడ్ ట్రిప్ చిత్రాలంటే నాకు ఇష్టం. అందుకే ఒక సింపుల్ కథను బడ్జెట్ పరిమితులు ఉన్నప్పటికీ లడఖ్‌లోని సుందరమైన ప్రదేశాల్లో చిత్రీకరించాం. ఇదొక రోడ్ ట్రిప్ థ్రిల్లర్.అయినప్పటికీ సేఫ్‌గా రోడ్ ట్రిప్ ప్లాన్ చేసుకున్న ఒక జంటతో ఒక సాధారణ వ్యక్తి కలవడం, అతను వారితో ప్రయాణం మొదలు పెట్టిన తర్వాత చోటు చేసుకున్న కల్లోల సంఘటనలే ఈ చిత్ర కథాంశం' అని దర్శకుడు సూర్య లక్కోజు తెలిపారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.